


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
విశాఖ సిటీ
బుధవారం 9 ఆగస్టు 2017 | 16



నేడు అరకులో ఆదివాసీ దినోత్సవం







- హాజరుకానున్న గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబు నాయుడు
- ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు
- అలరించనున్న గిరిజన సంప్రదాయ నృత్యాలు

11

ట్రాఫిక్‌కు చెక్

విద్యా సంస్థలు..	17
కేటాయించిన సమయం..	ఉదయం 7.45 నుంచి 9.30 గంటలు
ప్రభావం చూపనున్న విద్యార్థుల సంఖ్య	20 వేలు
అమలు తేదీ	ఆగస్టు 10 నుంచి




గాజువాకలో ట్రాఫిక్‌జామ్

విద్యా సంస్థల వేళల్లో మార్పు

- ఒక్కో పాఠశాలకు ఒక్కో సమయం కేటాయింపు
- ఉదయం 7.45-9.30 గంటల మధ్య ప్రారంభం
- గాజువాక నుంచి శ్రీకారం
- జీవీఎంసీ, ట్రాఫిక్ సంయుక్త ప్రణాళిక
- విద్యార్థుల సంఖ్యను బట్టి వేళలు
- నగరంలోని అనేక ప్రాంతాల్లో ఇదే సమస్య
- దశలవారీగా అమలు చేస్తే ఫలితం

- వివరాలు 14వ పేజీలో

పెళ్లిసందడి



- నేటి నుంచి 16 వరకూ వందలాది పెళ్లిళ్లు
- రెండు నెలల క్రితమే కల్యాణ మండపాలు బుకింగ్

రాబోయే వారం రోజుల్లో నగరంలో వందలాది పెళ్లిళ్లు జరగనున్నాయి. వివాహాది శుభకార్యాలకు అత్యంత అనుకూలం శ్రావణమాసం. పైగా వచ్చే బాద్రపద మాసం శూన్యమాసం కావడం శుభముహూర్తాలు లేకపోవడం, అదే విధంగా ఆశ్వీయుజ మాసంలో అతితక్కువ ముహూర్తాలు వుండడం, కార్తీకమాసంలో కూడా శుభముహూర్తాలు లేకపోవడంతో బుధవారం మొదలుకొని ఈ నెల 16వ తేదీ వరకు భారీగా వివాహాలు జరగనున్నాయి.

16

సిట్ దూకుడు

- మాన్యువల్ భూముల రికార్డుల ట్యాంపరింగ్ వ్యవహారంలో ఐదుగురిపై క్రిమినల్ కేసు
- ఎమ్మెల్యే ఫిర్యాదు నేపథ్యంలో ఆర్డీవోకు షోకాజ్?
- మరోసారి మాజీ తహసీల్దార్ బీటీవీ రామారావు విచారణ




రామారావు

... మెయిన్‌లో

లీజుకు పోర్టు భూములు

- నగర నడిబొడ్డున 100 ఎకరాలు
- మూలకుద్దు, లంకెలపాలెంలో 1,576 ఎకరాలు
- వాణిజ్య, గృహ సముదాయాలకు ప్రాధాన్యం
- బిడ్డర్లకు ఆహ్వానం

7



చంద్రంపాలెంలో భారీ చోరీ

22.5 తులాల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి సామగ్రి, రూ.65 వేలు అపహరణ

- 10లో



కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

ఎంసెట్ బైపీసీ అభ్యర్థులకు కౌన్సెలింగ్ ప్రారంభం

తొలిరోజు 343 మంది ధ్రువపత్రాల పరిశీలన

కంచరపాలెం, ఆగస్టు 8:
ఎంసెట్ బైపీసీ గ్రూప్ అభ్యర్థులకు బీ.ఫార్మశీ, ఫార్మాడీ, బయో టెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు గాను కౌన్సెలింగ్ ప్రక్రియను మంగళవారం అధికారులు ప్రారంభించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీలో గల హెల్ప్ లైన్ కేంద్రాల వద్ద అధికారులు ర్యాంకుల ప్రకారం అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి ర్యాంకు నుంచి 15,000 ర్యాంకు వరకు గల అభ్యర్థులను కౌన్సెలింగ్‌కు పిలవగా 125 మంది హాజరయ్యారు. కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో 15,001 నుంచి 30 వేల ర్యాంకు వరకు గల అభ్యర్థులను పిలవగా 218 మంది హాజరై తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకున్నారు. ఈ రెండు కేంద్రాల్లో కలిపి 343 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి, రిజిస్ట్రేషన్లు చేసినట్టు కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు తెలిపారు.



విద్యార్థినికి ధ్రువపత్రం అందజేస్తున్న కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ దేముడు

కాగా బుధవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 30,001 నుంచి 40 వేల ర్యాంకు వరకు, కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో 40,001 నుంచి 50 వేల ర్యాంకు వరకు గల అభ్యర్థులకు కౌన్సెలింగ్ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఏయూ డిగ్రీ సెకండ్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ఎంవీపీకాలనీ, ఆగస్టు 8:
ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల సెకండ్ సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు మంగళవారం విడుదల చేశారు. ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచారు.

సెప్టెంబర్ 6న స్పెషల్ డ్రైవ్ పరీక్షలు

ఏయూ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల స్పెషల్ డ్రైవ్ పరీక్షలు సెప్టెంబర్ ఆరు నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఒక ప్రకటనలో తెలిపారు. టైమ్ టేబుల్, పరీక్ష కేంద్రాల వివరాలను త్వరలో వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు. పరీక్షలకు మూడు రోజుల ముందుగా పరీక్ష కేంద్రం నుంచి అభ్యర్థులు హాల్ టిక్కెట్లు తీసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాల గడువు పొడిగింపు

ఏయూ ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మశీ, న్యాయ కోర్సులలో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తు చేసేందుకు రూ.ఐదు వేల అపరాధ రుసుముతో ఈ నెల 21 వరకు పొడిగించినట్టు ఏయూ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య కె.రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

బీ కేర్‌ఫుల్..


ప్రమాదకరంగా ఓపెన్ డ్రైనేజీలు

భయాందోళన చెందుతున్న నగరవాసులు

పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

వర్షాకాలం దృష్ట్యా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్న జనం

పబ్లిక్ ప్రాబ్లమ్



ఫిషింగ్ హార్బర్ వద్ద కాలువపై పలకలు లేని దృశ్యం

ఓపెన్ డ్రైనేజీలకు మహా నగరవాసులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. జీవీఎంసీ అధికారులకు ఇవి కనిపిస్తున్నా... తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి తాము మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఓపెన్ డ్రైనేజీలను చూస్తే వెన్నులో వణుకు పుడుతుందని వాపోతున్నారు. భారీ వర్షాల సమయంలో కాలువల్లో నీరు అతివేగంగా ప్రవహించడం, రోడ్డుతో సమానంగా ఇవి కలిసిపోవడం... కాలువలు దాటే ప్రయత్నంలో చిన్నారులు వాటిలో జారిపడి మృతి చెందడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నా... అధికారుల తీరులో మాత్రం మార్పు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విశాఖపట్నం, ఆగస్టు 8:
మహా నగరంలో కొండవాలు ప్రాంతాలు ఎక్కువ. ఆయా ప్రాంతాల్లో కాలనీలు మరీ ఎక్కువ. ఈ కాలనీలకు సంబంధించిన చిన్న చిన్న డ్రైనేజీల నీరు పెద్ద కాల్వలకు చేరి దిగువకు ప్రవహిస్తుంది. గతంలో ఈ కాల్వల నీరు నగరంలో ఉండే విశాలమైన గెడ్డల నుంచి దిగువకు సాఫీగా ప్రవహించేది. అయితే ఇప్పుడా పరిస్థితి లేదు. గెడ్డలకు ఇరుపక్కల ఆక్రమణలు చోటుచేసుకోవడంతో అవి పూర్తిగా కుంచించుకుపోయాయి. కొండవాలు ప్రాంతాల మురుగునీరు, వర్షపు నీటిని అవే దిగువకు తరలించాల్సి వస్తుంది. దీంతో నీటి ప్రవాహ వేగం పెరిగి ప్రమాదకరంగా మారాయి. జీవీఎంసీ అధికారులు ఇలాంటి కాలువను అభివృద్ధి చేసి, చాలా కాలువకు ఇరుపక్కలా సిమెంట్ వాల్స్ ఏర్పాటు చేశారు. అయితే వాటికి కొంత మేర మూతలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. భారీ వర్షాల సమయంలో ఇవి నీటితో నిండిపోవడంతో కాలువలున్నట్టు కూడా తెలియక చాలామంది వాటిలో పడిపోయి గాయాలకు గురవుతున్నారని పేర్కొంటున్నారు. ఒక్కోసారి చిన్నారులు నీటి ధాటికి కొట్టుకుపోయి మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన డ్రైనేజీలు

మద్దిలపాలెం, రేసపువానిపాలెం, రామాటాకీస్ ఏరియా, రామ్‌నగర్, జగదాంబ, సీహార్స్ రోడ్డు. ఫిషింగ్ హార్బర్ ప్రాంతాల్లో ప్రధాన డ్రైనేజీలు ఉన్నాయి. ఇవికాకుండా చాకలిగెడ్డ, ఎర్రిగెడ్డ, పందిమెట్ట గెడ్డలు కూడా ఉన్నాయి. వర్షాకాలంలో ఇవన్నీ చాలా వేగంగా ప్రవహిస్తుంటాయి. వీటన్నింటికీ కొంతమేర మూతలు లేవు. జీవీఎంసీ అధికారులు వీటికి కొన్ని ప్రాంతాల్లో మూతలు ఏర్పాటు చేసినా వాటిలో కొన్ని పలకలు విరిగిపోయాయి. పూడిక తీసేటప్పుడు జీవీఎంసీ సిబ్బంది కొన్ని పలకలను తొలగించి అలాగే వదిలేయడంతో ఇవన్నీ ఓపెన్‌గానే ఉంటున్నాయి. దీంతో తాము ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు.

వ్యర్థాలు వేసేస్తున్నారు

డ్రైనేజీలు ఓపెన్‌గా ఉండడం వల్ల వాటిలో స్థానికులు తమ ఇళ్లలోని వ్యర్థాలను వేస్తున్నారు. డ్రైనేజీ పక్కనున్న షాపులు, పార్లర్లు, ఇతర వ్యాపార సంస్థల నిర్వాహకులు కూడా వ్యర్థ పదార్థాలను ఇందులోనే పడేస్తుండడంతో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు నుంచి దుర్వాసన వస్తుండడంతో పాటు దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రామా టాకీస్ వద్ద కాలువపై తొలిగించివున్న సిమెంట్ పలక



రామ్‌నగర్‌లోని కాలువ దుస్థితి..

పైకప్పులు విధిగా వేయాలి



నగరంలోని ప్రధాన ఓపెన్ డ్రైనేజీలపై సిమెంట్ పలకలతో మూతలు వేయాలి. డ్రైనేజీలో చేరిన పూడికను తొలగించే పనులు చేపట్టేటప్పుడు పలకలు తొలగించి పనులు పూర్తయ్యాక మళ్లీ యథావిధిగా పెట్టాలి. కొండవాలు ప్రాంతాల్లోని డ్రైనేజీలు ఇంకా ప్రయాదకరంగా ఉంటున్నాయి. మర్రిపాలెం మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీలపై ఉన్న పలకలు అనేకచోట్ల విరిగిపోయాయి. జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

-బాలాజీ, మర్రిపాలెం

అజాగ్రత్తగా ఉంటే అంతే..



చాలా కాలనీల్లో ఎక్కడికక్కడే ఓపెన్ డ్రైనేజీలు ఉన్నాయి. రోడ్డుమీదకు వెళ్లాలంటే వీటిని దాటాల్సి వస్తుంది. చిన్నారులు, మహిళలు వీటిని దాటేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం తప్పదు. ఒకటి లేక రెండడుగుల వెడల్పు గల డ్రైనేజీలకు పలకలున్నా... లేకున్నా పర్వాలేదు గాని రెండు అడుగుల పైబడి వెడల్పు కలిగిన డ్రైనేజీలకు పలకలు తప్పనిసరిగా వేయాలి.

-ఎస్‌కే అరుణ, ఆరిలోవ

పాదచారులకు ఇబ్బందులు



ప్రధాన కాలువల అభివృద్ధిలో భాగంగా జీవీఎంసీ సిబ్బంది వాటిపై సిమెంట్ పలకలు వేస్తున్నారు. వాటినే ఫుట్‌పాత్‌గా స్థానికులు వినియోగిస్తున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో కొన్ని పలకలు విరిగిపోయి డ్రైనేజీల్లోనే పడిపోయాయి. రాత్రి వేళల్లో ఈ పలకలపై రాకపోకలు సాగించే పాదచారులు డ్రైనేజీలో పడి గాయాలపాలవుతున్నారు. అందువల్ల విరిగిన పలకల స్థానంలో ఎప్పటికప్పుడు కొత్తవాటిని ఏర్పాటు చేయాలి.

-నామాన రాజేశ్వరరావు, రైల్వే న్యూకాలనీ

ఆలయాల్లో సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు

వన్‌టౌన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాలను మంగళవారం ఉదయం సంప్రోక్షణ చేశారు. సోమవారం రాత్రి చంద్రగ్రహణం నేపథ్యంలో అన్ని ఆలయాలను మూసివేసిన విషయం విధితమే. గ్రహణానంతరం ఆలయాలకు సంప్రోక్షణ చేశారు. ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు గ్రహణానంతరం నగరవాసులు వారి ఇళ్లను శుభ్రపరచి తలంటుస్నానాలు చేశారు. అనంతరం ఆలయాలు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. దీంతో ఆలయాల్లో భక్తుల తాకిడి పెరిగింది. పలువురు భక్తులు శివాలయాలకు వెళ్లి స్వామివారికి అభిషేకాలు చేశారు. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న సుమారు వెయ్యి ఆలయాల్లో మంగళవారం ఉదయం సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించినట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు.

గీతంలో ఏపీ బయో అంతర్జాతీయ సదస్సు

స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సంజయ్ మల్హోత్రా

10, 11 తేదీల్లో సదస్సులో పాల్గొననున్న శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న సంజయ్ మల్హోత్రా, పాల్గొన్న గీతం వీసీ ఎంఎస్ ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 8: ఏపీ బయో అంతర్జాతీయ సదస్సును ఈనెల 10, 11 తేదీల్లో గీతం యూనివర్సిటీ మదర్‌థెరిస్సా ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు.

దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బయోటెక్నాలజీ రంగాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమా ల్లో భాగంగా సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు, గీతం విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సులో దేశంలోని ప్రముఖ పరిశోధనా కేంద్రాల నుంచి శాస్త్రవేత్తలు హాజరవుతారని చెప్పారు. గీతం విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎంఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ సదస్సులో బయోటెక్నాలజీ రంగంతోపాటు వ్యవసాయ, సముద్ర సంబంధ ఉత్పత్తుల రంగంలో బయోటెక్నాలజీ పాత్ర, జీవ శాస్త్రాలు, ప్రజారోగ్యం, ఔషధ రంగానికి సంబంధించిన అంశాలపై శాస్త్రవేత్తలు ప్రసంగిస్తారన్నారు. రెండో రోజు బయోటెక్నాలజీ, ఫార్మశీ పరిశ్రమలకు చెందిన సీఈవోలతో సమావేశం ఉంటుందన్నారు. సదస్సుకు ఐసీఎంఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ ఎన్‌కే గంగూలీ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో జె.కృష్ణకిశోర్, ఫార్మా, బయోటెక్ టాస్క్‌ఫోర్స్ వైస్‌చైర్మన్ లంకా శ్రీనివాస్, గీతం అధ్యక్షుడు ఎంవీవీఎస్ మూర్తి విచ్చేస్తారని తెలిపారు. సమావేశంలో సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.గణపతి, ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ పాల్గొన్నారు.


తూర్పు నౌకదళ అధికారులతో సమావేశమైన బంగ్లాదేశ్ నేవీ బృందం


తూర్పు నౌకాదళంలో పనితీరుపై చర్చిస్తున్న బంగ్లాదేశ్ నేవీ అధికారులు

బంగ్లాదేశ్ నేవీ బృందం తూర్పు నౌకాదళం సందర్శన

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ నేవీ బృందం రియర్ అడ్మిరల్ ఎం.షహీన్ ఇక్బాల్ సారధ్యంలో మూడు రోజుల పర్యటన విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళానికి విచ్చేసింది. బంగ్లాదేశ్ నేవీ అసిస్టెంట్ చీఫ్‌గా వ్యవహరిస్తున్న షహీన్ ఇక్బాల్ నేవల్ డాక్‌యార్డుకు వెళ్లి సూపరింటెండెంట్ రియర్ అడ్మిరల్ నారాయణ ప్రసాద్ పలు అంశాలపై చర్చించారు. ఇక్కడి నుంచి వెళ్లేలోపు బంగ్లాదేశ్ బృందం హిందూస్థాన్ షిప్ యార్డును కూడా సందర్శించనుందని నేవీ వర్గాలు తెలిపాయి.

నటన, దర్శకత్వ కోర్సుల్లో దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం రంగస్థల విభాగంలో నటన, దర్శకత్వం సాయం కాలం కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు విభాగాధిపతి మదన్‌మోహన్ తెలిపారు. ఇంటర్మీడియట్ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన డిగ్రీ, పీజీ రెగ్యులర్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు, ఏయూలో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు 9989966767, 9440083078, 9700915075, 9985867974, 9550556819 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

తప్పుడు పత్రాలతో ఉద్యోగం పొందే యత్నం

●జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు

విశాఖపట్నం: తప్పుడు పత్రాలు సృష్టించి జీవీఎంసీలో ఉద్యోగం పొందేందుకు ప్రయత్నిస్తున్న మహిళపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జి.త్రిమూర్తి, జి.శివ జీవీఎంసీ అదనపు కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా వున్నాయి. అన్సర్‌వల్లీ తండ్రి రెహమాన్ అనకాపల్లి మున్సిపాలిటీలో అటెండర్‌గా పని చేస్తూ 1988లో మృతిచెందడంతో అతని ఉద్యోగం అన్సర్‌వల్లీకి వచ్చింది. అన్సర్‌వల్లీ 1992లో మీరాబేగంతో వివాహమై ఇద్దరు పిల్లలు పుట్టారు. 2001లో అన్సర్‌వల్లీ భార్య, పిల్లలను విడిచి ఎక్కడికో వెళ్లిపోయాడు. కొన్నేళ్ల తర్వాత అన్సర్‌వల్లీ తిరిగి ఉద్యోగం కావాలంటూ అప్పటి అనకాపల్లి మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. అయితే ఏడేళ్లు కావొస్తున్నందున నిబంధనల ప్రకారం ఉద్యోగం ఇవ్వడం కుదరదని తేల్చేశారు. అన్సర్‌వల్లీ 2009లో మృతిచెందాడు. కారుణ్యనియామకం కింద అన్సర్‌వల్లీ ఉద్యోగాన్ని పొందేందుకు మీరాబేగం ప్రయత్నాలు ప్రారంభించగా అన్సర్ తల్లి అంగీకరించలేదు. 2013లో అన్సర్ తల్లి చనిపోవడంతో ఇప్పుడు మీరాబేగం ప్రయత్నాలు ప్రారంభించింది. తప్పుడు పత్రాలు సృష్టించి ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుందని శివ, త్రిమూర్తి ఫిర్యాదు చేశారు. జీవీఎంసీ అదనపు కమిషనర్‌ను వివరణ కోరగా తనకు ఫిర్యాదు వచ్చిందని, మీరాబేగం దరఖాస్తు చేసుకున్నట్టు ఇంకా తన దృష్టికి రాలేదన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.


కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీకి లేఖ అందిస్తున్న ఎంపీ ముత్తంశెట్టి, ఎమ్మెల్యే పంచకర్ల

ఎన్‌ఏఓబీలో నిర్వాసితులకు ఉపాధిపై కేంద్ర మంత్రికి వినతి

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండంలో భారత నౌకాదళం నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ నేవీ స్థావరం(ఎన్‌ఏఓబీ)లో నిర్వాసితులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కేంద్ర రక్షణ శాఖా మంత్రి అరుణ్‌జైట్లీని కోరారు. వీరిద్దరు ఢిల్లీలో మంగళవారం మంత్రిని కలిసి నేవీకి పలువురు భూములు ఇచ్చి సర్వం కోల్పోయారని, వారికి ఉపాధి కల్పిస్తే జీవితాలకు మార్గం చూపినట్టు అవుతుందని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, పరిశీస్తామని హామీ ఇచ్చారని ఎంపీ శ్రీనివాస్ తెలిపారు.

ఏయూ ఫైన్‌ఆర్ట్స్‌లో వివాదంపై విచారణ

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైన్‌ఆర్ట్స్ విభాగంలో విద్యార్థుల ఆందోళనపై విచారణ ప్రారంభించారు. విభాగంలో ఆరో సెమిస్టర్ చదువుతున్న సాయిచరణ్ అనే విద్యార్థి ఇతర విద్యార్థులు, టీచర్లపై దాడులు చేయడాన్ని నిరసిస్తూ రెండురోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు. దీనిపై వర్సిటీ నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ మంగళవారం విభాగానికి వెళ్లి విచారణ చేపట్టింది. ఆచార్య పి.బాబీవర్ధన్, ఆచార్య విశ్వేశ్వరరావు, ఆచార్య సుబ్బారాయుడుతో కూడిన కమిటీ విద్యార్థులు, నాన్‌టీచింగ్ సిబ్బందిని విచారించింది. టీచర్ల నుంచి బుధవారం సమాచారం తీసుకోనున్నది. ఒకటి రెండు రోజుల్లో పాలకులకు నివేదిక ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది.

రైల్వే స్టేషన్ క్యాటరింగ్ కాంట్రాక్టర్‌కు జరిమానా

విశాఖపట్నం: రైల్వే స్టేషన్‌లో ఆహార పదార్థాల నాణ్యత, శుభ్రతకు విశేష ప్రాధాన్యం కల్పిస్తున్నామని నిబంధనలు ఉల్లంఘించిన క్యాటరింగ్ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటున్నామని వాల్తేరు డివిజన్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బి.రామ్మోహనరావు తెలిపారు. ప్యాకింగ్ నుంచి జారి నేలపై పడిన ఆహార పదార్థాన్ని తిరిగి యదావిధిగా ప్యాక్ చేసి విక్రయించినట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. క్యాస్‌రోల్స్‌ను ట్రాలీలో ఒక ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్‌ఫాంకు తీసుకువెళుతున్న సమయంలో ఆహార పదార్థాల ప్యాకెట్లలో ఒకటి పొరపాటున జారికింద పడగా దానిలో వున్న ఆహార పదార్థం నేలపై చెల్లా చెదురుగా పడడంతో సిబ్బంది చిరిగిన ప్యాకెట్‌లోకి ఎత్తివేసి పారవేశారని తెలిపారు. ఈ ఘటనపై డివిజనల్ కమర్షియల్ సిబ్బంది విచారణ జరిపి సంబంధిత క్యాటరింగ్ కాంట్రాక్టర్‌కు రూ.ఎనిమిది వేలు జరిమానా విధించడంతోపాటు నేలపై పడిన ఆహార పదార్థాన్ని తిరిగి క్యాస్‌రోల్‌లోకి నింపిన సిబ్బందిని విధుల నుంచి తొలగించారని పేర్కొన్నారు. గత నెల 28వ తేదీ నుంచి వాల్తేరు డివిజన్‌లోని అన్ని స్టేషన్లలో నిరవధిక తనిఖీలు చేపడుతున్నామని దానిలో భాగంగా ప్రతి స్టాల్ వద్ద నుంచి శ్యాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, ఉత్సవాలు... తదితర కార్యక్రమాల వివరాలను మాకు తెలపండి

విలేకరుల ఫోన్ నంబర్లు

భీమునిపట్నం	9440608900	పద్మనాభం	9866067849
భీమిలి రూరల్	9490300587	తగరపువలస	9440527387
ఆనందపురం	9440133294	సాగర్‌నగర్	7396085775
మధురవాడ	9440326758	సింహాచలం	9397870137
ఎండాడ	7794841122	పీఎం పాలెం	9440131379
		కొమ్మాది	9441663044

విస్తరణకు ఇంకెన్నేళ్లో?

మూడేళ్లు దాటినా ముందుకు కదలని పనులు

శిథిల రహదారితో ప్రయాణికుల పాట్లు

మధురవాడ : జీవీఎంసీ ఐదో వార్డులోని నగరం పాలెం వుడా మాస్టర్‌ప్లాన్ రహదారి విస్తరణకు నోచుకోవడం లేదు. విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మధురవాడ కూడలి నుంచి నగరంపాలెం, మల్లయ్యపాలెం మీదుగా కాపులుప్పాడ వంద అడుగుల రహదారి వరకు 80 అడుగుల వెడల్పుతో వుడా రహదారిని నిర్మించాల్సి ఉంది. వుడా మాస్టర్‌ప్లాన్‌లో ఉన్న ఈ రహదారిని అభివృద్ధి చేయడానికి 2014 ఫిబ్రవరిలో అప్పటి భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శిలాఫలకం ఆవిష్కరించారు. అప్పటి నుంచి పనులు ప్రారంభం కాలేదు.రహదారి విస్తరణకు అప్పట్లో విశాఖపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వుడా)



నగరంపాలెం రహదారి

సుమారు రూ.3కోట్లు నిధులు కేటాయించింది.వాటిని సకాలంలో వినియోగించకపోవడంతో నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. రహదారి పనులు ఎక్కడివేసిన గొంగళి..చందంగా తయారైంది.

గోతులు పడిన రహదారి

ప్రస్తుతం నగరంపాలెం రహదారి గోతులతో అధ్వానంగా ఉంది. ఏమాత్రం వర్షం పడినా చిత్తడిగా తయారవుతోంది. ఈ మార్గంలో పలు పాఠశాలల బస్సులతో పాటు నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి.ఈ రహదారిపై నుంచి మల్లయ్యపాలెం మీదుగా బీచ్‌రోడ్డుకు చేరుకోవచ్చు.దీంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోడ్డుపై గోతులు పడడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వలందపేటలో డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు



వలందపేటలో మురుగునీటిని పరిశీలిస్తున్న జడ్సీ తదితరులు

తగరపువలస: వలందపేటలో డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్టు జడ్సీ సన్యాసినాయుడు తెలిపారు. మునిసిపల్ సిబ్బందితో కలిసి మంగళవారం ఆయన వలందపేటలోని వివిధ వార్డుల్లో మంగళవారం పర్యటించి, పారిశుధ్య పరిస్థితులను సమీక్షించారు. డ్రైనేజీలు లేకపోవడం వల్ల ఇళ్లల్లో వాడుక నీరు రోడ్లమీద ప్రవహించడం గమనించారు. మురుగునీటి వల్ల దుర్గంధంతో పాటు దోమలు వ్యాప్తి చెంది రోగాలబారిన పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. డ్రైనేజీల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఇంజనీరింగ్ విభాగం, ప్రజారోగ్య సిబ్బంది ఉన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన అధికారి

కొమ్మాది: మారికవలస గిరిజన గురుకుల పాఠశాలను రాష్ట్ర గురుకుల కార్యదర్శి దేవర వాసు మంగళవారం సందర్శించారు. పాఠశాలలో విద్యాబోధన, వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులు ఐజీటీలో సాధించిన స్థానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.రిజర్వేషన్ కోటాలోనే కాకుండా ఓపెన్ కేటగిరిలో ఐజీటీలో ర్యాంకులు సాధించేలా కృషిచేయాలని ప్రిన్సిపాల్ విశ్వనాథంకు సూచించారు.

సుబ్బరాజు నగర్‌లో జడ్సీ పర్యటన



కొమ్మాది: జీవీఎంసీ జోన్ వన్ కమిషనర్ సత్యవేణి మంగళవారం సుబ్బరాజు నగర్‌లో పర్యటించారు. కాలనీ వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డు మీద వాడుక నీరు నిలిచిపోతోందని స్థానికులు చెప్పారు. దుర్గంధంతో పాటు దోమలు వ్యాప్తి చెందడంతో రోగాలబారిన పడుతున్నామని చెప్పారు. సమస్య పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ తరలింపునకు ప్రణాళిక

సింహాచలం : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉపాలయంగా సింహగిరిపై ప్రధాన రాజగోపురాన్ని ఎదురుగా కొలువై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి పంచాయతన దేవాలయాన్ని తరలించేందుకు దేవాదాయశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. సింహగిరి దివ్యక్షేత్రం అభివృద్ధి పనుల్లో భాగంగా కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం, దానికి ఆనుకుని ఉన్న సింహాద్రి అప్పన్న ప్రసాదాల విక్రయ కేంద్రాలను సమీపంలోని గిరిజన గ్రామానికి ఆనుకుని ఉన్న కొండపైకి తరలించే యోచనలో అధికారులు ఉన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప సారథ్యంలో మంగళవారం ఉదయం సింహాచల దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు ఆలయాన్ని పరిశీలించారు. ఆ సందర్భంగా అనుసరించాల్సిన శాస్త్ర, సాంకేతిక అంశాలపై సమగ్రంగా చర్చించారు. అదే విధంగా ప్రస్తుతం అప్పన్న ఆలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న పోటు(పాకశాల) రెండో దశ భవన నిర్మాణాన్ని, కొండ దిగువ పురాతన తొలిపావంచా స్థానం సుమారు రూ.60లక్షలతో నిర్మిస్తున్న నూతన తొలిపావంచా పనులను వాస్తుశాస్త్రంతో అనుసంధానం చేస్తూ సమీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థపతి వెంట సింహాచల దేవస్థానం స్థపతులు డీవీఎస్ రాజు, అమ్మన్‌రాజా, ఈఈ కోటేశ్వరరావు, డీఈ బి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్లాన్ పరిశీలిస్తున్న స్థపతి

చెత్త సేకరణ డబ్బాలు పంపిణీ



నగరంపాలెంలో చెత్త సేకరణ డబ్బాలు అందిస్తున్న దృశ్యం

భీమునిపట్నం(రూరల్): మండలం వివిధ గ్రామపంచాయతీల పరిధిలో ఇంటింటికి చెత్తసేకరణ డబ్బాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని అధికారులు మంగళవారం చేపట్టారు. మండల పరిషత్తు అధికారులు గ్రామ కార్యదర్శుల ద్వారా ప్రతి ఇంటికి రెండు ప్లాస్టిక్ డబ్బాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామీణాభివృద్ధి అధికారులు జీవీఎస్ఎస్ కుమార్ చేతుల మీదగా ప్రారంభించారు. చెత్త సేకరణకు సిబ్బందిని నియమించామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శులు, గ్రామస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

కొమ్మాది: మధురవాడ పౌర సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు జోన్‌వన్ కమిషనర్ సత్యవేణిని గ్రీవెన్స్ కార్యక్రమంలో సోమవారం కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందించారు. మధురవాడ మార్కెట్ ప్రవేశం వద్ద ఉన్న కాలువపై శ్లాబ్‌లు తొలగించి, అలాగే వదిలేశారని, దానివల్ల ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వెంటనే శ్లాబ్ నిర్మించి పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

అప్పన్న సేవలో దివ్యదర్శన యాత్రా బృందం

సింహాచలం : నిరుపేద, అట్టడుగువర్గాలకు చెందిన సామాన్య భక్తులకు రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలలోని దేవుళ్ల దర్శనభాగ్యం కల్పించేందుకు దేవాదాయశాఖ అధికారులు ప్రవేశపెట్టిన దివ్యదర్శనం యాత్రాబృందం సభ్యులు మంగళవారం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో శ్రీకాకుళం మండలం, విజయనగరం జిల్లా గరివిడి మండలాలకు చెందిన సుమారు 400మంది భక్తులు 8 ప్రత్యేక బస్సుల్లో దివ్యదర్శన యాత్రలలో భాగంగా మంగళవారం సింహగిరికి చేరుకున్నారు. దివ్యదర్శన యాత్రా భక్తులకు సింహాచల దేవస్థానం ఏఈవో ఆర్వీబీఎస్ ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వాయునందనరావుల పర్యవేక్షణలో ప్రధాన రాజగోపురం ద్వారా ఆలయ ప్రవేశం కల్పించడంతో పాటు ఉచిత ప్రసాదం అందజేసి నిత్యాన్నప్రసాద పథకం కింద భోజన సదుపాయం కల్పించారు.



సింహగిరిపై దివ్యదర్శనం భక్తులు

ఎంఆర్ కళాశాల విద్యార్థులకు నూతన వసతి గృహం

సింహాచలం : విజయనగరంలోని మహారాజా కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం పూర్తి హంగులతో నూతన వసతి గృహం నిర్మించాలని మాన్సాస్ ట్రస్ట్ నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న వసతి కేంద్ర భవనం స్థానంలో సువిశాలమైన ప్రాంగణంలో అన్ని సదుపాయాలతో వసతి గృహాన్ని నిర్మించనున్నారు. భవన నమూనా కోసం వరాహపుష్కరిణి సమీపంలో 2014లో నిర్మించిన 65 గదుల నరసింహ సదన్‌ను సింహాచల ఆలయ ఈవో కోదూరి రామచంద్రమోహన్‌తో కలిసి మంగళవారం మాన్సాస్ ట్రస్ట్ డైరెక్టర్, కేంద్ర మంత్రి పి.అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతి పరిశీలించారు. నూతన భవనంలో విద్యార్థులకు రీడింగ్‌రూమ్, విశాలమైన పడక గదులు, వాటిలో అనువైన అమరికలతో బెడ్లు, చూడచక్కని ఫ్లోరింగ్‌తో భవనాన్ని అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.



ఈవోతో మాట్లాడుతున్న అదితి గజపతి

సినిమా గైడ్

తగరపువలస
తాతా: మాయా మహల్

చిట్టివలస
సప్తగిరి: ఫిదా
గణేష్: గౌతమ్ నంద

మధురవాడ
దుర్గ: గౌతమ్ నంద



అంగన్‌వాడీ చిన్నారులకు దుస్తులు పంపిణీ

పద్మనాభం: గ్రామపంచాయతీ స్థలం కేటాయిస్తే విజయనగరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని సంస్థ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని బి.తాళ్లవలస పంచాయతీ పరిధిలోని లింగన్నపేటలో రోటరీ క్లబ్, సాయిదివ్యాదిత్య ట్రస్టు, సబ్‌కామాలిక్ ఏక్ సంస్థలు సంయుక్తంగా అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు మంగళవారం నిర్వహించిన దుస్తులు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. రూ.2.50లక్షల వ్యయంతో ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందిస్తామన్నారు. ఈసందర్భంగా మండలంలోని 25 అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న 436మంది పిల్లలకు రెండేసి జతల దుస్తులు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ సునీత, డాక్టర్ గోపాలరావు, డాక్టర్ లక్ష్మి, సర్పంచ్ సి.హెచ్.శ్రీను, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పి.జగన్నాథం, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

కల్లు గీత సంఘం అధ్యక్షుడిగా రాములప్పడు

భీమునిపట్నం: భీమిలి మండలం చేపలుప్పాడ కల్లుగీత కార్మికుల సహకార సంఘం అధ్యక్షుడిగా బాడితబోయిన రాములప్పడు ఎన్నికయ్యారు. మంగళవారం ఆ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ సంఘం ఎన్నికలు కో-ఆపరేటివ్ అధికారి ఈశ్వరరావు పర్యవేక్షణలో జరిగాయి. ఈ ఎన్నికల్లో ఆ సంఘం ఉపాధ్యక్షుడిగా టేకుపూడి నాగరాజు, కార్యదర్శిగా కండిపిల్లి అప్పారావు, డైరెక్టర్లుగా బాడితబోయిన అప్పారావు, చెల్లుబోయిన చినరాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూ

ఆనందపురం: స్థానిక మండలాభివృద్ధి కార్యాలయ ఆవరణలో ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరుకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించగా అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. మండలంలోని ఆనందపురం ఆంధ్రాబ్యాంక్, వెల్లంకి ఎస్‌బీఐ, గిడిజాల బ్యాంకు ఆఫ్ ఇండియా, శొంఠ్యాం ఎస్‌బీఐ, వేములవలస, శొంఠ్యాం ఏపీజీవీబీ బ్యాంకుల పరిధిలోని 203 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు.

పంట మార్పిడి విదానం అవలంబించాలి

ఆనందపురం: రైతులందరూ పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని వ్యవసాయ విస్తరణాధికారి శివకోమలి తెలిపారు. మండలంలోని పాలవలస, పందలపాక పంచాయతీలలో స్థానిక వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో యాంత్రికరణ అవ లంబించడం ద్వారా తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.కూరగాయల విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామని వినియోగించుకోవాలన్నారు. జింక్ సల్ఫేట్ శతశాతం రాయితీపై అందులో బాటులో ఉందన్నారు. అనంతరం రైతులకు జింక్ సల్ఫేట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సింహాచలం: డ్రైవర్లు ముందస్తుగా నిబంధనలు పాటించటంతోపాటు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు సంభవించవని హైవే పెట్రోలింగ్ సీఐ బి.సింహాచలం అన్నారు. సింహాచలం ప్రధాన కూడలిలో ఆటో డ్రైవర్లకు ప్రమాదాలు జరగడానికి గల కారణాలు, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలపై మంగళవారం సాయంత్రం ఆయన అవగాహన కల్పించారు.

రాత్రి పారిశుధ్య పనులకు మంగళం

భీమిలి జోన్‌లో 7 నెలల నిర్వహణ

సిబ్బంది కొరతతో నిలిచిన పనులు


భీమిలిలో రాత్రివేళ పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

భీమునిపట్నం: జీవీఎంసీ భీమిలి జోన్‌లో రాత్రి పారిశుధ్యం పనులు ఆగస్టు నెల నుంచి నిలిచిపోయాయి. పట్టణాన్ని పరిశుభ్రంగా వుంచడంలో భాగంగా జీవీఎంసీ ఇక్కడ రాత్రివేళల్లో పారిశుధ్య పనులను ఈ ఏడాది జనవరి 20న ప్రారంభించింది. సిబ్బంది కొరతతో కేవలం ఏడు నెలలకే ఈ పనులకు మంగళం పాడారు. వివరాలిలా వున్నాయి...ఈ జోన్‌లో భీమిలిలో 8 మంది, తగరపువలసలో 8 మంది పనివార్లకు ఈ పనులకు కేటాయించారు. భీమిలి జోన్‌లో సుమారు 55 వేల జనాభాతో 28 వార్డులలో పట్టణం విస్తరించివుంది. కాగా, భీమిలి టౌన్‌లో మెయిన్‌రోడ్డు బీచ్‌రోడ్డు, చిన్నబజారు జంక్షన్, తగరపువలసలో మెయిన్‌రోడ్డు, బైపాస్‌రోడ్డు, భీమిలి రోడ్డులలో ట్రాఫిక్ ఉదయం వేళల్లో అధికంగా వుండడంతో పారిశుధ్య పనులకు ఆటంకం కలుగుతోందనే ఉద్దేశంతో రాత్రి పారిశుధ్య పనులను చేపట్టారు.పట్టణాభివృద్ధికి అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది నియామకం జరగలేదు. దీంతో సిబ్బంది కొరతతో పనులకు ఆటంకం కలుగుతోంది. కాగా, పారిశుధ్య పనివారు భీమిలి వార్డులకు 34 మంది, తగరపువలస ప్రాంతంలో వున్న వార్డుల్లో 66 మంది వున్నారు. వీరిలో 16 మంది నైట్ శానిటేషన్‌కు కేటాయించడంతో ఉదయం వేళల్లో పనులకు సిబ్బంది కొరత ఎదురవుతోంది. సిబ్బంది కొరతతో ఉదయం వేళల్లో పారిశుధ్య పనులకు అంతరాయం కలగడంతో అధికారులు తాత్కాలికంగా నైట్ శానిటేషన్ పనులను నిలిపివేశారు. ఈవిషయమై, భీమిలి జోనల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవికుమార్‌తో మాట్లాడగా,కార్మికుల కొరత వుందని, ప్రస్తుతం వంద మంది పనివారు వున్నారని, మరో 20మందిని నియమిస్తే రాత్రి వేళల్లో పారిశుధ్య పనులకు వినియోగించవచ్చని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు

ఎండాడ పాఠశాలలో కుళ్లిపోయిన కోడిగుడ్లు


ఎండాడ పాఠశాలలో ఉడకపెట్టిన కోడిగుడ్లు

ఎండాడ: ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఇచ్చే కోడిగుడ్లు మంగళవారం కుళ్లిపోయాయి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వారానికి మూడు రోజుల పాటు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా పాఠశాలలకు కోడిగుడ్లను సరఫరా చేసేందుకు కొన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా కోడిగుడ్లను సరఫరా చేస్తున్నారు. ఎండాడ ప్రభుత్వ పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారంలో మూడు రోజుల పాటు అంటే 1,500 గుడ్లను ప్రభుత్వం నియమించిన ట్రేడర్ ఈ నెల ఐదో తేదీన పాఠశాలకు అందించాడు. వారానికి మూడు రోజులంటే సోమవారం, బుధవారం, శుక్రవారం పాఠశాలలో విధిగా విద్యార్థులకు ఉడకబెట్టిన కోడి గుడ్డు అందివ్వాలి. సోమవారం రాఖీ పండగ సందర్భంగా కోడిగుడ్డు ఇవ్వలేదు. దాని బదులు మంగళవారం కోడిగుడ్లను ఉడకబెట్టగా అందులో చాలా గుడ్లు కుళ్లి పోయి దుర్వాసన రావడంతో విద్యార్థులకు ఇవ్వలేదు. దీనిపై ఎంఈవోకు ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు.

నిరుపయోగంగా బస్సు షెల్టరు


మూలకుద్దు వద్ద నిర్మించిన బస్సు షెల్టరు

భీమునిపట్నం (రూరల్): మండలం మూలకుద్దు ప్రధాన రహదారిని అనుకుని నిర్మించిన బస్సు షెల్టరు నిరుపయోగంగా పడి వుంది. ముందుచూపు లేకుండా నిర్మించిన ఈ బస్సు షెల్టరు ఎవరికీ ప్రయాణికులకు ఉపయోగపడడం లేదు. జనసంచారం లేని ప్రాంతంలో దీనిని నిర్మించారు. వాహన రాకపోకలు సాగించే ప్రాంతానికి ఇది చాలా దూరంగా ఉంటుంది. రోడ్డుని ఆనుకుని నిర్మించవలసిన ఈ షెల్టరుని పొలాల మధ్యలో నిర్మించడం వల్ల ఎవరూ ఇక్కడ నిల్చోవడానికి ఇష్టపడడం లేదు. కొన్నేళ్లుగా వినియోగం లేకపోవడంతో శిథిలమైంది.

గ్రామాల్లో బయోగ్యాస్ ప్లాంట్లు

ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న గ్రామీణులు

(భీమునిపట్నం-రూరల్)

బయోగ్యాస్ ప్లాంట్లు ఒకప్పుడు చాలా గ్రామాలలో ఏర్పాటు చేసేవారు. దీపం పథకంలో గ్యాసు పొయ్యిలు సరఫరా చేయడంతో వీటి వినియోగం తగ్గిపోయింది. సిలిండర్లపై సబ్సిడీ ఎత్తివేస్తున్నారని తెలియడంతో భీమిలి మండలం వివిధ గ్రామాలలో మళ్లీ ఈ పొగరాని పొయ్యి(గోబర్‌గ్యాస్) ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడానికి గ్రామీణులు ముందుకు వస్తున్నారు. వీరు చూపిస్తున్న ఆసక్తికి అనుగుణంగా వివిధ గ్రామాలలో అధికారులు ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఈ ప్లాంట్లు ఏర్పాటు వల్ల వంటగ్యాస్ వినియోగిస్తున్న వారు సిలిండరు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండదు. భీమిలి మండలంలో నగరపాలెం, తాటితూరు, లక్ష్మీపురం గ్రామాలలో ఎక్కువమంది వీటిని ఏర్పాటు చేసుకున్నారు. సంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ అధికారులు కూడా వీరికి ప్రోత్సాహాన్ని అందించడంతో సుమారు 80మంది వీటిని ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామాలలో ఒక గేదె లేదా రెండు ఆవులు ఉండటం ద్వారా వచ్చే పేడ ద్వారా ఒక పొయ్యిని ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందులో వచ్చే వ్యర్థాలు కూడా ఎరువుగా ఉపయోగపడుతోంది. వీటిని కూడా రైతులు పొలాలకు వినియోగించుకుంటున్నారు.


నగరపాలెంలో నిర్మించిన బయోగ్యాస్ ట్యాంకు

ఏర్పాటు ఇలా....

ఆంధ్రప్రదేశ్ న్యూ రీజినబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ పథకం (ఏపీ ఎన్‌ఆర్‌ఈడీసీ) ద్వారా పొగరాని పొయ్యిలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ సంస్థ ద్వారా ఒక ఇంటిని యూనిట్‌గా పరిగణించి పొయ్యి నిర్మిస్తున్నారు. ఇందుకు గాను యూనిట్ వ్యయం రూ.16వేలు కాగా, అందులో రూ.8వేలు రాయితీగా అందిస్తున్నారు. దీని నిర్మాణం కోసం లబ్ధిదారులు మొదట గ్యాస్ స్టవ్‌ను కొనుక్కోవాలి. ట్రాక్టరుతో పేడ రూ.1,500 విలువైన ఇసుకని సమకూర్చుకోవాలి. ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే గ్యాస్ ద్వారా ఉదయం, మధ్యాహ్నం గంట చొప్పున, సాయంత్రం గంటన్నర చొప్పున వంట చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఇంటిముందు ట్యాంకు నిర్మించడానికి స్థలం ఉంటే సరిపోతుంది.

ప్రతిరోజూ తట్టపేడతో రెండు బిందెల నీటిని కలిపి ఈ ట్యాంకులో వేస్తే గ్యాస్ తయారవుతుంది. ఉత్పత్తి అయిన గ్యాస్‌ను పైపుల ద్వారా వంటగదిలో ఉన్న గ్యాసు పొయ్యికి అనుసంధానం చేస్తారు.

11న కథా నందనం పుస్తకావిష్కరణ



వివరాలు తెలియచేస్తున్న భువనేశ్వరరావు

ఎంవీపీకాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో 11వ తేదీన కథానందనం పుస్తకావిష్కరణ జరుపుతున్నట్లు భువన్ కల్చరల్ ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ ఎంవీజె భువనేశ్వరరావు తెలిపారు.ఏయూ జర్నలిజం విభాగం సమావేశమందిరంలో మంగళవారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలియచేశారు. ఇరవై మంది కథా రచయతలకు చెందిన నూరు కథలతో కథానందనం పుస్తకాన్ని తీర్చిదిద్దినట్టు చెప్పారు. కేంద్రసాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య జి. నాగేశ్వరరావు, రచయత వేదగిరి రాంబాబు, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా సహసంచాలకుడు పత్తిపాక మోహన్, అధికార భాషాసంఘం మాజీ సభ్యులు కురచా నరసింహ నాయుడు, రాముపండా తదితరులు పాల్గొంటారన్నారు. ఇదే కార్యక్రమంలో మళ్ల జగన్నాథం సాహిత్య ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు చెప్పారు.

కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా నరవ



నియామక పత్రాన్ని అందుకుంటున్న నరవ

సీతమ్మధార: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ కార్యదర్శి, ఫెడరేషన్ ఆఫ్ ఫిలిం సొసైటీస్ ఆఫ్ ఇండియా సభ్యులుగా ఉన్న నరవ ప్రకాశరావు కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సలహామండలి సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్, కేంద్ర సమాచార ప్రసారశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రతిని నరవ ప్రకాశరావు ఎంపీ డాక్టర్ కంభంపాటి హరిబాబు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ పదవిలో నరవ ప్రకాశరావు రెండేళ్లు కొనసాగుతారు. ఈ సందర్భంగా ఎంపీ హరిబాబు మాట్లాడుతూ 25 ఏళ్లగా చిల్డ్రన్ ఫిలిం సొసైటీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ ఫిలిం సంస్కృతిని పెంపొందించేందుకు ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ నియామకం చేపట్టినట్టు తెలిపారు.

గ్రీన్ సిగ్నల్ లేకుండా వాహనం పోనిస్తే షాకే!



వాహనచోదుకులపై కేసులు రాస్తున్న ఆరిలోవ ఎస్ఐ ప్రభాకర నాయుడు

ఆరిలోవ: సిగ్నల్ లైట్ల వద్ద జంపింగ్ వాహనాలపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. పోలీసుల కన్నుకప్పి గ్రీన్ సిగ్నల్ లేకపోయినా వాహనాలను రయ్‌మని పోనిచ్చే చోదకులకు ముకుతాడు వేస్తున్నారు. హనుమంత వాక జంక్షన్ జాతీయ రహదారి సిగ్నల్ పాయింట్ వద్ద మంగళవారం సాయంత్రం అలాంటి కేసుల్లో ఒక్కొక్క వాహనచోదకుడి నుంచి రూ.1,035 అపరాధ రుసుం వసూలు చేశారు. అంత పెద్ద మొత్తాన్ని చెల్లించేందుకు నిరాకరించిన వాహనచోదకులకు ఆరిలోవ ట్రాఫిక్ రోడ్డు సేఫ్టీ ఎస్ఐ ప్రభాకర నాయుడు అవగాహన కల్పించి చలానా కట్టించారు. సిగ్నల్ లేకుండా వాహనాలు పోనిస్తే ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. అలాగే హెల్మెట్ ధరించని వాహనచోదకులకు రూ.132 అపరాధ రుసుం వసూలు చేశారు.

ఆశ్రమ భూమికి దాత వారసుల ఎసరు!

పెందుర్తిలో రూ.50 కోట్ల భూమి ఆక్రమణ

సిట్‌కు మంత్రి అయ్యన్న మరో ఫిర్యాదు

నర్సీపట్నం, ఆగస్టు 8: సుమారు 50 సంవత్సరాల క్రితం పెందుర్తికి చెందిన శరగడం అప్పన్న అనే దాత, నర్సీపట్నంలోని చిద్గగనానంద మహర్షి ఆశ్రమానికి దానంగా ఇచ్చిన 4.15 ఎకరాల భూమిని దాత వారసులు ఆక్రమించుకున్న ఉదంతంపై రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సిట్‌కు ఫిర్యాదు చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు పచ్చిగోళ్ల ఈశ్వరరావు, తనకు అందజేసిన వివరాలను జిల్లాలో భూ కుంభకోణాలను విచారించేందుకు ఏర్పాటైన సిట్‌కు అందజేసినట్టు ఆయన వెల్లడించారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన పత్రాలను విలేకరులకు అందజేశారు.

నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని బలిఘట్టం కొండపై దత్తాశ్రమ వ్యవస్థాపకులైన చిద్గగనానంద మహర్షి ఆశ్రమానికి పెందుర్తికి చెందిన శరగడం వెంకటస్వామి కుమారుడు అప్పన్న 1962 ఆగస్టు 27వ తేదీన పెందుర్తి గ్రామ పట్టా నంబర్ 2699, ఇనాం మెట్టు సర్వే నంబర్ 140/2లోగల 15 సెంట్ల భూమిని చిద్గగనానంద ఆశ్రమానికి దాన పట్టాగా రాయించి, డాక్యుమెంట్ నంబర్ 2158/1962 ప్రకారం విశాఖపట్నం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. సదరు 15 సెంట్ల స్థలంలో ఆశ్రమం కట్టించి భక్తుల కోసం వినియోగించేవారు. అదేవిధంగా శరగడం అప్పన్న 1973వ సంవత్సరంలో ఆ స్థలాన్ని తన తదనంతరం ఏ విధంగా పంచుకోవాలో తెలియజేస్తూ 1973 డిసెంబర్ 22వ తేదీన విశాఖపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వీలునామా రిజిస్ట్రేషన్ చేయించారు. సదరు వీలునామాలో అప్పటి ఆశ్రమ నిర్వాహకులైన అచ్యుతానంద భరతస్వామికి ఆశ్రమ నిర్వహణ ఖర్చుల నిమిత్తం మరో నాలుగు ఎకరాల భూమిని రుణ, దాన, విక్రయ హక్కులు లేకుండా వీలునామా రిజిస్ట్రేషన్ చేయించి సదరు భూమి ద్వారా వచ్చే రాబడిని మఠం నిర్వహణకు వినియోగించాలని పేర్కొన్నారు.



పెందుర్తిలోని భూమి

పెందుర్తి ప్రాంతంలో గల పట్టా నంబర్ 2698లో సర్వే నంబర్ 240/1బిలో 3.04 ఎకరాలు, పటా నంబర్ 2699లో సర్వే నంబర్ 240/2బిలో 4.71 ఎకరాలు, పటా నంబర్ 2899 సర్వే నంబర్ 241లో 1.06 ఎకరాలు, పట్టా నంబర్ 675లో సర్వే నంబర్ 271/1లో 25 సెంట్లు వెరసి.... మొత్తం 9.06 ఎకరాల భూమిలో నాలుగు ఎకరాలను ఆశ్రమ నిర్వహణకు కేటాయించారు. అచ్యుతానంద భారతస్వామి 1991లో మృతిచెందేంత వరకూ నాలుగు ఎకరాల భూమిపై వచ్చే రాబడిని అప్పన్న కుటుంబీకులు ఆశ్రమ నిర్వహణకు ఇచ్చేవారు. 1978 సంవత్సరం వరకూ అప్పన్న వర్ధంతి రోజున ఆశ్రమం వద్ద అన్న సమారాధన, ఆధ్యాత్మిక కార్యక్రమాలను వారసులు నిర్వహించేవారు.

వారసుల కబ్జా

అయితే శరగడం అప్పన్న వారసులు పెందుర్తిలో నిర్మించిన ఆశ్రమాన్ని నేలమట్టం చేసి, అక్కడ వాణిజ్య సముదాయం నిర్మించి అద్దెలకు ఇచ్చారని మంత్రి అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అదే విధంగా ఆశ్రమ నిర్వహణకు ఇచ్చిన నాలుగు ఎకరాల భూమిని కూడా అప్పన్న వారసులు ఆక్రమించుకున్నారని, సదరు భూమిలో కూడా వాణిజ్య సముదాయం, అపార్ట్‌మెంట్‌లు నిర్మించారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ల ప్రకారం సదరు 4.15 ఎకరాల భూములు చిద్గగానానంద ఆశ్రమానికి చెందుతాయని, అధికారులు ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించి, చట్ట ప్రకారం సదరు ఆస్తులను ఆశ్రమ నిర్వాహకులకు అప్పగించాలని సిట్ అధికారులను కోరినట్టు మంత్రి అయ్యన్నపాత్రుడు తెలిపారు.

చంపేస్తామంటూ బెదిరింపులు

ఆశ్రమ నిర్వాహకులు తమకు చెందిన దాన భూముల గురించి దాత వారసులను వెళ్లి అడిగితే, చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

దానం ఇచ్చినట్టుగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లు ఉన్నా, శరగడం అప్పన్న వారసులు ఆశ్రమ నిర్వాహకులను చంపేస్తామంటూ బెదిరించడంపై పోలీసు, రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు.

ఉత్తరాంధ్రలో ఎన్నో ప్రత్యేకతలు

తెలుగు కథను సుసంపన్నం చేసిన జిల్లా రచయతలు

సదస్సులో నటుడు, రచయత గొల్లపూడి

ఎంవీపీకాలనీ: ఉత్తరాంధ్ర నీటిలో, గాలిలో, సమస్తంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని, చెప్పగలిగిన సమస్యలు, పరిష్కరించగల నేర్పు రచయతలకు ఉందని ఉత్తరాంధ్ర తెలుగు కథ ఉత్తమాంధ్ర తెలుగు కథ అని ప్రసిద్ధ రచయత, సినీ నటుడు గొల్లపూడి మారుతీరావు అన్నారు. ఏయూ హిందీ విభాగం డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సెమినార్ హాల్‌లో సాహిత్య అకాడమీ దక్షిణ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నిర్వహించిన విశాఖ జిల్లా కథా సాహిత్యం సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు.

విశాఖ జిల్లాలో తెలుగు కథను సుసంపన్నం చేసిన కథారచయతలు ఎందరో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన విశాఖజిల్లా విస్తృతిని గురించి వివరించారు. పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం విశాఖజిల్లాలో ఉండే బరంపురం ఒడిశాకు వెళ్లిందన్నారు.



మాట్లాడుతున్న గొల్లపూడి మారుతీరావు

బరంపురం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రచయతల గురించి వివరించారు. ఎంతోమంది కథా రచయతలు కలిగిన ఈ సంసారం చాల పెద్దదన్నారు. సాహిత్య అకాడమీ సంచాలకుడు డాక్టర్ ఎన్ గోపీ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఎంతో మంది కథా రచయతలు ఉన్నారని వివరించారు. ఎన్నో వ్యాసాలు, కథలు, నవలలు, తదితర సాహిత్య ప్రక్రియలలో విశేష పురస్కారాలు పొందిన గొల్లపూడి మారుతీరావును ముఖ్యఅతిథిగా ఆహ్వానించడం సముచిత నిర్ణయమన్నారు. 100 శిక్షణ తరగతులలో లభించే జ్ఞానం ఒక సదస్సును ఆద్యంతం వీక్షించడం ద్వారా పొందవచ్చన్నారు. విశాఖ సాహితీ అధ్యక్షురాలు ఆచార్య కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ విశాఖజిల్లాలో కథా సాహిత్యానికి ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు.

ప్రముఖ రచయత చింతకింద శ్రీనివాసరావు మాట్లాడుతూ కథ అంటే కాలపరీక్షకు నిలిచేదన్నారు. కార్యక్రమంలో డి.వి.సూర్యారావు, కందాళ కనకమహాలక్ష్మి, ఎల్.ఆర్.స్వామి, వి సిమ్మన్న, ద్విభాష్యం రాజేశ్వరరావు, అయ్యంగారి సీతారత్నం, ఆదూరి సీతారామమూర్తి, నగరంలోని అనేక మంది సాహితీవేత్తలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం పెంచాల్సిందే..

పెందుర్తి: పెందుర్తి-ఆనందపురం-అనకాపల్లి నేషనల్ ఎక్స్‌ప్రెస్ హైవే బైపాస్ రోడ్డు విస్తరణలో భాగంగా మండలం సరిపల్లిలో భూసేకరణ సర్వే చేసేందుకు వచ్చిన సిబ్బందిని భూ బాధిత రైతులు మంగళవారం అడ్డుకున్నారు. విస్తరణలో కోల్పోతున్న భూములకు నష్ట పరిహారం పెంపు మొత్తం తెలపకుండా సర్వే చేయరాదని రైతులు బీష్మించారు. బైపాస్ రోడ్డు విస్తరణతో పాటు రింగ్ రోడ్డు పేరిట బలవంతపు భూసేకరణ జరుపుతున్నారని ఆరోపించారు.అయితే సర్వేను అడ్డుకోవడం సరికాదని భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ అధికారి సుబ్బరాజు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సర్వే చేస్తేగాని విస్తరణలో ఎంత భూమి కోల్పోతుందో తెలుస్తుందని, బాధిత రైతుల వివరాలు, నష్ట పరిహారం చెల్లింపు తెలుస్తుందని చెప్పారు. అయినా రైతులు సర్వేకు అంగీకరించలేదు. నష్టపరిహారం పెంచేదాక, సర్వే చేయనీయమని తెగేసి చెప్పారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం కొనసాగింది. దీంతో ఎస్‌డీసీ సుబ్బరాజు రైతులకు సమాధానమిస్తూ కొత్త భూసేకరణ



రైతులకు నచ్చజెబుతున్న అధికారులు

చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ వేల్యూకు మూడు రెట్లు అధికంగా నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు.అయితే ఈనష్ట పరిహారం సరిపోదని పెంచాల్సిందేనని రైతులు తెలిపారు. వారు ప్రతిఘటించడంతో సర్వే చేయకుండా సిబ్బంది వెనుదిరిగారు. రైతుల సమస్యపై వినతి పత్రం అందజేయాలని తహసీల్దార్ లాలం సుధాకర్ నాయుడు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డివర లక్ష్మి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, మండల సర్వేయర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు సొమ్ము స్వాహా

ఆశీల్‌మెట్ట: క్రెడిట్ కార్డు నుంచి సొమ్ము కాజేశారని రామ్‌నగర్‌కు చెందిన ఎస్.అరవింద్ కుమార్ మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిందటి నెల ఏడో తేదీ తనకు ఒక ఫోన్ వచ్చిందని, తన క్రెడిట్ కార్డు లిమిట్ రూ.20వేల నుంచి రూ.40వేలకు పెంచుతున్నామని, ఖాతా నంబర్ ఓటీపీ వివరాలు తెలపాలని కోరడంతో చెప్పానని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ తరువాత అందులో పేటీఎం ద్వారా రూ.6వేలు కాజేశారని పోలీసులకు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోశాల కూడలిలో ప్రమాదం

సింహాచలం: గోశాల కూడలిలో మంగళవారం రాత్రి 8.15 గంటలకు కారు, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. సింహాచలం నుంచి గోశాల మీదుగా వేపగుంట వెళ్తున్న ద్విచక్ర వాహనం ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందుబాగా దెబ్బతినగా, ద్విచక్ర వాహన చోదకుడు చెయ్యి విరిగింది.

ఉడకని అన్నం..నీళ్ల సాంబార్

- కేజీహెచ్‌లో అమలుకాని డైట్
- మెనూకు తూట్లు..
- పట్టించుకోని డైటీషియన్
- రోగుల ఆందోళన.. అధికారులకు ఫిర్యాదు



ఇదేం భోజనం!

ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం/ మహరాణిపేట: ఉడికీ ఉడకని అన్నం.. ఒక్కోసారి ముద్దలాంటి అన్నం, నీళ్ల లాంటి సాంబార్, పెడుతున్నామని అనిపించుకునేందుకు ఓ కూర, గంజి కంటే దారుణంగా ఉండే మజ్జిగ..! ఇదీ కింగ్ జార్జ్ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న భోజనం. ఇదేం భోజనమని అడిగినా.. భోజనం మార్చండి అని పొరపాటున రోగులు చెప్పినా అంతే సంగతులు.. డైట్ కాంట్రాక్టర్‌కు చెందిన సిబ్బంది రోగులపై పడిపోతారు.. 'ఇదేం నీ ఇల్లు అనుకుంటున్నావా..? పెట్టింది తిను.. లేకపోతే మానెయ్' అంటూ హూంకరింపులతో నోరుపారేసుకుంటారు.

కొన్నేళ్లుగా కేజీహెచ్‌లోని రోగులకు అందిస్తున్న భోజనం ఇదే వి ధంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. మంగళవారం సాయంత్రం రోగులకు అందించిన ఆహారం బాగోలేకపోవడంతో పలువురు రోగులు ఆందోళన చేయడంతోపాటు అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు ఇంటి దగ్గర ఉన్నట్టు భోజనం ఉండదని, సర్దుకోవాలని చెప్పడం చూస్తుంటే ఇక్కడ పరిస్థితులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

బలవర్ధక ఆహారం కోసం..

ఆసుపత్రుల్లో చికిత్స పొందే రోగులకు బలవర్ధక ఆహారాన్ని అందించడం వల్ల వేగంగా కోలుకునే అవకాశముంటుంది. రోగులు బయటి నుంచి తీసుకునే ఆహారంలో పోషకాలు, ప్రోటీన్లు ఉండవు. ఈ ఉద్దేశంతో ప్రభుత్వాలు ఆసుపత్రిలోనే నాణ్యమైన పోషకాహా రాన్ని రోగులకు అందిస్తున్నాయి. కేజీహెచ్‌లో రోగులకు అందిస్తున్న ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం బాగుపడడం మాట దేవుడెరుగుగానీ, ప్రాణాలు గాల్లో కలిసిపోయేలా ఉన్నాయని పలువురు ఆందోళన

ఉడకని అన్నం

వ్యక్తం చేస్తు న్నారు. కాగా.. ప్రతిరోజూ కేజీహెచ్‌లో సుమారు 1400 మంది రోగు లకు మూడు పూటలా ఆహారాన్ని అందిస్తారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రతిరోగికి రోజుకు రూ.40 చొప్పున డైట్ కాంట్రాక్టర్‌కు చెలిస్తోంది.

అమలుకాని మెనూ..

మెనూ అమలవుతున్నదీ లేనిదీ, భోజనం నాణ్యత పరిశీలించాల్సిన చీఫ్ డైటీషియన్ మాత్రం ఇవేమీ పట్టనట్టు వ్యవహరిస్తుంటారు. ఉదయం రోగులకు అందించే టిఫిన్ ఇడ్లీ అయితే 150 గ్రా, పొంగల్, ఉప్మా, కిచిడి 300 గ్రా, సాంబారు/చట్నీ 100 మి.లీ, బ్రెడ్ 100 గ్రా, పాలు 150 మి.లీ ఇవ్వాలి. మధ్యాహ్న భోజనం అన్నం 600 గ్రా., వెజ్ కర్రీ 150 గ్రా., సాంబార్ 200 మి.లీ., ఉడించిన గుడ్లు, పెరుగు/మజ్జిగ 100/200 మి.లీ, ఏదో ఒక పండు అందించాలి. రాత్రికి అన్నం 150 గ్రా., వెజ్‌కర్రీ 150 గ్రా., సాంబారు 200 మి.లీ., పెరుగు/మజ్జిగ 100/200 మి.లీ., అందించాల్సి ఉంటుంది. కొన్ని వార్డుల్లో ఉండే రోగులు, మహిళలను బట్టి మెనూలో కొద్దిపాటి మార్పులుంటాయి. అయితే, ఈ మెనూ బోర్డులు ప్రదర్శనకే పరిమితమవుతున్నాయి తప్పా అమలు నోచుకోవడం లేదు.

ఆకలితో అలమటిస్తూ..

కేజీహెచ్‌కు వస్తున్నవారిలో అధికశాతం మంది నిరుపేదలే. ఇక్కడ అందిస్తున్న ఆహారాన్ని తినలేక చాలా మంది రోగులు, రోగుల బంధువులు బయటి నుంచే ఆహారాన్ని కొనుగోలుచేసి మరీ తెచ్చుకుంటున్నారు. ఆసుపత్రిలో ఐదారురోజులు ఉండాల్సి వస్తే బయటి నుంచి భోజనం తీసుకురావడానికి భారీగానే ఖర్చు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. బయటి భోజనాన్ని కొనుగోలు చేయలేని నిరుపేదలు ఆసుపత్రిలో ఇస్తున్నది తీసుకుంటున్నప్పటికీ దానిని తినలేక బయటే పారేస్తున్నారు. దీంతో చాలామంది రోగులు ఆకలితో అలమటిస్తూనే వైద్యాన్ని చేయించుకుంటున్నారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న రోగులు

తినలేక పారబోస్తున్నాం



సాంబర్, మజ్జిగ నీళ్లలా ఉంటున్నాయి. అన్నం ముద్దలా ఉంటుంది. కూర దారుణంగా ఉంటుంది. వీటిని తినలేక పారబోస్తున్నాం. ఈ విధమైన భోజన తింటే రోగులు ఎలా కోలుకుంటారు.

దుర్గారావు, విశాఖ

బయట భోజనమే గతి



ఆస్పత్రిలో అందిస్తున్న భోజనం బాగోవడం లేదు. అన్నం జావలాగా ఉంటుంది. కూర సంగతి సరేసరి. ఉడక బెట్టిన గుడ్డు తప్ప ఇంకేమీ తినలేని పరిస్థితి నెలకొంది గత్యంతరం లేక బయట భోజనం కొనుకున్న తింటున్నాం.

జి రాము, ఎలమంచిలి

'సంక్షేమ' పాఠశాలల్లో సదుపాయాలు కల్పిస్తాం

- మంత్రి ఆనంద్‌బాబు
- మేహాద్రిగెడ్డ గురుకుల విద్యాలయాల తనిఖీ
- నిర్వహణ తీరుపై అసంతృప్తి
- అధికారులపై ఆగ్రహం



విద్యార్థినితో మాట్లాడుతున్న మంత్రి ఆనంద్‌బాబు

గోపాలపట్నం: ప్రభుత్వ సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజన, వైద్య వసతి కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన శాఖా మంత్రి నక్కా ఆనంద్‌బాబు అన్నారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, కళాశాలను మంత్రి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో భోజన ఏర్పాట్లు పరిశీలించి భోజనం కోసం వినియోగించే ఆహారధాన్యాలు నాణ్యంగా లేవంటూ మంత్రి అసహనం వ్యక్తం చేశారు.

వసతిగృహం నిర్వహణ సరిగాలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహంలోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరైనా టెండర్లు పిలవడంలో అలసత్వం వహించిన సంక్షేమ శాఖ ఈఈ ఆదినారాయణపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఏజెన్సీల్లో అనారోగ్య ఘటనలు దృష్టిలో ఉంచుకుని గిరిజనుల వైద్య, విద్యపై మరింత శ్రద్ధ వహిస్తున్నామన్నారు. మంత్రి వెంట పలువురు అధికారులు, ప్రిన్సిపాల్ రామారావు ఉన్నారు.

ఢిల్లీ ధర్నాలో ఉక్కు కార్మిక సంఘ నాయకులు



ఢిల్లీలో కార్మిక మహాధర్నాలో పాల్గొన్న ఇంటక్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్: ఢిల్లీలో మంగళవారం జరిగిన కార్మిక మహాధర్నాలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు. పలు అంశాలను జాతీయ కార్యవర్గం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ధర్నాలో మంత్రి రాజశేఖర్, జి.బోసుబాబు, గంధం వెంకటరావు, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్ర రావు, బి.మురళీరాజు, నీలాపు సైనికుడు, మంత్రి మూర్తి, జె.రామకృష్ణ, మంత్రి శంకర్‌నారాయణ, జెర్రిపోతుల ముత్యాలు పాల్గొన్నారు.

లీజుకు పోర్టు భూములు

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం) విశాఖపట్నంలో అత్యధిక భూములు కలిగిన ప్రభుత్వ సంస్థల్లో పోర్టు ఒకటి. పోర్టు తన భూములను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడం లేదు. చాలావరకు నిరుపయోగంగా వున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన పోర్టు ఉన్నతాధికారులు వాటి ద్వారా ఆదాయం సాధించే మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇందుకోసం భూ వినియోగంపై వదోదరాకు చెందిన రాకేష్ అండ్ నరుల్లా సంస్థతో అధ్యయనం చేయించారు. వారు ఇచ్చిన నివేదిక ప్రకారం ఖాళీగా వున్న భూములను పారిశ్రామిక, వాణిజ్య, గృహ అవసరాలకు దీర్ఘకాలిక లీజుకు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చారు. తద్వారా భారీ ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.

విశాఖపట్నం పోర్టుకు మొత్తం 7,618 ఎకరాల భూములు వున్నాయి. అందులో 3,612 ఎకరాలను పారిశ్రామిక అవసరాలకు లీజుకు ఇచ్చేశారు. మరో 1,518 ఎకరాలు పోర్టుకు అవసరమైన మౌలిక వసతులు (రైలు, రోడ్డు మార్గాలు, డాక్‌లు) కోసం ఉపయోగించుకుంటున్నారు. ఇంకో 912 ఎకరాల్లో కొండలు, నీటి వాగులు, మొక్కలు తదితరాలు వున్నాయి. భీమిలి మండలం మూలకుద్దు, పరవాడ మండలం లంకెలపాలెంలో 1,576 ఎకరాలు ఖాళీగా వున్నాయి. అలాగే నగరంలో పోర్టు ఆస్పత్రి పక్కనున్న కైలాసపురంలో 62 ఎకరాలు, మల్కాపురంలో 10 ఎకరాలు, టి.సుబ్బిరామిరెడ్డి ఇంటి ఎదురుగా వున్న హార్బర్ పార్కు ఏరియాలో ఏడు ఎకరాలు వున్నాయి. ఇవన్నీ అత్యంత ఖరీదైన భూములు. ఆయా ప్రాంతాల్లో అవసరాలు, డిమాండ్‌ను బట్టి ఆ భూములను షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి, ఆఫీసు కార్యాలయాల కోసం ఉపయోగించుకోవాలని పోర్టు యాజమాన్యం భావిస్తోంది. కైలాసపురం వంటి ఏరియాల్లో నివాస గృహాలు నిర్మిస్తే మంచి డిమాండ్ వుంటుందనే వాదన వుంది. అలా చేస్తే ఏ ప్రాతిపదికన చేయాలి? అనే దానిపై కూడా కసరత్తు చేస్తున్నారు. మూలకుద్దు, లంకెలపాలెం భూములను పోర్టు అవసరాలకు అనుగుణంగా మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కుల నిర్మాణానికి ఉపయోగించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

బిడ్డర్లను ఆహ్వానించాం

హరనాథ్, పోర్టు డిప్యూటీ చైర్మన్

పోర్టు భూముల వినియోగంపై డిప్యూటీ చైర్మన్ హరనాథ్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, దీనిపై ఇప్పటికే ఒక సంస్థతో అధ్యయనం చేయించామన్నారు. ఈ భూములను ఆదాయ మార్గాలుగా మలుచుకోవడానికి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ)కు పిలుపు ఇచ్చామన్నారు. నగరంలో సుమారుగా 100 ఎకరాల వరకు వుందని, వాటిని వాణిజ్య, గృహ అవసరాలకు ఉపయోగించుకుంటున్నామన్నారు. నగరానికి దూరంగా వున్నవాటిని పారిశ్రామిక అవసరాలకు ఇస్తామన్నారు. ఏదేమైనా భూములను విక్రయించే ఆలోచన లేదని, వాటి ద్వారా ఆదాయం జనరేట్ చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎవరు ఎక్కువ ఆదాయం చూపిస్తారో వారికి అవకాశం కల్పిస్తామని స్పష్టంచేశారు. ఇది వ్యాపార ఆలోచన కాదని, భూములను నిరుపయోగంగా వుండకుండా నగర అభివృద్ధికి కూడా దోహదపడాలనేదే తమ ఆలోచన అని ఆయన వివరించారు.

కౌమారం కీలకం



జీవితంలో కౌమార దశ ఎంతో కీలకం. భవిష్యత్తును నిర్దేశించేందుకు సరైన సమయం. మంచి వైపు అడుగులు పడేది, చెడు వైపు ఆకర్షితులయ్యేది ఈ దశలోనే. మానసిక పరిపక్వత సరిగా ఉండని ఈ వయసులో వారికి సరైన దిశా నిర్దేశం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పిల్లల నడవడికను క్షుణ్ణంగా పరిశీలిస్తూ మంచిచెడులను వారికి అర్థమయ్యేలా ఎప్పటికప్పుడు వివరించాలని చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

ఎనిమిదో తరగతి విద్యార్థి, పదో తరగతి విద్యార్థి మధ్య వివాదం కొట్లాటకు దారి తీసి పదో తరగతి విద్యార్థి మృత్యువాతకు గురయ్యాడు. నిండా పదమూడేళ్లు కూడా లేని బాలుడు ఉద్రేకాన్ని అదుపు చేసుకోలేక పదో తరగతి విద్యార్థితో కొట్లాటకు దిగడం... ఆపై చనిపోయేలా కొట్టడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నగరంలోని మధురానగర్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. కౌమార దశలో ఉన్న పిల్లలు బుద్ధిగా పాఠాలు చదువుకోవడం మానేసి వీధి రౌడీల్లా ప్రాణాలు పోయేలా కొట్లాడుకోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. నేటి తరంలో నైతిక విలువలు, విచక్షణాజ్ఞానం లోపిస్తున్నాయనడానికి తాజా ఘటన ఉదాహరణగా మానసిక వైద్యులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇటువంటి వారి నడవడిక పట్ల అప్రమత్తంగా లేకుంటే భవిష్యత్తులో తీవ్ర అనర్థాలను ఎదుర్కొనే ప్రమాదం తప్పదని హెచ్చరిస్తున్నారు.

భవిష్యత్తును నిర్దేశించే సరైన సమయం

- 10- 19 ఏళ్ల మధ్య వయసులో మానసిక అపరిపక్వత
- ఏది మంచి, ఏది చెడు గుర్తించలేని వైనం
- క్షణికావేశం, ఉద్రేకం ఎక్కువ
- ఇది ఎమోషనల్ డెవలప్‌మెంట్ స్టేజ్
- పిల్లల ప్రవర్తనను గమనించకపోతే అనర్థం
- దిశా నిర్దేశం చేయాల్సింది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే..
- మానసిక వైద్య నిపుణుల సూచన

సాధారణంగా మనిషి పుట్టినప్పటి నుంచి ఎదుగుదలలో మూడు దశలు ఉంటాయి. బాల్య దశగా పేర్కొనే 10 ఏళ్ల వరకూ ఎలాంటి ఉద్రేకాలు లేకుండా కేవలం అనుకరణ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. తరువాత వచ్చే కౌమార దశ 11-19 ఏళ్ల వారిలో తాము పరిశీలించిన, నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలనే ఉత్సుకత ఎక్కువగా ఉంటుంది. దాని వల్ల కలిగే అనర్థాలపై ఎలాంటి ఆలోచన ఉండదు. మనసుకు తట్టడమే తడవుగా... వెనుకా ముందు చూడకుండా ఆచరణలో పెట్టేస్తారు. దీని వల్ల తీవ్ర పరిణామాలను ఎదుర్కొనాల్సి ఉంటుందనే విచక్షణాజ్ఞానం కూడా ఉండదు. ఈ నేపథ్యంలో ఈ దశను అత్యంత ప్రమాదకర దశగా పేర్కొంటారు. కౌమార దశలో ఉన్నవారి పట్ల తల్లిదండ్రులు, పాఠశాల, కళాశాలల్లోని ఉపాధ్యాయులు కొంత అప్రమత్తంగా ఉండాలి. వారికి మంచిచెడులను క్షుణ్ణంగా తెలిసేలా విడమరిచి చెప్పడంతోపాటు గొప్పవారి చరిత్ర, వారి నేపథ్యాలు, ఆ స్థాయిలో పడ్డ కష్టాలను వివరించడం ద్వారా వారిలో నైతిక విలువను పెంపొందించే ప్రయత్నం చేయాలి. ఆ వయసు వారికి తమ నేపథ్యాలు, తమ సహచరుల నేపథ్యాలపై అవగాహన ఉండకపోవడంతో పాటు వారి కుటుంబ నేపథ్యం గురించి ఆలోచన ఉండదు. అందువల్లే తామంతా ఒక్కటే అన్న భావన ఉంటుంది. సైకాలజీ పరిభాషలో 'ఎమోషనల్ డెవలప్‌మెంట్ స్టేజ్'గా పేర్కొనే ఆ దశలో పిల్లల్లో షార్ట్ టెంపర్ ఎక్కువగా ఉంటుంది. తమ లోపాలను నేరుగా బయటపెట్టినా, తమ తప్పుని ప్రశ్నించినా తట్టుకునే శక్తి లేనందున షార్ట్‌టెంపర్‌కు పోయి అసంకల్పితంగానే తక్షణ ప్రతీకార చర్యకు దిగుతారు. అది ఎదుటివారిని దూషించడం కావచ్చు లేదా దాడి చేయడం కావచ్చు. ఏదైనా తరువాత ఎదురయ్యే పరిణామాలను లెక్క చేయరు. మానసిక దృఢత్వం సరిగా వృద్ధి చెందని పరిస్థితి కావడంతో ప్రతీకారం కోసం తీవ్రంగా రగలిపోతుంటారు. అవకాశం చూసి ఎదుటివారిపై దాడులకు కూడా దిగుతారు. ఇలాంటి సందర్భాల్లో తీవ్ర గాయాలైనా, తగలరానిచోట ఎక్కడైనా దెబ్బ తగిలినా ఎదుటివారి ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంటుంది.

కుటుంబ నేపథ్యమే కీలకం

పిల్లల ఎదుగుదల, ప్రవర్తనా విధానంలో కుటుంబ నేపథ్యం కీలకంగా మారుతుంది. కొందరిలో జన్యుపరమైన కారణాలు కూడా దోహదం చేస్తాయి. ప్రధానంగా పిల్లలు పెరిగే వాతావరణం... తాము రోజూ చూసే దృశ్యాలు వారి ప్రవర్తనపై ప్రభావం చూపుతాయి. విచక్షణారహితంగా ప్రవర్తించే పిల్లల్లో ఎక్కువమంది తల్లిదండ్రులు విడిపోయినవాళ్లు, నిత్యం గొడవపడే తల్లిదండ్రులు గలవారే ఉంటారు. అలాంటి కుటుంబాల్లో పిల్లల నడవడిక, ప్రవర్తన పట్టించుకునే పరిస్థితి ఉండదు. వారు చేసే పనుల్లో ఏది మంచి, ఏది చెడు, వాటి వల్ల ఎదురయ్యే పరిణామాలేమిటో వివరించేవాళ్లు ఉండరు. దీంతో తాము చేసిందే సరైనదనే భావన పిల్లల్లో ఏర్పడుతుంది. రానురాను అది బలపడి వారి ప్రవర్తనా విధానాన్నే ప్రభావితం చేస్తుంది. తల్లిదండ్రులు తమ నేపథ్యం ఏదైనా, తాము ఎలా ఉన్నా పిల్లలను మాత్రం ప్రశాంత వాతావరణంలోనే పెంచేలా దృష్టిపెట్టాలి. పిల్లల నడవడికను క్షుణ్ణంగా పరిశీలిస్తూ మంచిచెడులను వారికి అర్థమయ్యేలా ఎప్పటికప్పుడు వివరించాలి. దీని వల్ల పిల్లల ప్రవర్తన దారితప్పకుండా ఉండేందుకు దోహదపడుతుంది.





తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే కీలకపాత్ర



పిల్లల ప్రవర్తనను నిర్దేశించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే కీలకపాత్ర. ఇంట్లో ఉన్నప్పుడే పిల్లలకు నీతి కథలను బోధించాలి. అలాగే వాళ్లు చేసే పనుల్లో మంచిచెడులను ఎప్పటికప్పుడు వివరించాలి. గెలుపుఓటములను సమానంగా ఆస్వాదించే విచక్షణను పెంపొందించగలగాలి. వ్యక్తిగత ప్రవర్తన విధానం నేర్పాల్సిన బాధ్యత పూర్తిగా తల్లిదండ్రులదే. సంఘంలో లేదా సమూహంలో ఎలా ప్రవర్తించాలని నేర్పడం మాత్రం ఉపాధ్యాయులపైనే ఉంటుంది. పిల్లల ప్రవర్తన, వారి వ్యక్తిత్వం, నిజస్వరూపం బయటపడాలంటే సైకాలజీ పరంగా 'ప్లే థెరపీ' నిర్వహిస్తుండాలి. అంటే ముగ్గురు, నలుగురిని ఒకచోట కూర్చోబెట్టి ఆటలు ఆడించడం, ఏదైనా విషయంపై బృందంగా చర్చించడం నేర్పాలి. తరువాత పది మంది, అలా వందమందిని ఒక చోటకు చేర్చి ఆటలు, బృంద చర్చలు నిర్వహించాలి. దీని వల్ల ఎవరి వ్యక్తిత్వం ఏమిటనేది బయటపడుతుంది. ఓటమి లేదా వ్యతిరేకత ఎదురైనప్పుడు ఎవరు ఎలా ప్రవర్తిస్తున్నారో గుర్తించి వారి ప్రవర్తనను సరిదిద్దేందుకు వీలుంటుంది. అయితే ఇప్పటి పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

- డాక్టర్ ఎన్ఎన్ రాజు,
మానసిక వైద్య నిపుణుడు

వైవిధ్యం.. గిరిజన జీవనం



గిరిజనుల జీవనం వైవిధ్యభరితం. వారి కట్టుబొట్టు, భాష, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు విభిన్నం. నాగరిక ప్రపంచానికి దూరంగా జీవిస్తున్నప్పటికీ అడవి బిడ్డల జీవన విధానం ఇతరులకు ఆదర్శం. ఏజెన్సీలోని గ్రామాల పేర్లు కూడా ప్రత్యేకంగా ఉంటాయి. మన్యంలో గిరిజనులు నిత్యం ప్రకృతిలోనే మమేకమై జీవిస్తారు. ఆడ పిల్ల భారమని భావించే నేటి ఆధునిక సమాజంలో గిరిజనులు మాత్రం నూటికి నూరు శాతం మంది తమకు ఆడపిల్లే పుట్టాలని కోరుకుంటారు. వారు జరుపుకునే పండుగలు కూడా వైవిధ్యంగా ఉంటాయి. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విశాఖ మన్యంలోని గిరిజనులపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం. - పాడేరు

- కట్టుబొట్టు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు విభిన్నం
- లిపి లేని వాడుక భాషలు ఎన్నో..
- అడవిపైనే ఆధారం
- ఆడ పిల్ల పుడితే పల్లెలో పండుగే

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా..

ఏజెన్సీ 11 మండలాల్లో 244 పంచాయతీల పరిధిలో 3,574 గిరిజన పల్లెల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 7 లక్షల మంది గిరిజనులు జీవిస్తున్నారు. వారిలో 18 తెగలకు చెందిన గిరిజనులున్నారు. భగత, కొండదొర, వాల్మీకి, కొటియా, నూకదొర, కొండరెడ్డి, కొండకాపు, జాతాపు, కమ్మర, కులియా, మాలి, కోయ, నాయిక్, కోందు, పోర్జా, పరంగిపోర్జా, గదబ, డొంగ్రిగదబ(కోందు, పోర్జా, గదబ తెగలను ఆదిమ జాతి గిరిజనులుగా గుర్తిస్తారు). మొత్తం గిరిజన తెగల్లో భగత, వాల్మీకి, కొండదొర తెగలు అభివృద్ధిలో కాస్త ముందుండగా... ఇతర తెగలు అభివృద్ధి వైపు నడుస్తున్నాయి. ఆదిమ జాతి తెగలుగా ఉన్న కోందు, పోర్జా, గదబ గిరిజనులు అభివృద్ధికి దూరంగా ఉన్నారు.

కొనసాగుతున్న సంప్రదాయాలు

గిరిజనులు పాటించే కొన్ని రకాల ఆచారాలు, సంప్రదాయాలు కూడా ఆసక్తిగానే ఉంటాయి. గిరిజనులు స్నేహానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తారు. అలాగే ఒక గ్రామానికి చెందిన వారు మరో గ్రామానికి చెందిన వారితో స్నేహం ఏర్పరచుకుంటారు. అలాగే కష్టాలు, ఇబ్బందులు ఏర్పడినప్పుడు స్నేహితులైన గిరిజనులు పరస్పరం సహాయం చేసుకుంటుంటారు. పంటలు సరిగా పండని సమయాల్లో విత్తనాలు, ఇతర వస్తువులు, డబ్బులు ఇచ్చిపుచ్చుకుంటూ తమ స్నేహాన్ని చాటుకుంటారు. అలాగే వ్యవసాయ పనుల్లో సైతం పరస్పరం సహాయం చేసుకుంటారు. అందువల్లే ఏజెన్సీలో వ్యవసాయ కూలీల కొరత వంటి సమస్యలు తలెత్తవు.



లిపి లేని వాడుక భాషలు

ఏజెన్సీలో ఒడిశా రాష్ట్రానికి ఆనుకుని ఉన్న ముంచంగిపుట్టు, పెదబయలు, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లోని గిరిజనులు ఒరియా భాషను మాట్లాడతారు. అలాగే వాల్మీకి తెగలకు చెందిన గిరిజనులు కుపియా భాషను, కోందు తెగకు చెందిన గిరిజనులు కోందు భాషను మాట్లాడతారు. ఒడిశాలో గిరిజనులు మాట్లాడే ఒరియాకు లిపి ఉండగా.... ఒడిశాను ఆనుకుని ఉన్న ఏజెన్సీ గిరిజనులు మాట్లాడే ఒరియాకు మాత్రం ఎటువంటి లిపి లేదు. అయితే స్థానిక గిరిజనులు హిందీ, ఒరియా కలగలిపిన ఒరియాతో మాట్లాడతారు. దీంతో దీనిని దెసియా ఒరియా అని స్థానిక గిరిజనులు వ్యవహరిస్తారు. ఫలితంగా దీనికి ఎటువంటి లిపి లేదు. అలాగే వాల్మీకి తెగ, కోందు తెగ గిరిజనులు మాట్లాడే భాషలకు సైతం లిపి లేదు. అలాగే ఏజెన్సీలో ఒడిశాను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో తప్ప పాడేరు, హుకుంపేట, అనంతగిరి, చింతపల్లి, కొయ్యూరు, జీకే వీధి ప్రాంతాల్లో జీవించే గిరిజనులకు ఒరియా రాని పరిస్థితి చాలా ఏళ్లుగా కొనసాగుతుంది.





ఆడ పిల్లే పుట్టాలని కోరుకుంటారు

నాగరికతతో జీవిస్తున్న నేటి సమాజంలో ఆడ పిల్ల పుట్టకూడదని కోరుకునే వాళ్లే అధికంగా ఉంటారు. కానీ ఏజెన్సీలో అందుకు పూర్తి భిన్నంగా తమకు ఆడ పిల్ల పుట్టాలని కోరుకున్న వాళ్లే నూటికి నూరు శాతం ఉంటారంటే అతిశయోక్తి కాదు. ప్రధానంగా ఏజెన్సీలో అమ్మాయిలు పుట్టడం వల్ల గిరిజనులకు ఎలాంటి భారం ఉండదు. అలాగే ఖర్చుతో కూడిన పెళ్లిళ్లు, భారీ స్థాయిలో వరకట్నాలు వంటి ఆర్థిక పరమైన ఇబ్బందులు అసలే ఉండవు. అలాగే అమ్మాయిలే తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటారు. దీంతో అమ్మాయి పుట్టిందంటే అన్ని విధాలా శుభమనే అభిప్రాయం ఏజెన్సీలో నేటికీ కొనసాగుతుంది. అలాగే అమ్మాయిలు సైతం చిన్నతనం నుంచి బాధ్యతలు నెత్తిన వేసుకుని తల్లిదండ్రుల అడుగుజాడల్లో నడుస్తారు. దీంతో వారి వల్ల తలిదండ్రులకు ఎటువంటి సమస్యలు ఉండవు. పైగా అబ్బాయికి మించి పనులు, ఇతర బాధ్యతలను చేపడతారు. అందువల్ల గిరిజన ప్రాంతంలో అమ్మాయి పుడితే ఆ గ్రామంలో గిరిజనులంతా కలిసి పండుగ చేసుకుంటారు. గిరి పల్లెల్లో ఎటువంటి కార్యం జరిగినా థింసా నృత్యం సందడి ఉంటుంది. వ్యవసాయ పనులు మొదలు పెట్టినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు అనేక రకాలైన పండుగలను చేస్తుంటారు. అలాగే పంటలన్నీ చేతికి వచ్చిన తరువాత ఇటుకల పండుగను చేస్తారు. ఇది వారికి సంక్రాంతి పండుగలాంటిది.

గిరి'జన జీవన' విధానం

ఏజెన్సీని భౌగోళికంగా చూస్తే జిల్లాలో సగ భాగం (అంటే 6 వేల చదరపు కిలోమీటర్లు) విస్తరించి ఉంది. 18 గిరిజన తెగలకు చెందిన అడవి బిడ్డలు జీవిస్తున్నారు. వారిలో ఏడు లక్షల మంది ఆదిమ జాతికి చెందిన కోదు, గదబ, పోర్జా తెగల గిరిజనులున్నారు. వారు కొండకోనల్లో ప్రకృతి ఒడిలో స్వేచ్ఛగా, హాయిగా జీవించేందుకే ఇష్టపడతారు. తమకు అందుబాటులో ఉన్న అడవి, దాని చుట్టూ ఉన్న భూమిని, తమ కష్టాన్ని మాత్రమే నమ్ముకుంటూ జీవిస్తుంటారు. కొండపై పోడు వ్యవసాయం ద్వారా వరి, రాగులు, సామలు పండించుకుని వారికి అవసరమైన ఆహారాన్ని సమకూర్చుకుంటారు. ఎక్కువగా రాగులతో చేసిన జావ(అంబలి) తాగుతారు. అలాగే వరి, సామ గింజలతో అన్నం వండుకుని తింటారు. తెల్లవారుజామున లేచి కుటుంబమంతా పొలం పనులకు వెళ్లిపోతారు. ఉదయం పది గంటల వరకు పొలం పనులు చేసుకుని ఇంట్లో చేసిన రాగి జావను తాగేసి మళ్లీ అడవికి వెళ్లిపోతారు. అడవుల్లో లభించే పనస, మామిడి పండ్లను తింటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అడవిలోనే వ్యవసాయం, వంట చెరకు సేకరణ వంటి పనులు చేసుకుని సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి చేరుకుంటారు. ఎనిమిది గంటలకల్లా రాత్రి భోజనం (వరి లేదా సామ అన్నం, గుమ్మడి కూర, రాజ్‌మా పిక్కల పులుసు) ఆరగించి నిద్రలోకి జారుకుంటారు. ఇదీ గిరిజనుల రోజు వారి జీవనం విధానం.



పురాతన పనిముట్లు

- నేటికీ సంప్రదాయ వస్తువుల వినియోగం
- సహజసిద్ధ వనరుల నుంచి తయారు చేసుకుని వాడకం
- ఇదీ గిరిజన జీవన సౌందర్యం



పొలానికి నీరు పెట్టేందుకు వినియోగిస్తున్న జీలుగుదోని

అనంతగిరి రూరల్: రోజుకో మోడల్, వారానికో స్టైల్ మారుతున్న ఈ ఆధునిక ప్రపంచంలో నేటికీ సంప్రదాయ వస్తువులను సహజసిద్ధ వనరుల నుంచి తయారుచేసుకుని జీవనం సాగిస్తుండడం ఆదివాసీల ప్రత్యేకత. అడవి తల్లి ఒడే వారికి నీడ కాగా, అక్కడ లభించే రాళ్లు, చెక్కలను చెక్కి నిత్యావసరాలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులే ప్రస్తుతం రాజ్యమేలుతుండగా గిరిజన గ్రామాల్లో మాత్రం ఇప్పటికీ సంప్రదాయ వస్తువుల వినియోగం కనిపిస్తుంది. మన్యంలోని గ్రామాల్లో రైతులు పొలం దున్నేందుకు ఇప్పటికీ కర్రలతో చేసిన నాగళ్లనే వాడుతుండగా, పశువులకు దాణా వేసేందుకు కొండల్లో లభించే బండరాళ్లను కుండీలుగా చెక్కి వినియోగిస్తున్నారు. దాదాపు అన్ని గిరిజన గ్రామాల్లో ఈ రాతి నీళ్ల తొట్టెలు దర్శనమిస్తుంటాయి. గిరిజన గ్రామాల్లో ప్రతి ఇంట్లో పెద్ద చెట్టు మోడులతో చేసిన చెక్క తిరగళ్లు వినియోగిస్తుంటారు. అలాగే వ్యవసాయం ద్వారా పొందే ఆహార దినుసుల నూర్పులకు చెక్కలతో చేసిన సామగ్రినే ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇంట్లో గరిటెలకు బదులుగా చేదుఆనపకాయలతో డిప్పలను తయారుచేసి వాటిని గరిటెలుగా ఉపయోగిస్తారు. ఇలా నిత్యావసర పనుల నుంచి వ్యవసాయ పనుల వరకు ఆదివాసీలు సహజసిద్ధ పనిముట్లనే అధికంగా వినియోగిస్తున్నారు.



కర్రతో తయారు చేసిన పనిముట్లతో రాగులు కొడుతున్న గిరి మహిళ(ఫైల్)



గిరి గ్రామాల్లో పశువుల దాణాకు వాడే రాతి కుండీ



గిరిజనులు వినియోగించే ఆనపడిప్ప



పొలం దున్నేందుకు వాడుతున్న కర్ర నాగలి

సినిమా గైడ్



- **నక్షత్రం :** శ్రీ వెంకటేశ్వర, విమ్యాక్స్-1, సంగం, శ్రీరామా, శ్రీలక్ష్మీనరసింహ స్క్రీన్-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం)
- **దర్శకుడు :** విమ్యాక్స్-2, కామేశ్వరి, సత్యం (గోపాలపట్నం)
- **ఫిదా :** జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం)
- **గౌతమ్‌నంద :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ స్క్రీన్-2 (104 ఏరియా), శంకర (గోపాలపట్నం)
- **నిన్ను కోరి :** శ్రీ లీలామహల్, సుకన్య (గోపాలపట్నం), పరమేశ్వరి (కంచరపాలెం),
- **శమంతకమణి :** గోకుల్

రైతు బజార్‌లో ధరలు

ధరలు		(కిలో/ రూ.ల్లో)	
అల్లం (కొత్తది)	54	గోరుచిక్కుడు	22
ఆగాకర	120	చేమదుంపలు	30
ఆగాకర(హైబ్రీడ్)	42	కంద	30
చిలకడదుంప	24	కాకరకాయలు	26
ఆనప	12	పచ్చి బఠాణి	100
అరటికాయ (పె)	8	పొటల్స్	40
అరటికాయ (చి)	6	పొట్లకాయ	12
బీరకాయలు	24	బంగాళాదుంపలు	11
బెండకాయలు	16	ఉల్లిపాయలు	28
బరబాటి	26	ఉల్లిపాయలు (దేశీవాళి)	28
బీన్స్	42	టమాటా	46
బీన్స్ పిక్కలు	55	టమాటా(హైబ్రీడ్)	44
బీట్‌రూట్	24	మునగకాయలు (కిలో)	42
వంకాయలు (తెలుపు)	28	క్యాప్సికం...	
		కర్రపెండలం	20
వంకాయలు (నలుపు)	26	పెండలం	24
		చిక్కుడు	40
వంకాయలు (వెల్లంకి)	36	దేవుడు చిక్కుడు	64
క్యారట్	24	పచ్చబఠాని	64
క్యాబేజీ	16	వెల్లుల్లి	55
క్యాబేజీ (అరకు)	17	కాలీఫ్లవర్	32
కాప్సికమ్	40	మిర్చి (నలుపు)	36
దొండకాయలు	24	మిర్చి (తెలుపు)	32
దోసకాయలు	20	మిర్చి (బజ్జీ)	28
కీరదోస	24	ముల్లంగి	14

చికెన్ ధరలు

	వెంకాబ్	బ్యాగ్
లైవ్ ధర	91.00	90.00
విత్ స్కిన్	127.00	150.00
స్కిన్ లెస్	150.00	160.00

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	340
విజయనగరం	344
శ్రీకాకుళం	344

రైల్వే సమాచారం

రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు, ఇతర సమాచారం కోసం...	139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు	182
విశాఖ రైల్వే పోలీసు స్టేషన్...	0891-2746211

చంద్రంపాలెంలో భారీ చోరీ

22.5 తులాల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి సామగ్రి, రూ.65 వేలు అపహరణ

మధురవాడ : పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రంపాలెంలో సోమవారం అర్ధరాత్రి ఒక ఇంట్లో భారీ చోరీ జరిగింది. సుమారు 22.5 తులాల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి సామగ్రి, రూ.65 వేలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. పీఎం పాలెం సీఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

చంద్రంపాలెంలో సుందరంపల్లి సత్యం కుటుంబంతో నివసిస్తున్నారు. ఆయన నగరంలోని ఆంధ్రా మెడికల్ కాలేజ్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. వీరు తాము ఉంటున్న ఇంట్లోని మొదటి అంతస్తులో సోమవారం రాత్రి కుటుంబంతో నివసించారు. కింద ఉన్న ఇంట్లో బీరువాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు కింది ఉన్న ఇంటి వెనుక వైపు ఉన్న తలుపులు గడియ విరగ్గొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలోని సుమారు 22.5తులాల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి సామగ్రి, రూ.65 వేలు చోరీ చేశారు.

ఈ శబ్దాలకు మెలకువ వచ్చిన సత్యం కిందికి వచ్చి చూడగా అప్పటికే దొంగలు చోరీ సొత్తుతో పరారయ్యారు. వెంటనే సత్యం పీఎం పాలెం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి నార్త్ నేర విభాగం సీఐ చౌదరి, పీఎం పాలెం పోలీసులు హుటాహుటిన చేరుకొని పరిశీలించారు. ఆధారాలు సేకరించారు. ఎస్ఐఅప్పారావు దర్యాప్తు చేస్తున్నారు.



చోరులు తాళం విరిచి తెరిచిన బీరువా లాకర్

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

● స్నేహితురాలి ఇంట్లో ఆత్మహత్య? ● స్నేహితురాలే హతమార్చిందంటూ మృతురాలు కుటుంబ సభ్యుల ఆరోపణ



మృతదేహం



సరస్వతి (ఫైల్)



పోలీసుల అదుపులో ఉన్న లక్ష్మి



మృతురాలి కుటుంబీలను విచారిస్తున్న పోలీసులు

వేపగుంట : నాయుడుతోట బంటా కాలనీకి చెందిన వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతిపై పలు అనుమానాలు వినిపిస్తున్నాయి.

కొన్నేళ్ల కిందట తానవరపు సరస్వతి (27)కు భర్తతో విభేదాలు రావడంతో అతడితో వేరు పడి తన ఏడేళ్ల కుమారుడు, తల్లిదండ్రులతో కలిసి బంటాకాలనీలో నివసిస్తున్నది. గోపాలపట్నంలోని ఒక దుకాణంలో పని చేస్తున్నది. ఆమె మంగళవారం ఉదయం విధులకు వెళతానని ఇంట్లో చెప్పి సింహాచలం ఆర్టీసీ డిపో సింహాద్రినగర్ వద్ద ఉన్న ఎస్.లక్ష్మి అనే స్నేహితురాలి వద్దకు వెళ్లింది. ఇద్దరూ మాట్లాడుకొన్న అనంతరం సరస్వతి వేరే గదిలో పడుకుంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చూడగా నిద్రపోయిన గదిలో సరస్వతి ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే లక్ష్మి తమ కింద ఇంట్లో ఉంటున్న వ్యక్తి సహాయంతో సరస్వతిని కిందకు దించి గోపాలపట్నం ఎస్ఆర్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె చనిపోయినట్టు వైద్యులు తెలిపారు.


ఈ విషయం తెలుసుకున్న బంటాకాలనీ వాసులు అధిక సంఖ్యలో వచ్చి సరస్వతి మృతికి లక్ష్మియే కారణమని ఆగ్రహం వ్యక్తం చేసి ఆమెను తీవ్రంగా కొట్టారు. అంతలో గోపాలపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన మహిళనుప్రథమ చికిత్స చేయించారు. అనంతరం లక్ష్మిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సరస్వతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు గోపాలపట్నం క్రైం సీఐ కె.వైకుంఠరావు తెలిపారు.

మృతిపై పలు అనుమానాలు...

నాయుడుతోట బంటా కాలనీకి చెందిన సరస్వతి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా సరస్వతి కుటుంబసభ్యులు లక్ష్మిపైనే అనమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ల నుంచి లక్ష్మి రోజూ ఫోన్ చేసి ఇంటికి రమ్మనేదని, దుబాయ్‌లో ఉద్యోగం ఉంది అక్కడకు వస్తావా? అని అడిగేదని చెబుతున్నారు. ఈ విషయం తెలిసి 'మా అమ్మాయికి ఫోన్ చేయవద్దని అనేకసార్లు లక్ష్మికి చెప్పామని అంటున్నారు. అయినప్పటికీ లక్ష్మి ఫోన్ చేసేదని ఆరోపిస్తున్నారు. అలాగే సరస్వతి నోటి నుంచి నురగలు కక్కుకొని మృతి చెందడం, ఇద్దరూ ఒకే ఇంట్లో ఉండగా వేరే గదిలో సరస్వతి ఆత్మహత్య చేసుకుంటే తెలియకుండా ఎలా ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి



అక్కిరెడ్డిపాలెం : నాతయ్యపాలెం జంక్షన్‌లో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో తీవ్రంగా గాయపడిన అప్పల నర్సమ్మ (56) చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందింది. రోడ్డు దాటుతున్న దంపతులను లారీ ఢీకొనడంతో భర్త ఘటనా స్థలంలోనే మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పలనర్సమ్మ మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలముకుంది. కన్న పిల్లలను చూసేందుకు వచ్చి మృత్యువాత పడడంతో ఆ కుటుంబం తేరుకోలేకపోతున్నది.

విద్యార్థి మృతి కేసులో ముగ్గురు జువెనైల్‌కు తరలింపు

సీతంపేట : మధురానగర్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల కొట్లాట కారణంగా విద్యార్థి మృతి చెందిన కేసులో ముగ్గురిని జువెనైల్స్‌కు తరలించినట్టు ద్వారకా సీఐ రాంబాబు తెలిపారు. ఈ నెల 5వ తేదీన మధ్యాహ్నం ఎనిమిదో తరగతి విద్యార్థితో పాటు అతడి సోదరుడు, స్నేహితుడు కొట్టడంతో పదో తరగతి విద్యార్థి సిద్దాది చిన్నా తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. కొట్లాటలో తగిలిన దెబ్బ కారణంగానే చిన్నా మృతి చెందినట్టు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలడంతో దాడికి పాల్పడిన ముగ్గురిని జువెనైల్‌కు తరలించామని సీఐ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత చిన్నా మృతికి స్పష్టమైన కారణాలు తెలుస్తాయని సీఐ చెప్పారు.

బాలికపై మేనమామ అత్యాచారం

● గర్భవతి కావడంతో వెలుగులోకి వచ్చిన వైనం
● పోలీసులకు బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు

తాటిచెట్లపాలెం : సెలవుల్లో సరదాగా గడుపుదామని తాతయ్య ఇంటికి వెళ్లిన బాలిక (14)పై మేనమామ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఫలితంగా ఆమె గర్భవతి అయ్యింది. వివరాలిలా వున్నాయి.

కంచరపాలెం బర్మాక్యాంపు సమీపంలోని లాల్‌బహదూర్‌నగర్‌కు చెందిన బాలికను తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో శ్రీకాకుళం జిల్లా నౌపడ గ్రామంలో వున్న తాతయ్య ఇంటికి పంపించారు. అయితే ఆమెపై కామంతో కళ్లు మూసుకుపోయిన మేనమామ పరిశెట్టి కృష్ణ అలియాస్ శ్రీను (23) పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. వేసవి సెలవులు ముగిసిన తరువాత బాలిక తమ ఇంటికి వచ్చింది. ఇటీవల బాలిక ఆరోగ్యం బాగా లేకపోవడంతో తల్లిదండ్రులు ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా, గర్భవతి అని తేలింది. బాలికను తల్లిదండ్రులు నిలదీయగా జరిగిన విషయాన్ని చెప్పింది. అది విన్న తల్లిదండ్రులు జరిగిన అన్యాయంపై కంచరపాలెం పోలీసులకు మంగళవారం ఫిర్యాదుచేశారు. దీనిపై కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ బాధితురాలు నివాసం తమ పరిధిలో వున్నప్పటికీ శ్రీకాకుళం జిల్లాలోని నౌపడలో అత్యాచారం జరగడంతో కేసును అక్కడ పోలీస్ స్టేషన్‌కు బదలాయిస్తున్నామని తెలిపారు.

నకిలీ పత్రాలతో గృహోపకరణాల షోరూమ్‌లకు బురిడీ

● నకిలీ పత్రాలతో బ్యాంకు ఖాతా
● ఆయా షోరూమ్స్‌కు ఫైనాన్స్‌కు కట్టకుండా టోకరా



అరెస్టయిన నిందితుడు సురేష్

సీతంపేట : నకిలీ ధ్రువపత్రాలతో ఆధార్, పాన్‌కార్డు పొందిన వ్యక్తి వాటి ద్వారా బ్యాంకు ఖాతా తెరిచాడు. అనంతరం ఆ బ్యాంకు ఖాతా ద్వారా వివిధ ఎలక్ట్రానిక్ వస్తువులు పొంది ఆయా వస్తువులను పలువురి అమ్మి ఓ ఫైనాన్స్ సంస్థకు మోసగించాడు. దీనిపై సదరు సంస్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన నాలుగో పట్టణ పోలీసులు మోసానికి పాల్పడిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

హైదరాబాద్‌కు చెందిన సిర్రా సురేష్ తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి, వాటితో ఆధార్, పాన్ కార్డులను సొంతంగా రూపొందించుకున్నాడు. వాటి ఆధారంతో బ్యాంక్ ఖాతాలు తెరిచి చెక్కు పుస్తకాలను సంపాదించాడు. అనంతరం ఓ పెద్ద ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో గృహోకరణాలను తన బ్యాంకు ఖాతా ఆధారంగా ఫైనాన్స్‌కు తీసుకున్నాడు. ఇలా నకిలీ పత్రాలతో భీమవరం, విజయవాడ, గుంటూరు, అనంతపురం, విశాఖపట్నంలోని పలు దుకాణాల్లో రిఫ్రిజిరేటర్లు, ఏసీ యంత్రాలు, పెద్ద పెద్ద టీవీలు కొనుగోలు చేసి వాటిని విక్రయించేవాడు.

ఇదేవిధంగా తప్పుడు పత్రాలతో విశాఖలోని డైమండ్ పార్క్ వద్ద గల ఓ షోరూమ్‌లో పెద్ద టీవీని కొనుగోలు చేశాడు. అయితే ఆ పత్రాలను పరిశీలించిన సదరు షోరూమ్ సిబ్బంది సురేష్ అప్పటికే పలు శాఖల్లో ఇలా ఫైనాన్స్ తీసుకుని మోసగించినట్టు గుర్తించారు. వివిధ నగరాల్లో గల ఆ షోరూమ్‌కు చెందిన శాఖల్లోనే సుమారు రూ.ఐదు లక్షల వస్తువులు కొనుగోలు చేసి డబ్బులు కట్టకుండా తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తి అతడేనని నిర్ధారించుకున్నారు.

దీంతో షోరూమ్‌కు చెందిన డీఎం పవన్‌కుమార్ నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎర్రాజీ కేసు నమోదు చేశారు. దీంతో నరేష్‌ను పట్టుకున్నారు. నిందితుడి నుంచి విలువైన కొత్త పెద్ద టీవీని స్వాధీనం చేసుకున్నారు. సురేష్‌ను అరెస్టు చేశారు.

చకచకా సింహగిరి అభివృద్ధి

భక్తుల తాకిడి దృష్ట్యా ముందస్తు ప్రణాళికలతో సాగుతున్న పనులు • వివిధ దశల్లో నిర్మాణాలు • పర్యవేక్షిస్తున్న దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్

సింహాచలం, ఆగస్టు 8:

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం సింహాద్రి అప్పన్న స్వామి దర్శనానికి ఇటీవల కాలంలో భక్తుల తాకిడి అనూహ్యంగా పెరిగింది. భక్తులకు ఆలయ పరిధిలోని వసతులు చాలకపోవడంతో దీర్ఘకాలిక, శాశ్వత ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపట్టాలని దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మంత్రి పి.అశోక్‌గజపతిరాజు మార్గనిర్దేశకత్వంలో ఈవో కె.రామచంద్రమోహన్ పర్యవేక్షణలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ పనులు చకచకా సాగుతున్నాయి. నృసింహవనం ఏర్పాటు, పాకశాల తొలిదశ భవనం, వాటర్‌షెడ్ పనులు, సోలార్ పవర్ ప్రాజెక్టు, రెండో ఘాట్ రోడ్డు తదితర అభివృద్ధి పనులను ఇప్పటికే సుమారు రూ.15 కోట్ల వ్యయంతో పూర్తి చేశారు.


రెండో ఘాట్ రోడ్డు..

సింహగిరి చుట్టూ ఉన్న సర్వే నంబర్-275లోని కొండవాలు ప్రాంతంలోని భూమిని పరిరక్షించేందుకు సుమారు రూ.10.8 కోట్లతో దశలవారీగా సిమెంట్ గోడ నిర్మాణం చేపట్టి ఇప్పటికే సుమారు 50 శాతం మేర పూర్తి చేశారు. దేవస్థానం స్థలానికి ప్రత్యామ్నాయంగా మధురవాడలోని సర్వే నంబర్-420లో ప్రభుత్వం కేటాయించిన సుమారు వందెకరాల స్థలం చుట్టూ రక్షణ గోడ నిర్మాణాన్ని చేపడుతున్నారు. అలాగే భవిష్యత్తులో భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మరికొన్ని అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇందులో పురాతన తొలిపావంచా పునర్నిర్మాణం కూడా ఒకటి. బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్‌లో భాగంగా ప్రస్తుతం ఉన్న తొలిపావంచా తొలగిపోనున్నది. అందుకు ప్రత్యామ్నాయంగా సుమారు రూ.61 లక్షలతో తమిళనాడుకు చెందిన శిల్పకళా నైపుణ్యం కలిగిన కళాకారుల ఆధ్వర్యంలో మెట్ల మార్గాన్ని ఆనుకుని నూతనంగా పూర్తిగా నల్ల గ్రానైట్ రాయితో తొలపావంచా మండప నిర్మాణపు పనులు జరుగుతున్నాయి. మరో మూడు, నాలుగు నెలల్లో ఈ పనులు పూర్తికావచ్చని అధికారులు భావిస్తున్నారు.


ఫిల్లర్ల దశలో డార్మెటరీ, షాపింగ్ కాంప్లెక్స్ పనులు..

రూ.45 లక్షలతో మాడవీధుల రోడ్ల నిర్మాణం

సింహాద్రినాథుని ఆలయ వెనుక తూర్పు, దక్షిణ దిక్కులలో మాడవీధుల రోడ్లను రూ.45 లక్షలుతో నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో ప్రతి పౌర్ణమికి స్వామివారి దేవాలయ ప్రదక్షిణలను మాడవీధులలో చేపట్టాలని అధికారులు యోచిస్తున్నారు.

అనుమతుల కోసం చూస్తున్నాం : ఈవో



సుమారు రూ.తొమ్మిది కోట్ల అంచనా వ్యయంతో నిర్మించదలచిన మరికొన్ని అభివృద్ధి పనులకు దేవాదాయశాఖ రాష్ట్ర కమిషనర్ నుంచి అనుమతులు రావాల్సి ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. అశోక్‌గజపతిరాజు సూచనల మేరకు మెట్ల మార్గాన్ని రూ.ఎనిమిది కోట్ల వ్యయంతో వెడల్పు చేసి పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించి ప్రతిపాదనలను కమిషనర్‌కు పంపామన్నారు. అలాగే కొత్తగా నిర్మించిన రెండో ఘాట్‌రోడ్డులో రూ.22.5 లక్షలతో విద్యుద్దీకరణ పనులు, రూ.47 లక్షలతో ఘాట్‌రోడ్డు ముఖద్వారం నిర్మాణ ప్రతిపాదనలకు కమిషనర్ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులను ప్రారంభిస్తామన్నారు.



1.48 కోట్ల రూపాయలతో క్యూ కాంప్లెక్స్ నిర్మాణం

సింహగిరిపై తూర్పు దిక్కున లోవతోటలో కేశఖండనశాల వెనుక భాగాన ప్రశాంతమైన వాతావరణం నడుమ రూ.1.48 కోట్లతో క్యూ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టారు. ఇది నవంబర్‌కల్లా పూర్తి కాగలదని ఇంజనీరింగ్ అధికారుల అంచనా. అలాగే మెట్లమార్గంలో చాకిధార వద్ద రూ.25 లక్షలతో మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా నీటిని పచ్చదనం పెంపునకు వినియోగించేందుకు ప్రణాళికాబద్ధంగా అధికారులు కృషి చేస్తున్నారు.

రూ.8 కోట్లతో కల్యాణ మండపాలు..

కొండ దిగువన సుమారు రూ.ఎనిమిది కోట్లతో కొండ దిగువ చిత్రాడవారి మామిడితోటలో నాలుగు కల్యాణ మండపాల నిర్మాణ పనులు ప్రస్తుతం పునాదుల దశలో ఉన్నాయి. రెండేళ్లలో వీటి నిర్మాణం పూర్తి చేసి సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో అద్దెకివ్వాలని అశోక్‌గజపతిరాజు ఆదేశించారు. ఇటు కొండదిగువ ఆర్టీసి కాంప్లెక్స్ సమీపంలో బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకుని రూ.5.25 కోట్లతో డార్మెటరీ, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టారు. డార్మెటరీలో భక్తులు తమ లగేజీలను భద్రపరచుకునేందుకు లాకర్లు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు టాయ్‌లెట్లు, బాత్‌రూమ్‌లు నిర్మిస్తున్నారు. దిగువ ఫ్లోర్‌లో దుకాణాల సముదాయాన్ని 18 నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు చేపడుతున్నారు. ఇదిలావుండగా సింహగిరి బస్టాండ్‌లో మెట్ల మార్గాన్ని ఉన్న పాత టాయ్‌లెట్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వాటి స్థానంలో రూ.20 లక్షలతో ఇటీవలే సులాభ్ కాంప్లెక్ నిర్మాణ పనులను ప్రారంభించారు.

రూ.రెండు కోట్లతో క్యాంటీన్ నిర్మాణం

భక్తులకు ఎప్పటి నుంచో కొరతగా ఉన్న భోజన, ఫలహారశాల నిర్మాణాన్ని సుమారు రూ.రెండు కోట్లతో చేపట్టారు. సింహగిరిపై బస్టాండ్‌కు సమీపంలో భక్తులందరికీ అందుబాటులో చేపట్టిన ఈ క్యాంటీన్ నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇది పూర్తయితే భక్తులకు ఇప్పటివరకు ఉన్న అన్నప్రసాదం సౌకర్యంతోపాటు రుచి, శుచి గల ఫలహార, భోజనాలు అందుబాటులోకి వస్తాయి.


క్యాంటీన్ నిర్మాణ పనుల్లో కార్మికులు

నేడు అరకులో ఆదివాసీ దినోత్సవం

హాజరు కానున్న గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబు నాయుడు

ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

అలరించనున్న గిరిజన సంప్రదాయ నృత్యాలు

విశాఖపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):

అరకులోయ ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు వివిధ శాఖలు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశాయి. గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. వీరికి భారీ స్వాగతం పలికేందుకు నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ సృజన, తదితరులు ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాష్ట్రంలో ఆరు ఐటీడీఏల పరిధిలోని గిరిజన కళాకారులు హాజరై సంప్రదాయ నృత్యాలతో అలరించనున్నారు.

గవర్నర్, సీఎం రాక... పోక

గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం ఉదయం 8.50 గంటలకు గన్నవరం నుంచి విమానంలో బయలుదేరి 9.40 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 9.45 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు అరుకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుంటారు. 10.35 గంటలకు అక్కడ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 10.50 గంటలకు ఎన్టీఆర్ స్టేడియంకు చేరుకుంటారు. 11 గంటల నుంచి ఒంటిగంట వరకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొంటారు. బహిరంగ సభలో మాట్లాడతారు. గిరిజనులతో ముచ్చటిస్తారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఒంటిగంటకు రోడ్డు మార్గంలో బయలుదేరి 1.15 గంటలకు డిగ్రీకళాశాల మైదానానికి చేరుకుంటారు. 1.30 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి 2.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 2.45 గంటల వరకు వీఐపీ లాంచ్‌లో విశ్రాంతి తీసుకొంటారు. మూడు గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి 3.40 గంటలకు గన్నవరం చేరుకుంటారు.

గుడ్లు పెట్టిన ఉప్పునీటి మొసళ్లు!

ఆరిలోవ, ఆగస్టు 8:



ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో రెండు ఉప్పునీటి మొసళ్లు గుడ్లు పెట్టి పొదుగుతున్నాయి. ఒక్కో మొసలి సుమారు వంద వరకు గుడ్లు పెట్టింది. ప్రస్తుతం జూలో ఐదు మొసళ్లు వుండగా, వీటిలో మూడు ఆడవి. పదేళ్ల క్రితం ఇదే జంతుప్రదర్శనశాలలో ఒక ఉప్పునీటి మొసలి 22 పిల్లలకు జన్మనిచ్చింది. వాటిని ప్రత్యేక మోటులలో పెంచి, అనంతరం శ్రీశైలం డ్యామ్‌లో విడిచి పెట్టారు. ఆ తరువాత మళ్లీ ఇప్పుడే గుడ్లు పెట్టాయి. ఈ నెలాఖరు నాటికి పిల్లలు బయటకు వచ్చే అవకాశం వుందని భావిస్తున్నారు. మొసళ్లు గుడ్లు పెట్టడానికి ముందు అనువైన చోటు ఎన్నుకొని చిన్నపాటి గొయ్యి ఏర్పాటు చేసుకుంటాయి. ఆ తరువాత గడ్డిని సేకరించి దానిని నోటితో చిన్నచిన్న ముక్కలు చేసి వాటిపై గుడ్లను పెడతాయి. ఆ గుడ్లను శత్రువుల బారిన పడకుండా 24 గంటలు కాపలా కాస్తుంది. 60 రోజుల అనంతరం పిల్లలు బయటకు వస్తాయి. పుట్టిన పిల్లలు సుమారు పది అంగుళాల వరకు వుంటాయి. వీటి శరీరం ఆలీవ్ గ్రీన్ రంగు ఆకారంలో వుంటుంది.

వర్ణమాల అక్షరాల దిశలు తెలిస్తే జవాబు సులువే..!

అనాలజీ (పోలిక పరీక్ష)

మోడల్ - 1

1. **ఖురాన్: మహ్మదీయులు:: జెండ్ అవస్థా: -----**
ఎ) జొరాస్ట్రియన్ బి) షింటో సి) అజీవక డి) పారశీక
సమాధానం: ఎ
వివరణ: మహ్మదీయుల పవిత్ర గ్రంథం ఖురాన్. అలాగే జొరాష్ట్రియన్ల పవిత్ర గ్రంథం జెండ్ అవస్థా

2. **నవంబరు 14 : బాలల దినోత్సవం :: జూన్ 5 : -------**
ఎ) యువజన దినోత్సవం
బి) పర్యావరణ దినోత్సవం
సి) ఆహార దినోత్సవం డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: నవంబరు 14 బాలల దినోత్సవం. అలాగే జూన్ 5 పర్యావరణ దినోత్సవం

3. **శాకాహారి: ఆవు :: మాంసాహారి: ---------**
ఎ) జింక బి) మేక సి) గొర్రె డి) సింహం
సమాధానం: డి
వివరణ: ఆవు శాకాహారి. అలాగే ఇచ్చిన ఐచ్ఛికాల్లో సింహం మాంసాహారి

4. **రక్తం: ఎరుపు :: బొగ్గు : -----------**
ఎ) పసుపు బి) ఆకుపచ్చ సి) నలుపు డి) గులాబి
సమాధానం: సి
వివరణ: రక్తం ఎరుపు రంగులో ఉంటుంది. బొగ్గు నలుపు రంగులో ఉంటుంది

5. **ఉదయం: సాయంత్రం :: రాత్రి : -----**
ఎ) పగలు బి) సాయంత్రం
సి) మధ్యాహ్నం డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: ఉదయానికి వ్యతిరేకం సాయంత్రం, అలాగే రాత్రికి వ్యతిరేకం పగలు

6. **గడియారం: సమయం :: థర్మామీటర్ : -------**
ఎ) ఉష్ణం బి) ఉష్ణోగ్రత సి) శక్తి డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: సమయాన్ని తెలిపేది గడియారం, ఉష్ణోగ్రతను తెలిపేది థర్మామీటర్

7. **సిక్కిం: గాంగ్‌టక్ :: మణిపూర్ : ------**
ఎ) డిస్పూర్ బి) షిల్లాంగ్ సి) ఇంఫాల్ డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: సిక్కిం రాష్ట్ర రాజధాని గాంగ్‌టక్. అలాగే మణిపూర్ రాజధాని ఇంఫాల్

8. **క్యాలెండర్ : తేదీలు :: నిఘంటువులు : ------**
ఎ) భాష బి) వాక్యాలు సి) పదాలు డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: క్యాలెండర్‌లో తేదీలు ఉంటాయి. అలాగే నిఘంటువులో పదాలు ఉంటాయి

9. **కిలోగ్రాం : క్వింటాల్ :: పైసా : ------**
ఎ) రూపాయి బి) నాణెం సి) సంపద డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: వంద కిలోగ్రామ్‌లు ఒక క్వింటాల్. అలాగే వంద పైసలు అంటే ఒక రూపాయి.

10. **సముద్రగుప్తుడు: ఇండియన్ నెపోలియన్ :: కాళిదాసు : ------**
ఎ) ఇండియన్ ఐన్‌స్టీన్
బి) ఇండియన్ మాఖియ వెల్లి
సి) ఇండియన్ షేక్‌స్పియర్ డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: సముద్ర గుప్తుని బిరుదు ఇండియన్ నెపోలియన్ అలాగే కాళిదాసు బిరుదు ఇండియన్ షేక్‌స్పియర్

11. **నిరక్షరాస్యత : విద్య :: వరద : -------**
ఎ) వంతెన బి) సముద్రం సి) ఆనకట్ట డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: నిరక్షరాస్యత తొలగాలంటే విద్యావంతులు కావాలి. అదేవిధంగా వరదల నుంచి రక్షణకై ఆనకట్టలు నిర్మించాలి.

12. **ప్రోటీన్స్: పెరుగుదల:: కార్బోహైడ్రేట్స్: ------**
ఎ) శక్తి బి) బలం సి) వ్యాధి డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: పెరుగుదలకు ప్రోటీన్స్, తక్షణ శక్తికి కార్బోహైడ్రేట్స్ ఉపయోగపడతాయి.



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 2

వర్ణమాల అక్షరాలతో పోలిక పరీక్ష

- ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో వర్ణమాల అక్షరాల సమూహాన్ని ఇచ్చి దానిని ఒక క్రమ పద్ధతిలో కొత్త అక్షరాలుగా మారుస్తారు. అంతేకాక మరో వర్ణమాల అక్షరాల సమూహాన్ని ఇస్తారు. అభ్యర్థి మొదటి వర్ణమాల అక్షరాల సమూహం ఏ పద్ధతిలో మార్చారో పరిశీలించి ఇచ్చిన మరో వర్ణమాల అక్షరాల సమూహాన్ని అదే పద్ధతిలో మార్చి రాయాలి.
- ఈ మోడల్‌కు సంబంధించిన ప్రశ్నలకు త్వరగా సమాధానం గుర్తించాలంటే వర్ణమాల అక్షరాల సవ్యదిశ, అపసవ్యదిశ సంఖ్యలు తెలిసి ఉండటం చాలా అవసరం.

సవ్యదిశ వర్ణమాల - సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
A	B	C	D	E	F	G	H	I	J	K	L	M	N
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
O	P	Q	R	S	T	U	V	W	X	Y	Z		

అపసవ్యదిశ వర్ణమాల - సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
Z	Y	X	W	V	U	T	S	R	Q	P	O	N	M
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
L	K	J	I	H	G	F	E	D	C	B	A		

1. **ADG: CFI :: MPS: ----------**
ఎ) PRU బి) OSU సి) ORU డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: ఈ ప్రశ్నలో అక్షరాలు +2 సిద్ధాంతాన్ని అనుసరించినవి. ADG ని CFI గా రాశారు.
అంటే A మొదటి అక్షరం C(A + 2 = C) మూడో అక్షరం
D నాలుగో అక్షరం, F ఆరో అక్షరం (D + 2 = F)
G ఏడో అక్షరం, I తొమ్మిదో అక్షరం (G + 2 = I)
అలాగే
M పదమూడో అక్షరం, O పదిహేనో అక్షరం (M + 2 = O)
P పదహారో అక్షరం, R పద్దెనిమిదో అక్షరం (P + 2 = R)
S పందొమ్మిదో అక్షరం, U ఇరవై ఒకటో అక్షరం(S + 2 = U)
కాబట్టి సమాధానం ORU అవుతుంది

2. **FDB: HFD :: NLJ : ------------**
ఎ) KLN బి) PNL సి) QNK డి) ఏదీకాదు
సమాధానం: బి

6	4	2		4	12	10
F	D	B		N	L	J
+2	+2	+2	అలాగే	+2	+2	+2
H	F	D		P	N	L
8	6	4		16	14	12

3. **FAME: JEQI :: LOVE: -------**
ఎ) PSZI బి) PRYK సి) PSXJ డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ:

6	1	13	5		12	15	22	5
F	A	M	E		L	O	V	E
+4	+4	+4	+4		+4	+4	+4	+4
J	E	Q	I		P	S	Z	I
10	5	17	9		16	19	26	9

4. **JOY: MQZ :: KNR : ----------**
ఎ) MMR బి)NPS సి) LMS డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ:

10	15	25	11	14	18
J	O	Y	K	N	R
+3	+2	+1	+3	+2	+1
M	Q	Z	N	P	S
13	17	26	14	16	19

5. **KIG : MMM :: MLK : ----------**
ఎ) QRP బి) PQR సి) OPQ డి) ఏదీకాదు
సమాధానం: సి

11	9	7	13	12	11
K	I	G	M	L	K
+2	+4	+6	+2	+4	+6
M	M	M	O	P	Q
13	13	13	15	16	17

6. **HEN : FCL :: IHG: ----------**
ఎ) GFE బి) EFG సి) FGE డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ:

8	5	14	9	8	7
H	E	N	I	H	G
-2	-2	-2	-2	-2	-2
F	C	L	G	F	E
6	3	12	7	6	5

7. **FENR: DILV :: SALT : ------------**
ఎ)PEJY బి) QFJY సి) QEJY డి) QEJX
సమాధానం: డి

6	5	14	18	19	1	12	20
-2	+4	-2	+4	-2	+4	-2	+4
D	I	L	V	Q	E	J	X
4	9	12	22	17	5	10	24

8. **TRK: QPJ :: NKF : ---------**
ఎ) KIE బి) KJF సి) JJE డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ:

20	18	11	14	11	6
T	R	K	N	K	F
-3	-2	-1	-3	-2	-1
Q	P	J	K	I	E
17	16	10	11	9	5

9. **BOLD: CQOH :: KITE : ----------**
ఎ) LWKJ బి) LKWI సి)KLXJ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ:

2	15	12	4	11	9	20	5
B	O	L	D	K	I	T	E
+1	+2	+3	+4	+1	+2	+3	+4
C	Q	O	H	L	K	W	I
3	17	15	8	12	11	23	9

10. **MNR: GJP :: KPT : ---------**
ఎ) ELR బి) EJP సి) DJP డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ:

13	14	18	11	16	20
M	N	R	K	P	T
-6	-4	-2	-6	-4	-2
G	J	P	E	L	R
7	10	16	5	12	18

11. **NF: SK :: GJ : ----------**
ఎ) NP బి) PQ సి) LO డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: N పద్నాలుగో అక్షరం, S పందొమ్మిదో అక్షరం (N + 5 = S)
F ఆరో అక్షరం, K పదకొండో అక్షరం (F + 5 = K)
G ఏడో అక్షరం, L పన్నెండో అక్షరం (G + 5 = L)
J పదో అక్షరం, O పదిహేనో అక్షరం (J + 5 = O)
కాబట్టి LO సమాధానం అవుతుంది

12. **RKNI : NHLH :: KIND : ---------**
ఎ) GFED బి) GFLC సి) JFEC డి) ఏదీకాదు
సమాధానం: బి

18	11	14	9	11	9	14	4
R	K	N	I	K	I	N	D
-4	-3	-2	-1	-4	-3	-2	-1
N	H	L	H	G	F	L	C
14	8	12	8	7	6	12	3

13. **NRKI : JUIJ :: TFNK : ---------**
ఎ) IUJJ బి) LIPL సి) PILL డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ:

14	18	11	9	20	6	14	11
N	R	K	I	T	F	N	K
-4	+3	-2	+1	-4	+3	-2	+1
J	U	I	J	P	I	L	L
10	21	9	10	16	9	12	12

JOBS ఉద్యోగాలు

యుఐఐసిఎల్

యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యుఐఐసిఎల్)- **అసిస్టెంట్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 696
అర్హత: జూన్ 30 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రాంతీయ భాషల్లో ప్రావీణ్యం ఉండాలి.
వయసు: 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి
వేతనం: నెలకు రూ.23,000
ఎంపిక: ప్రిలిమ్స్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్ ద్వారా
ప్రిలిమ్స్ టెస్ట్: సెప్టెంబరు 22న
మెయిన్ ఎగ్జామ్: అక్టోబరు 23న
దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 14 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 28
వెబ్‌సైట్: www.uiic.co.in

ఒఐసిఎల్

ఓరియంటల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఒఐసిఎల్)- **అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు:** 300
పోస్టులు - ఖాళీలు: అకౌంటెంట్స్ 20, యాక్చ్యురీస్ 2, జనరలిస్ట్లు 223, లీగల్ 30, ఆటోమొబైల్ ఇంజనీర్స్ 15, మెడికల్ ఆఫీసర్స్ 10.
వయసు: 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
రాత పరీక్ష: అక్టోబరు 22న
దరఖాస్తు ఫీజు: రూ.600
దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 18 నుంచి
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
వెబ్‌సైట్: www.orientalinsurance.org.in/Career.jsp


బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర - సెక్యూరిటీ ఆఫీసర్ (మేనేజర్) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది
ఖాళీలు: 13
అర్హత: డిగ్రీ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఆర్మీ/ నేవీ/ ఎయిర్‌ఫోర్స్/ పారా మిలిటరీ/ పోలీస్ విభాగాల్లో కనీసం అయిదేళ్ల అనుభవం + కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. **వయసు:** 25 - 40 ఏళ్ల మధ్య
వేతనం: రూ.31,705 నుంచి రూ.45,950 వరకు
ఎంపిక: షార్ట్ లిస్టింగ్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ప్రొబెషన్: రెండేళ్లు **దరఖాస్తు ఫీజు:** రూ.600
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 12 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 2
దరఖాస్తు హార్డుకాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 12
వెబ్‌సైట్: www.bankofmaharashtra.in

భారతదేశ మొట్టమొదటి గవర్నర్ జనరల్?

భారత రాజ్యాంగం- చట్టాలు

1. ఈస్టిండియా కంపెనీ స్థాపన?
   1) 1600 డిసెంబరు 28 2) 1600 డిసెంబరు 29
   3) 1600 డిసెంబరు 30 4) 1600 డిసెంబరు 31
2. కలెక్టర్ పదవిని ఎప్పుడు సృష్టించారు?
   1) 1770 2) 1771 3) 1772 4) 1773
3. మొట్టమొదటి గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్?
   1) వారన్ హేస్టింగ్స్ 2) రాబర్ట్ క్లైవ్
   3) మన్రో 4) ఎవరూ కాదు
4. బెంగాల్ గవర్నర్ పదవిని బెంగాల్ గవర్నర్ జనరల్‌గా మార్చిన చట్టం?
   1) మొదటి చార్టర్ చట్టం - 1793
   2) రెండో చార్టర్ చట్టం - 1813
   3) మూడో చార్టర్ చట్టం - 1883
   4) రెగ్యులేటింగ్ చట్టం - 1773
5. భారతదేశంలో మొట్టమొదటి మున్సిపల్ కార్పొరేషన్ 1687లో ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) మద్రాసు 2) కలకత్తా 3) బొంబాయి 4) ఏదీకాదు
6. భారతదేశ మొట్టమొదటి గవర్నర్ జనరల్?
   1) వారన్ హేస్టింగ్స్ 2) రాబర్ట్ క్లైవ్
   3) విలియం బెంటింక్ 4) లార్డ్ మెకాలే
7. భారతదేశంలో ఆధునిక సివిల్ సర్వీస్ పితామహుడు?
   1) నెహ్రూ
   2) సర్దార్ వల్లభాయ్ పటేల్
   3) సుభాష్ చంద్రబోస్
   4) ఎవరూకాదు



8. ఇండియన్ పీనల్ కోడ్‌ను ఎప్పుడు చట్టం చేశారు?
   1) 1858 2) 1859 3) 1860 4) 1861
9. ప్రస్తుత(21వ) లా కమిషన్ చైర్మన్?
   1) ఎం.సి.సెతల్వాడ్ 2) ఎ.పి.షా
   3) బల్బీర్‌సింగ్ చౌహాన్ 4) ఎవరూ కాదు
10. 'సతి'ని ఎప్పుడు రద్దు చేశారు?
   1) 1853 2) 1828 3) 1829 4) 1830
11. ప్రపంచంలో తొలిసారిగా పోటీ పరీక్షలు నిర్వహించిన దేశం?
   1) రష్యా 2) చైనా 3) భారత్ 4) బ్రిటన్
12. భారతదేశంలో సివిల్ సర్వీస్ పితామహుడు?
   1) విలియం బెంటింగ్ 2) లార్డ్ మెకాలే
   3) కారన్ వాలిస్ 4) లార్డ్ రిప్పన్
13. కలకత్తా, బొంబాయి, మద్రాసు విశ్వవిద్యాలయాలను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1856 2) 1857
   3) 1859 4) 1860
14. భారతదేశంలో న్యాయ వ్యవస్థ పితామహుడు?
   1) లార్డ్ మేకాలే 2) కారన్ వాలిస్
   3) విలియం బెంటింగ్
   4) లార్డ్ రిప్పన్
15. మొట్టమొదటి ఇండియన్ సివిల్ సర్వీస్ అధికారి?
   1) రవీంద్రనాథ్ ఠాగూర్
   2) సత్యేంద్రనాథ్ ఠాగూర్
   3) సుభాష్ చంద్రబోస్
   4) సురేంద్రనాథ్ బెనర్జీ
16. భారతదేశ మొట్టమొదటి వైశ్రాయి?
   1) లార్డ్ కానింగ్ 2) లార్డ్ మేయో
   3) లార్డ్ రిప్పన్ 4) ఎవరూ కాదు
17. భారతదేశ మొట్టమొదటి రాజ్య కార్యదర్శి?
   1) హంటర్ 2) చార్లెస్ ఉడ్స్
   3) లార్డ్ మెకాలే 4) ఎవరూ కాదు

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

18. 1833లో లా కమిషన్ చైర్మన్?
   1) లార్డ్ మేయో 2) లార్డ్ మెకాలే
   3) లార్డ్ విలియం బెంటింక్ 4) ఏదీకాదు
19. 1857 సిపాయిల తిరుగుబాటుకు ఆద్యుడు?
   1) మంగళ్‌పాండే 2) తాంతియా తోపే
   3) నానా సాహెబ్ 4) కున్వర్‌సింగ్
20. సిపాయిల తిరుగుబాటును జాతీయ తిరుగుబాటుగా అభివర్ణించింది?
   1) సయ్యద్ అహ్మద్‌ఖాన్ 2) వి.డి.సావర్కర్
   3) నెహ్రూ 4) ఎవరు కాదు
21. పోర్టుపోలియో విధానాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1857 2) 1858 3) 1859 4) 1862
22. కలకత్తా, బొంబాయి, మద్రాసు హైకోర్టులను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1859 2) 1860 3) 1861 4) 1862
23. ప్రస్తుతం భారతదేశంలో హైకోర్టుల సంఖ్య?
   1) 21 2) 22 3) 23 4) 24
24. రౌలత్ చట్టాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1909 2) 1917 3) 1918 4) 1919
25. బ్రిటిష్ పార్లమెంట్‌కు ఎన్నికైన తొలి భారతీయుడు?
   1) దాదాబాయి నౌరోజి



తాళ్లపెల్లి సదయ్య
రామప్ప అకాడమీ
హన్మకొండ

   2) సత్యేంద్ర ప్రసాద్ సిన్హా
   3) సత్యేంద్రనాథ్ ఠాగూర్ 4) ఎవరూ కాదు
26. భారతదేశంలో 'విభజించు - పాలించు' అనే విధానానికి బీజం వేసిన చట్టం?
   1) 1909 చట్టం 2) 1813 చట్టం
   3) 1853 చట్టం 4) 1833 చట్టం
27. మత నియోజకవర్గాల పితామహుడు?
   1) లార్డ్ మెకాలే 2) మార్లే
   3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
28. ముస్లింలీగ్ స్థాపన?
   1) 1905 2) 1906 3) 1907 4) 1908
29. సూరత్‌లో కాంగ్రెస్ చీలిక?
   1) 1906 2) 1907 3) 1908 4) 1909
30. మాంటెంగ్ ప్రకటన ఎప్పుడు వెలువడింది?
   1) 1917 ఆగస్టు 20 2) 1917 ఆగస్టు 21
   3) 1917 ఆగస్టు 23 4) 1917 ఆగస్టు 25
31. ద్వంద్వ పాలన పితామహుడు ఎవరు?
   1) కారన్ వాలిస్ 2) విలియం డ్యూక్
   3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
32. అలహాబాద్ హైకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?



   1) 1861 2) 1863 3) 1855 4) 1866
33. జలియన్‌వాలాబాగ్ దుర్ఘటన ఎప్పుడు జరిగింది?
   1) 1919 ఏప్రిల్ 13 2) 1919 ఏప్రిల్ 14
   3) 1919 ఏప్రిల్ 15 4) 1919 ఏప్రిల్ 16
34. ప్రభుత్వ ఖాతాల సంఘాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1919 2) 1920 3) 1921 4) 1922
35. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటును సూచించిన కమిటీ?
   1) లీ కమిటీ 2) హోలీ కమిటీ
   3) మాడ్డిమాన్ కమిటీ 4) ఏదీకాదు
36. నెహ్రూ నివేదికను ఎప్పుడు ప్రకటించారు?
   1) 1927 2) 1928 3) 1929 4) 1930
37. జిన్నా నివేదికను ఎప్పుడు ప్రకటించారు?
   1) 1927 2) 1928 3) 1929 4) 1930
38. కమ్యూనల్ అవార్డును ఎప్పుడు ప్రకటించారు?
   1) 1930 2) 1931 3) 1932 4) 1933
39. గాంధీ - అంబేద్కర్‌ల మధ్య పూనా ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
   1) 1930 2) 1931 3) 1932 4) 1933
40. భారత్ నుంచి బర్మాను ఎప్పుడు వేరు చేశారు?
   1) 1935 2) 1936 3) 1937 4) 1938
41. మౌంట్ బాటన్ ప్రణాళిక ఎప్పుడు వెలువడింది?
   1) 1947 జూన్ 3 2) 1947 జూన్ 4
   3) 1947 జూన్ 5 4) 1947 జూన్ 6
42. ఆర్‌బిఐని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1934 2) 1935 3) 1936 4) 1937
43. ఆర్‌బిఐకి తొలి భారతీయ గవర్నర్?
   1) ఎం.సి.సెతల్వాడ్ 2) సత్యేంద్రనాథ్ ఠాగూర్
   3) చింతామణి ద్వారాకానాథ్ దేశ్‌ముఖ్
   4) ఎవరూ కాదు
44. ప్రస్తుత(24వ) ఆర్‌బిఐ గవర్నర్ ఎవరు?
   1) ఉర్జిత్ పటేల్ 2) రంగరాజన్
   3) వై.వి.రెడ్డి 4) ఎవరూ కాదు
45. ఫెడరల్ కోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1935 2) 1936 3) 1937 4) 1938
46. భారతదేశంలో సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1950 జనవరి 26 2) 1950 జనవరి 27
   3) 1950 జనవరి 28 4) 1950 జనవరి 29
47. స్థానిక సంస్థల పితామహుడు ఎవరు?
   1) లార్డ్ మెకాలే 2) లార్డ్ రిప్పన్
   3) లార్డ్ మేయో 4) ఎవరూ కాదు
48. సాధారణ బడ్జెట్ నుంచి రైల్వే బడ్జెట్‌ను ఎప్పుడు వేరు చేశారు?
   1) 1920 2) 1921 3) 1922 4) 1923
49. కేంద్రంలో ద్విసభా విధానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
   1) 1919 2) 1909 3) 1935 4) 1947
50. రాష్ట్రాల్లో ద్విసభ విధానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
   1) 1909 2) 1919 3) 1935 4) 1947

సమాధానాలు

1) 4	9) 3	17) 2	25) 1	34) 3	43) 3
2) 3	10) 3	18) 2	26) 1	35) 1	44) 1
3) 1	11) 2	19) 1	27) 3	36) 2	45) 3
4) 4	12) 3	20) 3	28) 2	37) 3	46) 3
5) 1	13) 2	21) 3	29) 2	38) 3	47) 2
6) 3	14) 2	22) 4	30) 1	39) 3	48) 2
7) 2	15) 2	23) 4	31) 2	40) 3	49) 1
8) 3	16) 1	24) 4	32) 4	41) 1	50) 3
			33) 1	42) 2	

JOBS ఉద్యోగాలు

కెన్ ఫిన్ హోమ్స్

కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలోని కెన్ ఫిన్ హోమ్స్ లి. - క్లరికల్ కేడర్‌లో **ప్రొబెషనరీ అసిస్టెంట్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 30

బ్రాంచ్‌ల వారీ ఖాళీలు: బెంగళూరు 8, చెన్నై 4, హైదరాబాద్ 5, ముంబై 4, జైపూర్ 2, భోపాల్ 1, ఇండోర్ 1, ఢిల్లీ/ నొయిడా/ గ్రేటర్ నొయిడా 5

అర్హత: మే 1 నాటికి డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డేటా ఎంట్రీలో ప్రావీణ్యం + కంప్యూటర్ అప్లికేషన్స్ పరిజ్ఞానం + ప్రాంతీయ భాషల్లో నైపుణ్యం ఉండాలి.

వయసు: 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.

ప్రొబెషన్: ఏడాది

ఎంపిక: షార్ట్ లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు ఫీజు: రూ.100

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 14

వెబ్‌సైట్: www.canfinhomes.com/jobapplication.php, www.canfinhomes.com

ఇస్రో

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖా స్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 128

పోస్టులు - ఖాళీలు: లైట్ వెహికిల్ డ్రైవర్ ఎ 50, హెవీ వెహికిల్ డ్రైవర్ ఎ 76, స్టాఫ్ కార్ డ్రైవర్ 2

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 28

వెబ్‌సైట్: www.isro.gov.in

ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ

ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ - **అప్రెంటిస్‌ల** నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 24

డిగ్రీ అప్రెంటిస్‌లు: మెకానికల్ 3, మెటలర్జికల్ 2, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్ 2

డిప్లొమా అప్రెంటిస్‌లు: మెకానికల్ 3, మెటలర్జికల్ 3, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్ 2

టెక్నికల్ ఒకేషనల్ అప్రెంటిస్‌లు: మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ 3, ఆఫీస్ సెక్రటరీ/ స్టెనోగ్రఫీ 3, పర్చేజింగ్ & స్టోర్ కీపింగ్ 3

అర్హత: అభ్యర్థులు సంబంధిత విభాగంలో డిగ్రీ / డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.

ట్రైనింగ్: ఏడాది

స్టయిపెండ్: గ్రాడ్యుయేట్స్‌కు రూ.4984, డిప్లొమా అభ్యర్థులకు రూ.3542, టెక్నీషియన్స్‌కు రూ.2758 చెల్లిస్తారు.

ఎంపిక: అకడమిక్ మెరిట్, వైవా, మెడికల్ టెస్ట్

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 14

చిరునామా: General Manager/Grey Iron Foundry, Jabalpur - 482009

జెఎన్‌టిబిజిఆర్ఐ

జవహర్‌లాల్ నెహ్రూ బొటానికల్ గార్డెన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (జెఎన్‌టిబిజిఆర్ఐ)- తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

మొత్తం ఖాళీలు: 46

పోస్టులు - ఖాళీలు: జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో(బోటనీ 21, బయోటెక్నాలజీ/ బయో ఇన్ఫర్మాటిక్స్ 2, కెమిస్ట్రీ/ బయో కెమిస్ట్రీ/ అనలిటికల్ కెమిస్ట్రీ 4, మైక్రో బయాలజీ/ ఇంటిగ్రేటెడ్ బయాలజీ 2, జువాలజీ/ వైల్డ్ లైఫ్ బయాలజీ 1), ప్రాజెక్ట్ అసిస్టెంట్(బోటనీ/ అగ్రికల్చర్/ హార్టికల్చర్ 13), కంప్యూటర్ అసిస్టెంట్ (బోటనీ) 2, సిస్టం అడ్మినిస్ట్రేటర్ 1

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఫస్టుక్లాస్ మార్కులతో ఎమ్మెస్సీ/ బిఎస్సీ/ బిటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ అర్హత పొందినవారికి ప్రాధాన్యం ఉంటుంది.

స్టయిపెండ్: విభాగాన్ని అనుసరించి రూ.19000 నుంచి రూ.25000 వరకు ఇస్తారు.

వయసు: ఈ ఏడాది జనవరి 1 నాటికి 36 ఏళ్లు ఉండాలి.

ఇంటర్వ్యూ: ఆగస్టు 22, 23, 24న

వేదిక: JNTBGRI, Karmiancode, PO, Pacha Palode, Thiruvanthapuram 695562

వెబ్‌సైట్: www.jntbgri.res.in

ట్రాఫిక్‌కు చెక్



విద్యా సంస్థల ప్రతినిధులతో సమావేశమైన జీవీఎంసీ, ట్రాఫిక్ అధికారులు

(ఆంధ్రజ్యోతి-గాజువాక)

నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు సరికొత్త ప్రణాళికను రూపొందిస్తున్నారు. రద్దీ సమయాల్లో తలెత్తుతున్న ఇబ్బందులపై అధ్యయనం చేసిన ట్రాఫిక్ అధికారులు జీవీఎంసీ అధికారులతో కలిసి సంయుక్తంగా నివారణోపాయాలను కనుగొన్నారు. అందులో భాగంగా పాఠశాలలు, కళాశాలల సమయాల్లో మార్పునకు శ్రీకారం చుడుతున్నారు. మహా విశాఖలో పుట్టగొడుగుల్లా వున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. వారంతా తరగతులకు చేరుకునే సమయం దాదాపు ఒకటే కావడంతో జంక్షన్లు జామైపోతున్నాయి. ఈ సమస్య వల్ల ఇటు ఉద్యోగులకు, అటు ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యకు తెరదించడంలో అధికారులు సఫలం కాలేకపోయారు.

ఉదయం, సాయంత్రం వేళల్లో..

ఉదయం ఎనిమిది గంటల నుంచి తొమ్మిదిన్నర గంటల వరకు మళ్లీ సాయంత్రం నాలుగున్నర నుంచి ఆరు గంటల వరకు నగరంలోని అన్ని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ జామ్ అవుతోంది. విద్యా సంస్థలు అధికంగా వుండే ఎన్ఏడీ, గోపాలపట్నం, ద్వారకానగర్, ఎంవీపీ, మద్దిలపాలెం, శ్రీహరిపురం, ఆశీల్‌మెట్ట తదితర ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా వుంది. అనేక విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు ఆయా ప్రాంతాల్లో వున్నాయి. ఆయా సంస్థల వేళలు ఉదయం ఎనిమిది నుంచి ప్రారంభమవుతాయి. దీంతో వేలాది మంది అదే సమయంలో అక్కడకు చేరుకునేందుకు వస్తుండడంతో ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. ఉదయం ఎనిమిది నుంచి గంటన్నర పాటు ఆ ప్రభావం ట్రాఫిక్‌పై పడుతోంది. అలాగే సాయంత్రం వేళల్లో కళాశాలలు, స్కూళ్ల సమయం ముగియడంతో వేలాది మంది విద్యార్థులు రోడ్డెక్కుతుంటారు. దీంతో ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాలతో రద్దీగా మారిపోతున్నాయి. సాయంత్ర వేళలతో పోలిస్తే ఉదయం వేళ పరిస్థితి భయానకంగా వుంటున్నది. ఎందుకంటే..సాయంత్ర సమయాల్లో అదనపు తరగతులు నిర్వహించడం, విద్యార్థులంతా ఒకే సమయంలో బయటకు రాకపోవడం వల్ల కొంతమేరకు ఉపశమనం కలుగుతోంది. దీంతో ఉదయం వేళ ట్రాఫిక్ సమస్యకు చెక్ చెప్పాలంటే...విద్యా సంస్థల వేళల్లో మార్పులు చేయాలని అధికారులు ఒక అంచనాకు వచ్చారు.

భారీ వాహనాలకు నో పర్మిషన్

చైతన్యనగర్‌లో విద్యా సంస్థలకు వెళ్లే మార్గంలో భారీ వాహనాలను ఇకపై అనుమతించబోరు. కార్లు, బస్సులను సైతం దూరంగా నిలిపి వేసి అక్కడి నుంచి స్కూళ్లకు వెళ్లాలని అధికారులు సూచించారు. అలాగే కళాశాలల సిబ్బంది వీలైనంత వరకు కార్లను వినియోగించవద్దని కోరారు. ట్రాఫిక్ జామ్‌కు కారణమైన అన్ని అంశాలపైనా ఆంక్షలు పెడుతున్నారు.

గాజువాకలో శ్రీకారం

గాజువాక జోనల్ కమిషనర్ సోమన్నారాయణ, ట్రాఫిక్ సీఐ రమణ కలిసి విద్యా సంస్థల వేళలను సవరించడం వల్ల ట్రాఫిక్ సమస్యకు తెరదించవచ్చుననే అభిప్రాయానికి వచ్చారు. అందులో భాగంగా గాజువాకలో ఎక్కువ విద్యా సంస్థలు వున్న చైతన్యనగర్ ప్రాంతాన్ని ఎంచుకున్నారు. అలాగే ఎక్కువ మంది విద్యార్థులున్న విద్యా సంస్థల జాబితాను సిద్ధం చేశారు. ఆయా విద్యా సంస్థలకు వచ్చే వాహనాల వల్ల జాతీయ రహదారిలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభిస్తున్నట్టు గుర్తించారు. ఈ విషయంలో ట్రాఫిక్ పోలీసులు ముమ్మర కసరత్తు చేశారు. మొత్తం 17 విద్యాసంస్థల కారణంగా ట్రాఫిక్ సమస్య జఠిలం అవుతున్నట్టు గుర్తించి ఆయా విద్యా సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని గాజువాక జోనల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేశారు. జోనల్ కమిషనర్, ట్రాఫిక్ పోలీసులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు సమక్షంలో విద్యా సంస్థల ప్రతినిధులతో సుమారు రెండు గంటల పాటు చర్చించారు. ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు ప్రతి ఒక్క విద్యా సంస్థ సహకరించాలని కోరారు.

విద్యార్థులు, సంస్థల ఆధారంగా నిర్ణయం..

ఒకే వరుసలో వున్న విద్యా సంస్థలు, విద్యార్థులు అధికంగా వున్న విద్యా సంస్థల ఆధారంగా సమయాలను అధికారులు నిర్ణయించారు. ఉదయం ఎనిమిదిన్నర గంటలకు ప్రారంభమయ్యే విద్యా సంస్థల్లో కొన్నింటిని 7.45 గంటలకే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. రద్దీ అధికంగా వున్న రెండు విద్యా సంస్థలు ఒకే ప్రాంతంలో వుంటే వాటి మధ్య కనీసం అరగంట వ్యత్యాసం వుండేలా జాగ్రత్తలు పాటిస్తున్నారు. ఈ మేరకు ఆయా విద్యా సంస్థల సమయం, విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకున్నారు. గతంలో తొమ్మిది గంటలకే అన్ని విద్యా సంస్థల సమయం ముగిసేది. దాన్ని కాస్తా 9.30 గంటలకు పొడిగించారు. ఈ నిర్ణయం వల్ల ఒక విద్యా సంస్థ రద్దీ మరో విద్యా సంస్థ రద్దీ కలిసే అవకాశం లేకపోవడంతో ట్రాఫిక్ తగ్గుతుందని అధికారులు ప్రయోగం చేస్తున్నారు. వాస్తవానికి ఈ విధానాన్ని పాటించాలని రవాణా అధికారులు ఎంతో కాలంగా సూచిస్తున్నా..స్పందన కనిపించలేదు. ఈ పర్యాయం జీవీఎంసీ అధికారులతో కలిసి ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఈ విధానాన్ని ఈ నెల పదో తేదీ నుంచి అమలు చేయాలని ఆయా విద్యా సంస్థలకు సూచించారు.




ఒక ప్రయోగం చేస్తున్నాం..

గాజువాకలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఒక ప్రయోగం చేస్తున్నాం. అన్ని విద్యా సంస్థల సమయం ఒకటే కావడంతో నిత్యం జంక్షన్ జామవుతోంది. ఒక్కో విద్యా సంస్థ సమయాన్ని మార్పు చేసి ట్రాఫిక్ సమస్య తీర్చవచ్చని భావిస్తున్నాం. భారీ వాహనాలపైనా ఆంక్షలు విధిస్తున్నాం. జీవీఎంసీ పరంగా పార్కింగ్ స్థలాలకు కసరత్తు చేస్తున్నాం.

జోనల్ కమిషనర్, సోమన్నారాయణ

విద్యా సంస్థల సహకారంతో..



విద్యా సంస్థల సహకారంతో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టాలని అధ్యయనం చేశాం. ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్న యాజమాన్యాలకు అవగాహన కల్పించి వేళల్లో మార్పులు చేయాలని కోరాం. దానివల్ల ట్రాఫిక్ సాఫీగా సాగిపోతుంది. వేళలను ఉదయం అర్ధగంట ముందుకు జరిపాం. అలాగే మరో అరగంట సమయం పెంచాం. దీనివల్ల ఆశించిన ఫలితం లభిస్తుందని భావిస్తున్నాం.

రమణ, ట్రాఫిక్ సీఐ, గాజువాక

ముగ్గురికి ఎంపీడీఓలుగా పదోన్నతి

విశాఖపట్నం : జిల్లాలో ముగ్గురికి ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు జడ్పీ సీఈవో జయప్రకాశ్‌నారాయణ, జడ్పీ ఛైర్‌పర్సన్ లాలం భవాని నియామక ఉత్తర్వులు జారీచేశారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావును ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ అక్కడే నియమించారు. దేవరాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు ఎంపీడీవోగా పదోన్నతి కల్పి స్తూ అదే కార్యాలయంలో నియమించారు. విశాఖ జడ్పీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఉబ్బేటి మధుమోహన్‌ను పాడేరు ఎంపీడీవోగా నియమించారు. కణితి జడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామిరెడ్డికి పెదబయలు జడ్పీ హైస్కూల్ సీనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. పాములవాక హైస్కూల్‌లో పనిచేస్తున్న సత్యనారాయణరాజును ముంచంగిపుట్టు జడ్పీ హైస్కూల్‌కు, ఎ.కోడూరులో పనిచేస్తున్న శరత్‌బాబును జీకే వీధి జడ్పీ హైస్కూల్‌కు నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

టోల్‌గేట్ సిబ్బందితో వాహనదారుల వాగ్వాదం

ఎన్ఏడీ జంక్షన్: విమానాశ్రయం టోల్‌గేట్ సిబ్బందిపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసాలకు పాల్పడి డబ్బులు దోచుకుంటున్నా రంటూ ఆరోపించారు. తాను మంగళవారం వాహనంతో లోపలికి వెళ్లే సమ యంలో ఇచ్చిన స్లిప్‌పై సరైన టైమ్ వేయకుండా ముందుగా వచ్చినట్టు చూపించారని ఓ వాహనదారుడు వాపోయాడు. లోపలికి వెళ్లి కారు దిగిన తర్వాత ఈ విషయాన్ని గుర్తించానని చెప్పాడు. అనంతరం బయటకు వచ్చే సమయంలో సిబ్బందిని ప్రశ్నించడంతో వివాదం తలెత్తింది. ఆ తర్వాత లోపలకు వెళ్తున్న మరో వాహనానికి ఇచ్చిన స్లిప్‌ను పరిశీలించగా టైమ్‌లో తేడా ఉండడంతో సిబ్బందిని నిలదీశారు. టోల్ గేట్ సూపర్‌వైజర్ అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

సిటీ డైరీ

- ఉదయం 9:30 గంటలకు వైఎంసీఏ బీచ్‌రోడ్డులో జాలాది కాంస్య విగ్రహానికి పుష్పనివాళి
- ఉదయం 10 గంటలకు ఏయూ ఐఏఎస్‌సీలో హెచ్‌ఐవి వ్యాధిపై అవగాహనా సదస్సు
- ఉదయం 10 గంటలకు ఏయూ జర్నలిజం విభాగంలో గిరిజన తెగలు అభివృద్ధి అంశంపై సదస్సు
- ఉదయం 10:15 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చైనా వస్తువులు బహిష్కరించాలని మానవహారం
- ఉదయం 11 గంటలకు కేజిహెచ్‌లో గల ఆర్థోవార్డ్‌లో సెమినార్ హాల్ ప్రారంభం
- ఉదయం 11 గంటలకు ఏయూ సెనేట్ హాల్‌లో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు పుస్తకం ఆవిష్కరణ
- మధ్యాహ్నం 2 గంటలకు ఏయూ అసెంబ్లీ హాల్‌లో ప్రపంచ ఆదివాసి దినోత్సవం
- సాయంత్రం 5 గంటలకు ఏయూ మెయిన్ గేట్ వద్ద వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్ ధర్నా
- సాయంత్రం 5.30 గంటలకు విమాక్స్ థియేటర్ వద్ద ఎస్ఆర్ రంగనాథ్ జయంతి
- సాయంత్రం 6 గంటలకు పుడాచిల్డ్రన్ ఎరీనాలో డాక్టర్ జాలాది 86 వ జయంతి వేడుకలు

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సినీ, రాజకీయ, న్యాయ, ఉన్నత విద్యా రంగాల వారికి ఆర్థికంగా అనుకూలిస్తుంది. ప్రియతములకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ప్రయాణాలు, చర్చలు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బంధు, మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ప్రదర్శనలు, సభలకు అనుకూలం. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి గురించి ఆలోచిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

మిథునరాశి:(మే21-జూన్21): పెద్దలతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. వృత్తి, ఉద్యోగాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. పెట్టుబడులకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

సింహరాశి:(జూలై24-ఆగస్టు23): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. మ్యూచ్యువల్ ఫండ్స్, బ్యాంకు లావాదేవీలు లాభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలపై స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. ఆత్మావలోకనం చేసుకునేందుకు తగిన సమయం.

కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): సమావేశాలు, బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులతో అనుబంధం ఏర్పడుతుంది.భాగస్వామి గురించి ఆలోచిస్తారు. కొత్త పరిచయాలు లక్ష్య సాధనకు తోడ్పడతాయి.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆస్పత్రులు సందర్శిస్తారు. వైద్యం, హోటల్, రిటైల్ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఆహార నియమాలు పాటిస్తారు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ప్రముఖులతో వేడుకల్లో పాల్గొంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక విషయాల్లో సంకల్పం నెరవేరుతుంది. చిట్‌ఫండ్‌లు, డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బంధుమిత్రుల కలయికతో ఇంట్లో సందడిగా ఉంటుంది. ఇంటికి అవసరమైన వస్తువుల రవాణాకు అనుకూలం. బదిలీల విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యం సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిరకాల మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. సన్నిహితుల స్టేషనరీ, రవాణా, బోధన, ఏజెన్సీ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వామ్యాలు లాభిస్తాయి. స్నేహ పరిచయాల ఆధారంగా ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల కోసం విలువైన వస్తువుల కొనుగోలు చేస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): విందు, వినోదాలతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ సంస్థలు, పరిశ్రమలు, వైద్య రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. కొత్త ప్రాజెక్టులు ప్రారంభానికి అనుకూల సమయం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

పదాలు కనుక్కోండి

S	U	N	F	Z	H	P	A	S
V	A	C	A	T	I	O	N	W
S	W	O	M	F	H	O	T	I
U	T	F	I	A	Q	L	L	M
M	J	U	L	J	U	N	E	M
M	U	N	Y	A	R	H	S	I
E	L	A	U	G	U	S	T	N
R	Y	M	B	E	A	C	H	G

family
summer
vacation

sun
hot
fun

beac
pool
swim

June
July
August

నవ్వుల్ నవ్వుల్

టింకు : అరేయ్ బిట్టూ! మా టామీ మీ ఇంటి కన్నా ఎక్కువ ఎత్తు ఎగరగలదు తెలుసా?

బిట్టు : అంత సీను లేదు రా! నేను నమ్మను.

టింకు : చూడు మా టామీ ఎగిరింది. మరి మీ ఇల్లు ఎగురుతుందా?

బిట్టు : !!!!!!!!!!!!





బుల్‌ఫైట్ తెలుసు. స్ట్రీట్ ఫైట్ తెలుసు. కానీ ఫుడ్‌ఫైట్ గురించి తెలుసా! వేల మంది ఒకచోట గుమికూడి రోడ్లపై టన్నుల కొద్దీ టొమాటోలు కుమ్మరించి వాటితో కొట్టుకోవడమే ఫుడ్‌ఫైట్. స్పెయిన్ దేశంలోని బ్యునెల్‌లో ఈ ఫుడ్‌ఫైట్ జరుగుతుంది. ప్రతి ఏడాది ఆగస్టు నెల చివరి బుధవారంలో జరిగే ఈ ఫుడ్‌ఫైట్‌ను చూడటానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వెళుతుంటారు.



అతి పెద్ద టొమాటో ఫైట్

బ్యునెల్....

స్పెయిన్‌లో చిన్న ఊరు. అక్కడి జనాభా తొమ్మిది వేలే. కానీ, ఆగస్టు నెల చివరి బుధవారం వచ్చిందంటే చాలు రోడ్లన్నీ జనమయం అవుతాయి. ఎక్కడ చూసినా టొమాటోలే కనిపిస్తాయి. 'వరల్డ్ బిగ్గెస్ట్ ఫుడ్‌ఫైట్'గా పిలిచే ఈ వేడుకను తిలకించడానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. 2013లో సుమారు 50 వేల మంది ఈ ఫైట్‌లో పాల్గొనడానికి వచ్చారట. అంత మంది పాల్గొనడం కష్టమని భావించిన నిర్వాహకులు లాటరీ సిస్టమ్‌ను పెట్టి 20 వేల మందిని ఎంపిక చేశారు. ఈ ఫుడ్‌ఫైట్‌కు ఉన్న క్రేజ్ అది.

ఎలా మొదలయింది?

ఈ టొమాటో ఫుడ్‌ఫైట్ సంప్రదాయంగా వస్తోంది. అయితే ఇది ఎలా మొదలయిందీ అనే విషయం కచ్చితంగా తెలియదు. రకరకాల కథనాలు చెబుతుంటారు. 1944-45లో మొదటి సారి ఫుడ్‌ఫైట్ జరిగింది. స్నేహితుల మధ్య ఆహారం కోసం జరిగిన పోరు అని చెబుతుంటారు. ప్రమాదవశాత్తు ఒక లారీ బోల్తా పడటం వల్ల మొదలయిందని అంటుంటారు. అన్నింటికన్నా ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్న కథనం ఏమిటంటే ఒక రోజు టౌన్‌లో ఉత్సవాలు జరుగుతున్న సమయంలో సిటీ కౌన్సిల్‌మెన్ పాలనపై అసంతృప్తితో ఉన్న ప్రజలు టొమాటోలతో దాడి చేశారట. ఫుడ్‌ఫైట్ ఎలా మొదలయినా దాన్ని బాగా ఎంజాయ్ చేయడంతో మరుసటి సంవత్సరం కూడా నిర్వహించారు. అలా అది ప్రతి ఏడాది జరుగుతూ వచ్చింది. అయితే ఫ్రాన్సిస్కో ఫ్రాంకో పాలన సమయంలో ఫుడ్‌ఫైట్‌కు ఎలాంటి సంప్రదాయ ప్రాముఖ్యత లేకపోవడంతో ఆ రోజు సెలవును రద్దు చేశారు. అయితే 1970లో ఆయన తరువాత మళ్లీ సెలవును పునరుద్ధరించారు. పట్టణాన్ని రక్షించే దేవతలైన ల్యూయిస్ బెర్ట్రాన్, మారె దిడ్యూ డేల్స్ గౌరవార్థం ఈ పండుగను నిర్వహిస్తున్నారు.




సందడే సందడి

ఉదయం 11 గంటలకు టౌన్ సెంటర్‌లోకి టొమాటోలతో ట్రక్కులన్నీ చేరుకుంటాయి. తరువాత రెండు అంతస్తుల పొడవున్న ఒక పొడవాటి కర్రకు గ్రీజును పూసి సెంటర్లో పాతుతారు. దాన్ని పైకి ఎక్కిన తరువాతే ఫుడ్‌ఫైట్ మొదలవుతుంది. ఫుడ్‌ఫైట్ ప్రారంభానికి సంకేతంగా నీటి ఫిరంగులను ప్రయోగిస్తారు. దాంతో పండుగ మొదలవుతుంది. వేల మంది టొమాటోలతో కొట్టుకోవడం మొదలుపెడతారు. సరిగ్గా ఒక గంట తరువాత ఫైట్ ముగుస్తుంది. అప్పుడు ఎవ్వరూ కూడా టొమాటోలు విసరడం చేయరు. వెంటనే టౌన్‌లోని వీధులన్నీ శుభ్రం చేసే కార్యక్రమం మొదలవుతుంది. పర్యాటకులు దగ్గరలో ఉన్న బ్యునెల్ నదిలో స్నానం చేస్తారు. మొత్తంగా ఫుడ్‌ఫైట్ మరచిపోలేని మధురానుభూతిని అందిస్తుంది.

ఈ ఫుడ్‌ఫైట్‌లో పాల్గొనే వారు కొన్ని రూల్స్ పాటించాలి. అవి...

- పదునైన వస్తువులు, బాటిల్స్ తీసుకెళ్లకూడదు.
- ఇతరుల టీషర్టులు చింపకూడదు.
- టొమాటోలు విసిరే ముందు తప్పకుండా చిదమాలి.
- టొమాటోలను తీసుకొచ్చిన లారీలకు దూరంగా ఉండాలి.

దారి కనుక్కోండి



ఇది నిజం !



థాయ్‌లాండ్‌లో షాపింగ్ చేసినపుడు, బిల్లింగ్ కౌంటర్‌లో మిమ్మల్ని చూసి షాప్ యజమాని 'హాహాహా' అంటే.. అపార్థం చేసుకోవద్దు. ఎందుకుంటే థాయ్‌లో 'హా' అంటే ఐదు అని అర్థం. హాహాహా అంటే 555.

రంగులు వేయండి



టంగ్‌ట్విస్టర్స్

1. I feel a feel a funny feel a funny feel feel I,If I feel a funny feel a funny feel feel I.
2. If a fella met a fella in a field of fitchesCan a fella tell a fella where a fella itches?
3. It's a nice night for a white rice fight.



సూక్తి

ఓడిపోతామనే భయంతో ప్రయత్నించకుండా ఉండటం కంటే ప్రయత్నించి ఓడిపోవడం మేలు.

మీకు తెలుసా?

- పాలను తోడుబెట్టి పెరుగు తయారు చేయడం, వెన్న సేకరించడం వంటి ప్రక్రియలు క్రీస్తు పూర్వం 5000 సంవత్సరాల నాటికే మానవులకు తెలుసు.
- ప్రాచీన కాలంలోనే భారతీయులు పాలతో రకరకాల వంటకాలను తయారు చేసేవారు.

తిరుమల సమాచారం



వసతి గదులు: రూ.500: అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.
రూ.100 : అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.
రూ.50: ఖాళీలు లేవు
శ్రీనివాసమ్: అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.
రూ.300 దర్శనం: ఆగస్టు 27 నుంచి నవంబర్ 30 వరకు ఉన్నాయి. (మధ్యలో సెప్టెంబర్ 5, 19, 27 తప్ప)
రూ.50 దర్శనం: ఖాళీలు లేవు.
ఆర్జిత సేవలు : డిసెంబర్ 7, 8 తేదీల్లో ఉన్నాయి.
టీటీడీ కల్యాణ మండపం: ఆగస్టు నెలలో 10, 14, 18, 19, 21, 22, 23, 24, 25, 26, 27, 28, 30, 31 ఖాళీ ఉంది.

-ఎంవీపీకాలనీ

సిటీ వెదర్

ఉష్ణోగ్రత	గరిష్ఠం	కనిష్ఠం
వాల్తేర్	33.2	27.2
విమానాశ్రయం	33.8	27.2

బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుందని పలుచోట్ల వర్షం పడే సూచనలున్నాయని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం తెలిపింది. వాల్తేర్‌లో గాలిలో తేమ మంగళవారం ఉదయం 7.30 గంటలకు 76, ఎయిర్‌పోర్టులో 76, సాయంత్రం ఐదు గంటలకు వాల్తేర్‌లో 80, ఎయిర్‌పోర్టులో 74 శాతంగా నమోదైంది.

నేటి నుంచి పెళ్లిసందడి

16 వరకు మంచి ముహూర్తాలు
కల్యాణ మండపాలకు ఫుల్ డిమాండ్
పురోహితులు బిజీబిజీ..



సింహాచలం, ఆగస్టు 8: శ్రావణమాసం దైవ కార్యక్రమాలకు ఎంత పవిత్రమైనదో... వివాహాది శుభకార్యాలకూ అంతే అనుకూలమైనది. రానున్నది భాద్రపదం శూన్య మాసం కావడం... శుభ ముహూర్తాలు లేకపోవడం... ఆశ్వయుజంలో అతితక్కువ సంఖ్యలో వివాహాలకు ముహూర్తాలు ఉండడం... కార్తీకంలో శుభ ముహూర్తాలు లేకపోవడంతో బుధవారం నుంచి పెళ్లిసందడి మొదలు కానున్నది. ఈ నెల 16 వరకు పన్నెండు శుభ ముహూర్తాలు పంచాంగంలో ఉండడం... వీటిలో ప్రధానంగా 11, 16 తేదీలలో ఒకేరోజు మూడేసి శుభ ముహూర్తాలు ఉన్నందున ఈ వారం రోజులూ భాజాభజంత్రీలు మోగుతాయని పురోహితులు చెబుతున్నారు.

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో పెళ్లిళ్లు చేసుకోవాలని పలువురు మొక్కుకోవడంతో పాటు సింహగిరిపై, కొండ దిగువన అనువైన వివాహ కల్యాణ వేదికలు ఉన్నందున రెండు నెలల ముందు నుంచే కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌ను వివాహ నిర్వాహకులు బుక్ చేసుకున్నారు. ఈ వారం రోజుల్లో అత్యధిక పెళ్లిళ్లు జరగనున్నందున కల్యాణ మండపాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అలాగే ఈ వారం మొత్తం మీద సింహాచలం గ్రామ పురోహితుల సంఘంలోని సుమారు 50 మంది పురోహితులు మొత్తం మీద ఐదారు వందల పెళ్లిళ్లు జరిపేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. విద్యుత్ అలంకరణ, షామియానా, వంట సామగ్రి, వధువు, వరుడు తరపు వారికి ప్రత్యేక గదులు వంటి వాటికి కలిపి ప్రత్యేక ప్యాకేజీగా సాధారణ, మధ్య, ఉన్నతి తరగతులుగా విభజించి కనీసం రూ.35 వేలు నుంచి రూ.లక్షా 20 వేల వరకు నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా మంగళవాయిద్యాలు, కేటరింగ్, ఫొటోలు, వీడియో చిత్రీకరణ తదితర వాటికి లక్షల్లో ఖర్చవుతుందని చెప్పవచ్చు. ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో ఆయా నిర్వాహకులకు మంచి డిమాండ్ ఏర్పడింది.

అమలుకు నోచుకోని హామీలు

సింహాచలంలో పెళ్లిళ్లు చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. సుమారు ఏడేళ్ల క్రితం వరకు సింహాచల దేవస్థానం పరిధిలో జరిగే పెళ్ళిళ్లకు దేవాస్థానం విచారణ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసినట్టు రశీదులను జారీ చేసేవారు. అయితే కొన్ని ప్రేమ పెళ్లిళ్లు పెటాకులు కావడంతో ఉత్పన్నమయ్యే సమస్యల కారణంగా దేవస్థానం సిబ్బంది సాక్షులుగా తరచూ కోర్టుల చుట్టూ తిరగాల్సి రావడంతో దేవస్థానం పరిధిలో పెళ్లిళ్లకు రశీదులివ్వడాన్ని నిషేధించారు. గతంలో రాష్ట్ర స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రులు కొందరు అప్పన్న దర్శనానికి వచ్చినప్పుడు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అన్నవరం, విజయవాడ వంటి ప్రధాన దేవాలయాల్లో మాదిరిగా సింహాచల దేవస్థానం పరిధిలో కూడా వివాహ రిజిస్ట్రేషన్ల కార్యాలయాన్ని నెలకొల్పుతామన్న హామీలు అమలుకు నోచుకోలేదు.

సీఎం చంద్రబాబుకు అండగా ఉంటాం

తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు వాసుపల్లి గణేశ్‌కుమార్
వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలను నిరసిస్తూ ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న వాసుపల్లి, ఇతర నేతలు, విద్యార్థులు

మహారాణిపేట, ఆగస్టు 8: రాష్ట్రం కోసం... పిల్లల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అండగా ఉంటామని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునుద్దేశించి నంద్యాల సభలో వైసీపీ అధినేత నేత జగన్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ వాసుపల్లి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, విద్యార్థులు మంగళవారం ప్రదర్శన చేపట్టారు. పార్టీ కార్యాలయం నుంచి సెవెన్‌హిల్స్ ఆస్పత్రి జంక్షన్‌లో వున్న ఎన్టీఆర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. చంద్రబాబు ముఖంతో కూడిన మాస్క్‌లను ధరించి విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వాసుపల్లి గణేశ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోనే మేటి ముఖ్యమంత్రిగా... సుదీర్ఘ అనుభవం గల చంద్రబాబునాయుడుపై జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ అనేక సంక్షేమ పథకాలను సీఎం అమలు చేస్తున్నారన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా, రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణాల మాఫీలతో పాటు బీసీ, కాపు, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా అనేక మందికి చేయూతనందిస్తున్న నేతపై జగన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తనను ఎంతగానో బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులందరికీ తమ ప్రభుత్వం పెన్షన్లు అందిస్తూ అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్రం బాగుపడకూడదని, ప్రజలు అధోగతి పాలవ్వాలని ప్రతిపక్ష నేత కోరుకుంటున్నాడని వాసుపల్లి గణేశ్‌కుమార్ ఆరోపించారు. సరిగ్గా మాట్లాడడం కూడా రాని జగన్మోహన్‌రెడ్డి ముఖమంత్రి పీఠం కోరుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లొడగల కృష్ణ, పాసర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

గాజువాక టౌన్: ఐటీఐలో చేరాలనుకునే ఉక్కు నిర్వాసితులు దరఖాస్తులను స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం నుంచి పొందాలని జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి ఆర్.సూర్యారావు తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను ప్రభుత్వ న్యూ ఐటీఐ ప్రాంగణంలో ఉన్న జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 11లోగా సమర్పించాలని తెలిపారు.

◆ పేరుకుపోయిన పూడిక తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎంవీపీ కాలనీ సెక్టార్-11 లోని డ్రైనేజీల నుంచి పూడిక తొలగించారు. జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది రెండు రోజుల పాటు ఈ పనిని పూర్తి చేశారు. డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోవడం వల్ల దుర్వాసన వెలువడుతోందని, దోమలు విపరీతంగా వృద్ధి చెంది స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని క్లిక్, పోస్ట్ శీర్షికన ఆంధ్రజ్యోతిలో వెలువడడంతో జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం సిబ్బంది స్పందించారు. వాటిని తొలగించారు. మురుగు నీరు ఎప్పటికప్పుడు దిగువకు పోయేవిధంగా చర్యలు తీసుకున్నారు. ఈసమస్యను వెలుగులోనికి తెచ్చిన ఆంధ్రజ్యోతి కి, వెంటనే స్పందించిన జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు

మండ హనుమంతరావు, ఎంవీపీకాలనీ

◆ సురక్షిత స్థలానికి ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎంవీపీ కాలనీ సెక్టార్- 11లో డ్రైనేజీ పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొద్ది దూరంలో ఉన్న సురక్షిత స్థలానికి తరలించారు. డ్రైనేజీ పక్కన రోడ్డుకు అభిముఖంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం వల్ల స్థానికులకు ప్రమాదకరంగానే కాకుండా ఇబ్బందికరంగా కూడా ఉంటోందని క్లిక్, పోస్ట్ శీర్షికన ఆంధ్రజ్యోతిలో వెలువడడంతో ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. చర్యలు తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కనే ఉన్న సురక్షిత స్థలంలోనికి మార్చారు. సమస్యను వెలుగులోనికి తెచ్చిన ఆంధ్రజ్యోతికి, వెంటనే స్పందించిన ఏపీఈపీడీసీఎల్ అధికారులకు కృతజ్ఞతలు

స్థానికులు ఎంవీకాలనీ



◆ వీధిదీపాలకు మరమ్మతు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాలాక్షినగర్ మెయిన్ రోడ్డులోని 448 ప్లాట్ నుంచి వరుసగా రెండు విద్యుత్ స్తంభాలకు ఉన్న వెలగని లైట్లను జీవీఎంసీ వీధిదీపాల నిర్వాహణా విభాగం సిబ్బంది బాగు చేశారు. ఇరవైరోజులుగా ఈ లైట్లు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్నారని క్లిక్ పోస్ట్ శీర్షికన వెలుగులోనికి రావడంతో జీవీఎంసీ అధికారులు స్పందించారు. వాటిని బాగు చేశారు. సమస్యను వెలుగులోనికి తెచ్చిన ఆంధ్రజ్యోతికి, వెంటనే స్పందించిన జీవీఎంసీ అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు

కేఎస్ రవి, విశాలాక్షినగర్

కనకమ్మ పండుగకు విస్తృత ఏర్పాట్లు

14న తొలేళ్ల ఉత్సవం
15న ప్రధాన పండుగ
22న మరువారం పండుగ



పండుగకు సిద్ధమవుతున్న అమ్మవారి ఆలయం

వెంకోజీపాలెం: పాతవెంకోజీపాలెం గ్రామం ఇలవేల్పు కనకమ్మ వారి పండుగ ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్నారు. ఈమేరుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు సీతారామసేవా సంఘం, శెట్టిబలిజ సేవా సంఘం, రాధాకృష్ణయాదవ సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. గొల్లవీధిలో ఉన్న ఆలయాన్ని ఇప్పటికే నూతన రంగులతో ముస్తాబు చేశారు. వీధివీధిన విద్యుత్ దీపాలను అలంకరించారు. అమ్మవారి ఉత్సవాన్ని గవర, శెట్టిబలిజ, యాదవ కులస్థులు కలిసి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 14న తొల్లేళ్ల ఉత్సవం, 15న అమ్మవారి పండుగ, 22న మారువారం ఉత్సవం, మహాఅన్నదానం నిర్వహించనున్నట్టు తెలిపారు.

పుట్టమన్ను సేకరణ

తొల్లేళ్ల ఉత్సవం సందర్భంగా 14న రాత్రి 9 గంటలకు సంఘాల సభ్యులు, పెద్దలు కలసి అమ్మవారి ఘటాన్ని వీధుల్లో ఊరేగిస్తారు. హెచ్‌బీకాలనీ హౌసింగ్ బోర్డు కార్యాలయం వద్ద చెట్టు నుంచి పుట్ట మన్ను సేకరించి ఊరేగిస్తారు. 15న ఉదయం మూడు సంఘాల అధ్యక్ష దంపతులు అమ్మవారికి తొలి పూజ నిర్వహిస్తారు. సాయంత్రం గొల్లవీధిలోని పెద్దింటమ్మ ఇంటి నుంచి అమ్మవారి ఘటాన్ని మూడు వీధులలో ఊరేగిస్తారు. భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా తగిన ఏర్పాట్లను చేస్తున్నట్టు రాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షులు పల్లా చిన్నారావు తెలిపారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రామ్‌నగర్: జీవీఎంసీ 19వ వార్డు రామ్ నగర్‌లోని బానోజీ నగర్ పితాని దిబ్బ తదితర ప్రాంతాల్లో రూ.97లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.11లక్షలతో సంతోషి మాత నగర్‌లో కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి, రూ.10 లక్షలతో డ్రైనేజీ మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. సుమారు 31లక్షల రూపాయలతో పితాని వీధిలో రోడ్లు కాలువలు నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. బానోజీ నగర్‌లో 45లక్షల రూపాయలతో పార్కు అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం తదితర పనులు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ

రుణాలకు లబ్ధిదారుల ఎంపిక

ఆరిలోవ: జీవీఎంసీ రెండో వార్డులోని జీవీఎంసీ కమ్యూనిటీ హాలు(కల్యాణ మండపం)లో 1, 2, 3 వార్డులకు సంబధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్టు జోన్ వన్ జోనల్ కమిషనర్ సత్యవేణి తెలిపారు. స్వయం ఉపాధి నిమిత్తం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు బుధవారం ఉదయం 10 గంటలకు ఆరిలోవలోని జీవీఎంసీ కమ్యూనిటీ హాలు వద్ద హాజరు కావాలని తెలిపారు. దరఖాస్తుదారులు తమ తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఈ ఎంపిక శిబిరంలో బ్యాంకు అధికారులు, వెల్ఫేర్ అధికారులు, జీవీ ఎంసీ అధికారులు హాజరవుతారన్నారు. స్క్రీనింగ్ కమిటీ సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషనకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు శిబిరానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు చినగదిలి విద్యార్థులు



కోచ్ ప్రశాంత్ కుమార్‌తో విద్యార్థులు

అక్కయ్యపాలెం: అనకాపల్లి రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరుగనున్న జాతీయ స్థాయి కరాటే పోటీలకు చినగదిలి రోజరి ఇంగ్లీష మీడియం స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.రామస్వామి, కోచ్ సీహెచ్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. వై.ఈశ్వర్, ఎస్.గోపాల సాయి కృష్ణ ప్రసాద్, పి.చిన్నమ్మడు, డి.గణేష్, పి.మధు, టి.కళ్యాణి, కె.రంజిత్‌కుమార్, పి.కిరణ్ కుమార్, కె.ప్రహర్ష ఈ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరంతా పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.



ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరించిన వీసీ

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

ఎంవీపీకాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని పలు శాఖలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పలువురిని మంగళవారం ఏయూ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉపకులపతి ఆచార్య జి నాగేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య వి ఉమామహేశ్వరరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జి రవికుమార్, కార్యదర్శి ఈ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మంగళవారం పూజలు

ఆరిలోవ: ఆరిలోవలోని అన్ని ప్రధాన దేవాలయాలలో శ్రావణ మంగళవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో వెలసిన లక్ష్మిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు. చినగదిలి రామలక్మణపురం నేతాజీనగర్‌లోని పోలమాంబ అమ్మ వారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పాతడైరీ ఫారం సమీపంలోని పైడిమాంబ ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు గోపిశర్మ సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. హనుమంతవాక జంక్షన్ సమీపంలోని విజయదుర్గా కాలనీలోని విజయ దుర్గాదేవి అలయంలో సామూహిక కుంకుమ పూజలను అర్చకులు సంపత్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం: జీవీఎంసీ జోన్-1 డివిజన్ ఆర్కేబీచ్ ఫీడర్ 11కేవీ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ పి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. వుడా చిల్డ్రన్స్ పార్కు ఏరియా, సీబీఎం కాంపౌండ్ ఏరియా, టైకూన్ ఏరియా, సంపత్ వినాయక గుడి రోడ్డు, వుడా ఉద్యోగభవన్, జేసీ బంగ్లా, ఆలిండియా రేడియో ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ఎండాడ పాఠశాలలో కుళ్లిపోయిన కోడిగుడ్లు

విశాఖపట్నం: ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఇచ్చే కోడిగుడ్లు మంగళవారం కుళ్లిపోయాయి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వారానికి మూడు రోజులపాటు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా పాఠశాలలకు కోడిగుడ్లను సరఫరా చేసేందుకు కొన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కోడిగుడ్లను సరఫరా చేస్తున్నారు. ఎండాడ ప్రభుత్వ పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారంలో మూడు రోజులపాటు అంటే 1,500 గుడ్లను ప్రభుత్వం నియమించిన ట్రేడర్ ఈనెల ఐదో తేదీన పాఠశాలకు అందించాడు. వారానికి మూడు రోజులంటే సోమవారం, బుధవారం, శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు ఉడకబెట్టిన కోడి గుడ్డు ఇవ్వాలి. సోమవారం రాఖీ పండగ సందర్భంగా కోడిగుడ్డు ఇవ్వలేదు. దాని బదులు మంగళవారం గుడ్లను అంగన్‌వాడీ కార్యకర్తలు ఉడకబెట్టగా అందులో చాలా గుడ్లు కుళ్లిపోయి దుర్వాసన రావడంతో విద్యార్థులకు ఇవ్వలేదు. దీనిపై ఎంఈవోకు ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు.





● చెత్తతో నిండిన డంపర్ బిన్

డైమండ్ పార్కు పక్కన ఉన్న డంపర్ బిన్ చెత్తాచెదారంతో నిండిపోయింది. దీన్ని డంపింగ్ యార్డుకు తరలించాలి. ఇక్కడ డస్ట్ బిన్ చెత్తతో నిండిపోవడం వల్ల స్థానికులు తమ ఇళ్ల నుంచి వచ్చిన చెత్త, వ్యర్థాలు దీని పక్కనే వేసేస్తున్నారు. డంపర్ బిన్‌లో వేసినా అవి కిందకు జారిపోతున్నాయి. రోజుల తరబడి ఇలా చెత్త నిల్వ ఉండి పోవడం వల్ల దాని నుంచి దుర్వాసన వెలువడుతున్నది. దోమలు విపరీతంగా వృద్ధి చెంది స్థానికులను బాధిస్తున్నాయి. జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

- శంకర్, దొండపర్తి

మరో దారి లేక..

- అధ్వానంగా ఆంథోని నగర్ రోడ్డు
- అడుగడుగునా గోతులు
- వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బందులు
- ప్రత్యామ్నాయం లేక రాకపోకలు


మహారాణిపేట: జీవీఎంసీ 20వ వార్డు ఆంథోని నగర్ రోడ్డు అధ్వానంగా తయారయింది. పూర్తిగా గోతులమయంగా ఉంది. ఈ గోతుల్లో పడి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం కురిసినప్పుడు ఆ గోతుల్లో నీరు చేరడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణిస్తే వెన్ను సంబంధిత వ్యాధులు రావడంతో పాటు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. జిల్లా పరిషత్, కలెక్టరేట్, కేజీహెచ్‌కి ఈ రోడ్డు గుండానే నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డులో రెండు పాఠశాలలు కూడా ఉండ డంతో స్కూల్ ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డులోని డ్రైనేజీ కూడా అధ్వానంగా ఉండడంతో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీంతో తీవ్ర దుర్వాసన వెలువడుతోంది. ఈ మురుగు నీరులోంచే పిల్లలు పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ రోడ్డును బాగు చేయడంతో పాటు డ్రైనేజీని ఆధునికీకరించాలని స్థానికులు కోరుతున్నారు.



గోతులమయంగా ఉన్న ఆంథోని నగర్ రోడ్డు



ఈ రోడ్డులో ప్రయాణం కష్టం



ఈ రోడ్డులో ప్రయాణించడం కష్టంగా ఉంది. కొన్నేళ్లుగా ఈ రోడ్డు ఇలా గోతులమయంగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించు కోవడం లేదు.

- సారిపల్లి అప్పలరాజు

వార్డులోని రోడ్లు అధ్వానం



20వ వార్డులోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడి రోడ్ల పరిస్థితిపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

- ఎన్.శ్రీనివాసరావు

కామ్రేడ్ సూర్యనారాయణకు ఘన నివాళి

జగదాంబ సెంటర్: సీపీఎంకు కామ్రేడ్ సూర్యనారాయణ విశిష్ట సేవలు అందించారని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నరసింగరావు అన్నారు. జగదాంబసెంటర్ ఎల్లమ్మతోట పరిధిలోని సీపీఎం కార్యాలయంలో ఎం.సూర్యనారాయణ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.లోకనాథం, బి.గంగారావు, వీవీ శ్రీనివాసరావు, చలపతి, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆదివాసీ ఉత్సవాల నిర్వహణ సబబు కాదు’

జగదాంబ సెంటర్: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఒక్క గిరిజనుడికీ అటవీ హక్కు పత్రాలు ఇవ్వకుండా ఆదివాసీ ఉత్సవాలు నిర్వహించడం సబబు కాదని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స విమర్శించారు. జగదాంబ సెంటర్ పరిధి ఎల్లమ్మతోటలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాక్సైట్ తవ్వకాలకు సంబంధించిన జీవో నంబర్ 97ను రద్దు చేయకుండా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పేరుతో గిరిజనుల్ని మభ్యపెట్టేందుకు చంద్రబాబు అరకు వస్తున్నారన్నారు. విశాఖ గిరిజన ప్రాంతాల్లో ఈ ఏడాది సుమారు 98 మంది గిరిజనులు మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో మృతి చెందారని, వారికి రూ.10 లక్షల నష్టపరిహారం, 50 కేజీల బియ్యం, 10 కేజీల కందిపప్పు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి టి.చిట్టిబాబు పాల్గొన్నారు.

నేడు రుణ దరఖాస్తుదారులతో బ్యాంకర్ల సమావేశం

జగదాంబ సెంటర్: రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార నిమిత్తం అందిస్తున్న సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారితో బ్యాంకర్లు బుధ, గురువారాల్లో సమావేశం కానున్నారు. దక్షిణ నియోజకవర్గానికి సంబంధించిన వారితో సమావేశం జరుగుతుందని జోన్- 3 ఏపీడీ నాగమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



మొక్క నాటుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అర్జున్

కేజీహెచ్‌లో పచ్చదనం పెంపు

మహారాణిపేట : రానున్న మూడేళ్లలో కేజీహెచ్, ఆంధ్ర వైద్య కళా శాలలు పచ్చదనంతో ఉండే విధంగా తీర్చిదిద్దుతామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.అర్జున్ తెలిపారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కేజీహెచ్‌లోని సూపర్ స్పెషాలిటీ విభాగం వద్ద వివిధ రకాల మొక్క లను నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



బస్ పాస్‌లు పంపిణీ చేస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత

విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌ల పంపిణీ

అల్లిపురం: ఉచిత బస్ పాస్‌లు ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని ఆర్టీసీ డిపో మేనేజరు (మద్దిలపాలెం) కవిత కొనియాడారు. కేఎన్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే ఉన్నత పాఠశాలలో చదువుతున్న 125 మంది విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో బస్ పాస్‌ల పంపిణీ కార్యక్రమం చేపడుతు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని హేమలత, ఆర్టీసీ సిబ్బంది, కేవీ గుప్తా, ఎన్ఎస్ఎన్ ప్రసాద్, వాసవీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాబూకాలనీలో తేరు ఊరేగింపు

జ్ఞానాపురం: దేవమాత మోక్షారోపణ ఉత్సవంలో భాగంగా మంగళవారం జ్ఞానాపురం బాబూకాలనీ, సెబాస్టియన్ కాలనీల్లో దేవమాత తేరును భక్తులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న మద్యం ఉద్యమం

జ్ఞానాపురం: జ్ఞానాపురంలోని మద్యం దుకాణాలను సుదూర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు చేపట్టిన ఉద్యమం మంగళవారం 49వ రోజుకు చేరింది.

క్రైస్తవుల శాంతి ర్యాలీ రేపు

జగదాంబ సెంటర్: దళిత క్రైస్తవులకు ఎస్సీ, ఎస్టీ హోదా కల్పించాలనే డిమాండ్‌తో గురువారం శాంతియుత ర్యాలీ చేపట్టనున్నట్టు క్రిస్టియన్ మైనార్టీ జాయింట్ యాక్టివ్ కమిటీ ప్రతినిధులు కొల్లాబత్తుల వెంగలరావు, అనిల్ పాల్ మోహన తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 67 ఏళ్ల క్రితం రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా దళిత క్రైస్తవులకు ఎస్సీ, ఎస్టీ హోదా కల్పించాలని విడుదల చేశారన్నారు. నేటికి అది అమలు కాలేదన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు గురువారం ఉదయం తొమ్మిది గంటలకు శాంతియుత ర్యాలీ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు లాల్, శామ్యూల్, అబెల్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇళ్ల పట్టాలతో పేదలకు భరోసా

- ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మాధవధార : స్థలంతో సహా ఇంటిని క్రమబద్ధీకరించి లబ్ధిదారులకు అధికారిక ధ్రువీకరణ పత్రం అందజేయడమే పట్టాల పంపిణీ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం ఇంతవరకూ చేయని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ఇళ్ల పట్టాలు లబ్ధిదారులందరికీ ఎలాంటి వ్యయ భారం లేకుండా అందజేయగలుగుతున్నామని చెప్పారు.

నగర పరిధి 39వ వార్డులోని మాధవధార వుడా కాలనీ సామాజిక భవనంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో రెండో విడత పట్టాల పంపిణీ చేపట్టగా మిగిలిన నియోజకవర్గంలో 34, 35, 36, 37, 38, 39, 40 వార్డులకు చెందిన 920 లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంగళవారం సాయంకాలం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండవాలు ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా నివసిస్తూ ఎలాంటి ధ్రువీకరణ లేని వారి కోసం పట్టాలు అందించాలన ఆశయంతో ప్రతిపాదనలను నగరంలోని తన సహచర ఎమ్మెల్యేలతో కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. పట్టాల్లో పేర్లు, ఇతర వివరాలు తప్పులు దొర్లినట్టయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వాటిని తిరిగి సరిదిద్దేలా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజక అభివృద్ధికి తగిన ప్రాధాన్యతనిస్తూ సమస్యల పరిష్కారంలో పార్టీలకు అతీతంగా పని చేయడమే తన ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటానన్నారు. తన నియోజకవర్గంలోని 9 మద్యం దుకాణాలు మూసివేయించడం ఎన్నో వ్యయప్రయాసలకు కూడుకున్నదైనా ప్రజల సహకారంతో సాధించగలిగానన్నారు. అవినీతి, లంచగొండి తనాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు తమ ఇబ్బందులను తన దృష్టికి తెచ్చినట్టయితే ఎలాంటి ఒడిదొడుకులునైనా ఎదుర్కొని వారికి న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఐజాక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చైతన్యతో పాటు ఆయా వార్డుల బీజేపీ, టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలను అందిజేస్తున్న ఎమ్మెల్యే



హాజరైన లబ్ధిదారులు

రూ.12 లక్షలతో రోడ్డు నిర్మాణం

సీతమ్మధార : నగర పరిధి 9వ వార్డు సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లో గల అభయాంజనేయస్వామి ఆలయం రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం బీజేపీ నగర ఉపాధ్యక్షురాలు శ్యామలదీపిక శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డీఈ పద్మవతి మాట్లాడుతూ సుమారు రూ.12 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. 690 మీటర్లు పొడవు, 6 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ రాఘవులు, వర్క్ సూపర్‌వైజర్ రావు, టీడీపీ నాయకులు, బీజేపీ నాయకులు చొక్కాకుల రామకృష్ణ, బార్నాన సంజీవవరావు, జయరామరాజు, ఎం.సత్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న శ్యామలదీపిక

గంగన్ననగర్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్లు మంజూరుకు చర్యలు
- ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు హామీ

కంచరపాలెం : జీవీఎంసీ 35వ వార్డు పరిధి గంగన్ననగర్ గ్రీన్‌బెల్ట్‌లో నివాసాలను జీవీఎంసీ అధికారులు తొలగించిన నేపథ్యంలో ఇళ్లను కోల్పోయిన బాధితులను ఎమ్మెల్యే మంగళవారం పరామర్శించారు. పలువురు బాధితులతో మాట్లాడి తక్షణమే అర్హులను గుర్తించి వారికి పక్కా ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులను గుర్తించేందుకు స్థానిక వార్డు, బాధితులతో కమిటీ వేసి అర్హులకు జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద గృహాలను మంజూరు చేస్తావని హామీ ఇచ్చారు. గ్రీన్‌బెల్ట్‌లో ఆక్రమణలను తొలగించిన విషయం తనకు తెలియదని, నగరాభివృద్ధిలో భాగంగా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. అయితే బాధితులకు ముందస్తు సమాచారం ఇచ్చి గ్రీన్‌బెల్ట్‌ను చదునుచేస్తే ఇబ్బందులు లేకపోయేవని ఎమ్మెల్యే అభిప్రాయ పడ్డారు. బాధితులందరకీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో బాధితులంతా హర్షధ్వానాలతో మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో నాలుగో జోన్ కమిషనర్ ఎస్.రమణమూర్తి, టీపీబీవో లావణ్యతో పాటు స్థానిక నాయకులు సింగంపల్లి అమ్మోరు, ఈతలపాక లక్ష్మి, బి.రాజురెడ్డి, రంగు ముద్ర రాంబాబు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నిర్వాసితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

టీఎస్సార్ సేవా పీఠం ఆధ్వర్యంలో

వైద్య పరీక్షలు

తాటిచెట్లపాలెం : నగర పరిధి 33వ వార్డులోని తాటిచెట్లపాలెంలో మంగళవారం టీఎస్సార్ సేవా పీఠం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ 33వ వార్డు అధ్యక్షుడు నూనెల పోలారావు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యులు వై.సూర్యారావు, భారతి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో అధికంగా మహిళలు పాల్గొని వైద్యసేవలు పొందారు. ఈ కార్యక్రమంలో నగర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గొంప శ్రీధర్, సేవా పీఠం ఇన్‌చార్జి సర్వా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వృథా అవుతున్న తాగునీరు



సీతమ్మధార : నగర పరిధి 9వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్‌న్‌లో మంచినీటి సరఫరా వాల్వు నుంచి మంచినీరు వృథాగా పోతున్నది. దీంతో స్థానికులకు మంచినీటి ధార తక్కువగా వస్తున్నది. అలాగే నీరు సరఫరా చేసే సమయంలో నీరు వృథాగా పోతున్నా చాలాసేపు ఎవరూ పట్టించుకోవటం లేదని స్థానికులు అంటున్నారు.

నీటి వృథా అరికట్టండి



జాతీయ రహదారి మర్రిపాలెం జీఎన్ అపార్ట్‌మెంట్ పక్కన పైపులైన్ వాల్వు దగ్గర లీకై అధిక మొత్తంలో నీరు వృథాగా పోతున్నది. రైవాడ రిజర్వాయర్ నుంచి నగరానికి తాగునీటిని సరఫరా చేసే పైపులైన్ వాల్వు లీకై అధిక మొత్తంలో నీరు వృథాగా పోవడం వల్ల నగరానికి నీటి సరఫరా సామర్థ్యం తగ్గే పరిస్థితి ఉంది. మూడు రోజులుగా రాత్రీపగలు ఇలా నీరు లీకై డ్రైనేజీలో కలుస్తున్నది. దీనిపై జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులకు ఫిర్యాదు చేశాం. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని లీకులను అరికట్టాలని కోరుతున్నాం.

- ఎండీ సలాముద్దీన్, పార్వతీనగర్ (మర్రిపాలెం)

దళితులపై దాడులను నిరసిస్తూ

దేవీశ్రీ గళం

విశాఖపట్నం : పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రు దళితులపై అగ్రవర్ణాల దాడులకు నిరసనగా ప్రజా గాయకుడు మజ్జి దేవీశ్రీ గళం విప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం డాబాగార్డెన్స్ దరి అంబేడ్కర్ విగ్రహం వద్ద 'కులంపై నిరసన గళం హృదయావిష్కరణ' పేరిట ప్రజాకవి దేవీశ్రీ ఆధ్వర్యంలో ఆటపాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్కువ కులమంటివి.. దోచుకు తింటున్న దొర.. మీ ఎక్కువ ఏమిటి?, బంగ్లాలోన బడా దొర.. అనే పల్లవితో గళం విప్పిన దేవిశ్రీ పాటలో ఎండల్లో బండరాళ్ల పునాది నింపెటోళ్లం.. బట్టీలో ఇటుక కాల్చి బంగ్లాను గట్టెటోళం..మా రక్తమంతా ఒడిసి నీ బంగ్లాకు రంగేస్తే..కొత్తింట్లో మీకు హక్కు.. కొస వాకిలే మాకు దిక్కు.. వంటి పదునైనాపద జాలాలు గరగపర్రు దళితుల ఆక్రందనకు అద్దంపట్టాయి. కార్యక్రమంలో లక్ష్మి, రాంప్రభు, గౌరీ, ఒడ్డు కల్యాణరావు, ఏఎస్‌నాయుడు, బి.అప్పారావు పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న దేవీశ్రీ

ఆంధ్రజ్యోతి
4
పెందుర్తి
విశాఖ సిటీ। బుధవారం 9 ఆగస్టు 2017
పెందుర్తి । సబ్బవరం । పరవాడ । వేపగుంట ।లంకెలపాలెం।నరవ

క్లిక్.. పోస్ట్

Click.. Post

మీ దృష్టికి వచ్చిన సామాజిక సమస్యను ఫొటో తీసి వాట్సాప్ ద్వారా ఆంధ్రజ్యోతికి పంపవచ్చు. సమస్య గురించి క్లుప్తంగా వివరాలతోపాటు మీ పేరు, ప్రాంతం తప్పనిసరిగా తెలియజేయాలి. వాట్సాప్ నంబర్:
7013642413

హలో... ఆంధ్రజ్యోతి

మీ స్థానిక సమస్యలను ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కింది నంబర్‌కు తెలియజేయవచ్చు.
98482 12243 ikm.krishnamurty@gmail.com

● ట్రాఫిక్‌జామ్‌తో ఇబ్బందులు

దేశపాత్రునిపాలెం రైల్వే బ్రిడ్జి దగ్గర నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. దేశపాత్రునిపాలెం, ఆపైప్రాంతాల్లో ఉంటున్న ఉక్కుఉద్యోగులు స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లేందుకు ఇదే బ్రిడ్జి కిందుగా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఇతర ప్రయాణికులు, వాహనచోదకుల రాకపోకలకు ఇదే మార్గం. రైల్వే బ్రిడ్జి ఇరుకుగా ఉండటం, ఇందులో చేపలు, కూరగాయలు, తోపుడు బళ్లు పెట్టి వ్యాపారాలు చేయడం, వాటి కొనుగోలుకు వచ్చిన వారు రోడ్డుమీదనే తమ వాహనాలు నిలపడం వంటి కారణాల వల్ల బ్రిడ్జి కింద నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఉదయం సాయంత్రం వేళల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ట్రాఫిక్ పోలీసులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం

- కొవిరి కోదండరావు, టౌన్‌షిప్

బంగారమ్మపాలేన్ని దత్తత తీసుకున్న జడ్పీ సీఈవో


సమావేశంలో జడ్పీ సీఈవో జయప్రకాశ్‌నారాయణ

సబ్బవరం,రూరల్ : మిషన్ అంత్యోదయ పథకంలో భాగంగా సబ్బవరం మండలంలోని బంగారమ్మపాలెం గ్రామాన్ని జడ్పీ సీఈవో జయప్రకాశ్‌నారాయణ దత్తత తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామానికి వచ్చిన ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తున్నామని దండోరా వేయించాలని కార్యదర్శికి సూచించారు. సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలపరిశీలన చేశారు. గ్రామ జనాభా వివరాలు సేకరించారు. త్వరలో గ్రామసభ నిర్వహణకు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఇంటికి పది వేలు ఆదాయం వచ్చేలా ప్రణాళిక చేస్తామన్నారు. సిరసపల్లిలో ఫ్లోరైడ్ ప్రభావం ఉందని గ్రామస్థులు చెప్పగా సంబంధిత అధికారులతో మాట్లాడతానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి అప్పారావు, లింగాలతిరుగు దేవస్థానం చైర్మన్ దొడ్డి రాజుకోటి, తహసీల్దార్ పైల రామారావు, ఎంపీ డీవోవో పూర్ణిమాదేవి, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సత్యనారాయణరాజు, వీఆర్వో గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ అంత్యోదయతో గ్రామాల అభివృద్ధి

మిషన్ అంత్యోదయ పథకం ద్వారా మహాత్మా గాంధీ 150వ జయంతి (2019, అక్టోబర్ 2) నాటికి గ్రామాల్లో సంపూర్ణ అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం ప్రణాళిక చేసిందని జడ్పీ సీఈవో జయప్రకాశ్‌నారాయణ అన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పథకం అమలులో భాగంగా జిల్లా, మండల స్థాయి అధికారులు గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తారని చెప్పారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ, ప్లాస్టిక్ వాడకం నిషేధం, ప్రణాళిక ద్వారా పంచాయతీ అభివృద్ధి, ఓడీఎఫ్‌గా గ్రామాన్ని తీర్చిదిద్దడం, వంద శాతం ఇంటి పన్ను వసూలు, పేదరిక నిర్మూలన, పాఠశాలల్లో తరగతి గదుల డిజిటలైజేషన్ అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. డీఈవో, ఈవోపీఆర్డీ, ఎంపీడీవో, డీపీవో, డీఎల్పీవో స్థాయి అధికారులు గ్రామాలను దత్తత తీసుకుంటారన్నారు. పథకం అమలుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పథకాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు జిల్లాలో 185 గ్రామాలను ఎంపిక చేశామని అన్నారు. మిషన్ అంత్యోదయ విజయవంతానికి ఎన్‌ఆర్‌ఐల సేవలు వినియోగించుకుంటామన్నారు. రాష్ట్రంలో ఐదువేల తరగతి గదుల డిజిటలైజేషన్ సంబంధించిన నిధుల కోసం ఎన్‌ఆర్‌ఐల నుంచి హామీ లభించిందని ఆయన చెప్పారు. అదే విధంగా అంగన్‌వాడీ భవనాల నిర్మాణంలో 30 శాతం నిధులు భరించేందుకు అమెరికాకు చెందిన ఎన్‌ఆర్‌ఐలు ముందుకొచ్చారని జడ్పీ సీఈవో జయప్రకాశ్‌నారాయణ చెప్పారు.

వెంకటాద్రి ఆలయ సంప్రోక్షణ


గ్రహణ సంప్రోక్షణ చేస్తోన్న అర్చకులు

పెందుర్తి : స్థానిక వెంకటాద్రి శిఖరంపై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం గ్రహణ సంప్రోక్షణ చేశారు. ప్రధానార్చకులు మహర్తి రామానాజుచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఆలయాన్ని పవిత్ర జలాలతో శుద్ధి చేశారు. వెంకటేశ్వరుని మూలవిరాట్, ఆభరణాలు శుద్ధి చేశారు. వెంకటేశ్వర స్వామి, అమ్మవారికి సంపోక్ష్రణ పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

గుర్రమ్మపాలెంలో డీపీవో పర్యటన


గ్రామంలో డీపీవో కృష్ణకుమారి

పెందుర్తి : జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి మంగళవారం గుర్రమ్మపాలెంలో పర్యటించారు. గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించారు. డీపీవో వెంట ఎంపీపీ రెడ్డి వరలక్ష్మి, స్థానిక నేతలు అక్కిరెడ్డి చినరమణ, సుఖవాసి అజయ్ ఉన్నారు.

పదిహేనళ్ల లోపు వారికి ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి


విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్

పరవాడ: మీజల్స్ అండ్ రుబెల్లా (ఎంఆర్) వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించుకోవాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్‌వో) ప్రతినిధి డాక్టర్ కిరణ్ విద్యార్థులకు సూచించారు. నాయుడుపాలెం పంచాయతీ మెట్టపాలెం ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అందిస్తున్న ఎంఆర్ వ్యాక్సిన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. మొత్తం 600 మంది విద్యార్థులకు గాను 591 మంది విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ ఇచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఇదిలావుంటే డబ్ల్యుహెచ్‌వో ప్రతినిధి డాక్టర్ కిరణ్ వాడచీపురపల్లి పీహెచ్‌సీని సందర్శించి ఎంఆర్ వ్యాక్సినేషన్ వివరాలు సేకరించారు. ఆయన వెంట పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి కె.అజయ్‌చంద్ర, మెట్టపాలెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు వున్నారు.

బ్యాంకు రుణాల కోసం ఇంటర్వ్యూ రేపు

వేపగుంట : వివిధ కార్పోరేషన్ల ద్వారా స్వయం ఉపాధి నిమిత్తం రుణం కోసం బ్యాంకులకు దరఖాస్తు చేసుకున్న వేపగుంట జోనల్ కార్యాలయ పరిధిలోని ఏడు వార్డులకు చెందిన వారికి పదో తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. నాయుడుతోట తులసీ కల్యాణమండపంలో ఆ రోజు ఉదయం పది గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఏపీడీ బొజ్జ ప్రసాదరావు తెలిపారు.

పరవాడలో..

పరవాడ: స్వయం ఉపాధి కోసం బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు 2014 నుంచి ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఎస్సీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్‌లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులంతా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఎంపీడీవో కె. కరుణకుమారి తెలిపారు. ఏపీజీవీబీ పరవాడ సిండికేట్ బ్యాంక్, ఎస్‌బీఐ ముత్యాలమ్మపాలెం, ఎస్‌బీఐ వాడచీపురపల్లి, ఏపీజీవీబీ లంకెలపాలెం బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలో పాల్గొంటారని తెలిపారు. దరఖాస్తుదారులు ఒరిజనల్ సర్టిఫికేట్లుతో పాటు మూడు సెట్ల జెరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలన్నారు.

మౌలిక వసతుల సమస్యలుంటే చెప్పండి

గ్రామాల్లో పర్యటించిన జీవీఎంసీ కమిటీ


గ్రామంలో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిటీ

లంకెలపాలెం: మౌలిక వసతులకు సంబంధించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని 56వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బీవీ. రామారావు సూచించారు. గ్రామాల్లో వివిధ సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులతో జీవీఎంసీ నియమించిన కమిటీ మంగళవారం లంకెలపాలెం, గొడ్డుపేట, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో పర్యటించింది. ఇందులో భాగంగా అధికారులు ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని ఎక్కువమంది ప్రజలు కమిటీకి వివరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ వెంకటరావు, వీరుబాబు, సురేశ్, పైడిరాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ పాఠశాలలో కుళ్లిపోయిన కోడిగుడ్లు


ఎండాడ పాఠశాలలో ఉడకపెట్టిన కోడిగుడ్లు

ఎండాడ: ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఇచ్చే కోడిగుడ్లు మంగళవారం కుళ్లిపోయాయి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వారానికి మూడు రోజుల పాటు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా పాఠశాలలకు కోడిగుడ్లను సరఫరా చేసేందుకు కొన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా కోడిగుడ్లను సరఫరా చేస్తున్నారు. ఎండాడ ప్రభుత్వ పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారంలో మూడు రోజుల పాటు అంటే 1,500 గుడ్లను ప్రభుత్వం నియమించిన ట్రేడర్ ఈ నెల ఐదో తేదీన పాఠశాలకు అందించాడు. వారానికి మూడు రోజులంటే సోమవారం, బుధవారం, శుక్రవారం పాఠశాలలో విధిగా విద్యార్థులకు ఉడకబెట్టిన కోడి గుడ్డు అందివ్వాలి. సోమవారం రాఖీ పండగ సందర్భంగా కోడిగుడ్డు ఇవ్వలేదు. దాని బదులు మంగళవారం కోడిగుడ్లను అంగన్‌వాడీ కార్యకర్తలు ఉడకబెట్టగా అందులో చాలా గుడ్లు కుళ్లి పోయి దుర్వాసన రావడంతో విద్యార్థులకు ఇవ్వలేదు. దీనిపై ఎంఈవోకు ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు.

క్రైస్తవుల శాంతియుత ర్యాలీ రేపు

జగదాంబ సెంటర్: దళిత క్రైస్తవులకు ఎస్సీ, ఎస్టీ హోదా కల్పించాలనే డిమాండ్‌తో గురువారం శాంతియుత ర్యాలీ చేపట్టనున్నట్టు క్రిస్టియన్ మైనార్టీ జాయింట్ యాక్టివ్ కమిటీ ప్రతినిధులు కొల్లాబత్తుల వెంగలరావు, అనిల్ పాల్ మోహన తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 67 ఏళ్ల క్రితం రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా దళిత క్రైస్తవులకు ఎస్సీ, ఎస్టీ హోదా కల్పించాలని విడుదల చేశారన్నారు. నేటికి అది అమలు కాలేదన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు గురువారం ఉదయం తొమ్మిది గంటలకు శాంతియుత ర్యాలీ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు లాల్, శామ్యూల్, అబెల్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

నటరాజ్ పిక్చర్ ప్యాలెస్ (లక్ష్మీకాంతం)

స్క్రీన్ 1 : నక్షత్రం

-10.45; 1.45; 5.45, 8.45

స్క్రీన్ 2 : ఫిదా

- 10.45; 5.45, 1.45; 8.45

ఏకీకృత నిబంధనలపై ఉపాధ్యాయుల నిరసన



శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

శ్రీహరిపురం: ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా మున్సిపల్ ఉపాధ్యాయులు శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాల వద్ద మంగళవారం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా మున్సిపల్ ఉపాధ్యాయుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ వలన ఉపాధ్యాయులకు నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ఉపాధ్యాయ సంఘాలు దీనికి మద్దతు పలుకుతూ ఉపాధ్యాయలకు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని తగు న్యాయం చేయాలని ఉపాధ్యాయులు కోరారు.

నేరస్థుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి

మల్కాపురం: దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బంగారు ఆభరణలు వేసుకొని బయట తిరగరాదని మల్కాపురం సీఐ కేశవరావు పేర్కొన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం మల్కాపురం ప్రధాన కూడలిలో నిలబడి మైకు పట్టుకొని పలు సూచనలు చేశారు. ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చినట్టయితే తమ సిబ్బంది ఆ ఇంటిపై నిఘా ఉంచుతారని వివరించారు. అనుమానితులు ఎవరైనా కనబడితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. వినాయక చవితి నిర్వాహకులు నిబంధనలు పాటించాలని కోరారు. వినాయక విగ్రహం ఎత్తు తొమ్మిది అడుగలకు మించి ఉన్నట్టయితే పోలీసులు అనుమతించరని తెలిపారు. ఈ విషయంలో ఏ ఒక్కరిని ఉపేక్షించేది లేదని తెలిపారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

హలో... ఆంధ్రజ్యోతి

మీ స్థానిక సమస్యలను ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కింది నంబర్‌కు తెలియజేయవచ్చు.
9848212243 ikm.krishnamurty@gmail.com

నిధులు మంజూరు చేయాలి

జీవీఎంసీ 50వ వార్డు పరిధి యాతపాలెంలోని గృహనిర్మాణ లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలి. ప్రభుత్వం రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేయడంతో సుమారు 40 మంది లబ్ధిదారులు తాము ఉంటున్న పాకలు తొలగించి స్థానే పక్కా గృహాలు నిర్మించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు కొంత నగదును సమకూర్చుకొని పక్కాగృహాల నిర్మాణాన్ని చేపట్టారు. పునాదులు పూర్తి చేశారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు బ్యాంకుల నుంచి నిధులు మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. సంబంధిత అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం

సంపంగి సూరిబాబు, యాతపాలెం

క్లిక్.. పోస్ట్

Click.. Post

మీ దృష్టికి వచ్చిన సామాజిక సమస్యను ఫొటో తీసి వాట్సాప్ ద్వారా ఆంధ్రజ్యోతికి పంపవచ్చు. సమస్య గురించి క్లుప్తంగా వివరాలతోపాటు మీ పేరు, ప్రాంతం తప్పనిసరిగా తెలియజేయాలి.
వాట్సాప్ నంబర్: 7013642413

కాలనీల్లో పందుల బెడద



బాబూజగ్జీవన్‌రామ్ కాలనీలో పందుల బెడద చాలా ఎక్కువగా ఉంది. కాలనీ ప్రధాన రహదార్లు, వీధి రోడ్లలో ఇవి గుంపులుగా సంచరిస్తున్నాయి. పందుల పెంపకందారులు కూడా ఈ ప్రాంతంలోనే ఉంటూ వాటిని ఇక్కడే పెంచుతున్నారు. ఇవి కాలనీలోని ఖాళీ స్థలాల్లో గోతులు చేసి అక్కడ నివాసం ఉంటూనే కాలనీలో పిల్లలతోపాటు సంచరిస్తున్నాయి. వీటికి ఎదురు పడేందుకు స్థానిక మహిళలు పిల్లలు భయపడుతున్నారు. వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని గతంలో రెండు మార్లు జీవీఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశాం, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నాం

కాకినాడ పెంటారావు

జాతీయ పోటీలకు గాజువాక క్రీడాకారులు



పోటీలకు అర్హత పొందిన క్రీడాకారులు

గాజువాక టౌన్: ఈ నెల 12, 13 తేదీల్లో చెన్నైలోని ఇండోర్ స్టేడియంలో జరగనున్న 16వ ఆలిండియా కా షియోటో కరాటే జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో గాజువాక ప్రాంతానికి చెందిన విద్యార్థులు పాల్గొననున్నారు. వీరికి కె.పరదేశి కోచ్‌గా, రిఫరీగా వ్యవహరిస్తున్నారు. ఈ పోటీలకు ప్రిన్స్ శర్మ, సిరిబాల, బేబ్బీ మేరీ బెన్నీ, ప్రియాంకశర్మ, పింకజేశర్మ, ఎవి.లలిత కుమార్, కె.బీజిత్, బిజన్‌బిన్, డి.దీపక్, సందీప్‌యాదవ్, కృష్ణారెడ్డి, అశ్వీన్‌సింగ్ అర్హత సాధించారు.



ఎక్సకవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం



ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

రోడ్లపై చిరు వ్యాపారాల నిర్వహణకు చెక్

కణితి రోడ్డు, కొత్తగాజువాక రోడ్లలో బడ్డీలు తొలగింపు

గాజువాక టౌన్: కణితి రోడ్డు, కొత్తగాజువాకరోడ్లపై అక్రమణల తొలగింపునకు టౌన్‌ప్లానింగ్ విభాగం ఎట్టకేలకు శ్రీకారం చుట్టింది. మంగళవారం ఉదయం ఈ రెండు ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న బడ్డీలను తొలగించారు. కణితి రోడ్డు పొడవునా నిర్వహిస్తున్న కూరగాయల వ్యాపారాలను తొలగించారు. ఈక్రమంలో ఆక్రమణదారులు ప్రతిఘటించడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. రహదారుల పైన, కొత్తగాజువాక మార్కెట్ ప్రాంతంలో ఆక్రమణలను పూర్తిగా తొలగించేశారు. రాజీవ్ రోడ్డులో నడుస్తున్న మార్కెట్‌ను కూడా జింక్‌గేట్ ప్రాంతానికి తరలించే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఇకపై జోనల్ పరిధిలో రహదారులపై బడ్డీలు, ఇతర ఆక్రమణలు ఉంటే తొలగించే విధంగా జోనల్ కమిషనర్ సోమన్నారాయణ ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే ఆక్రమణలపై టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో ఆరాతీశారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయి



సోమన్నారాయణ, జోనల్ కమిషనర్

ఇకపై రోడ్లపై వ్యాపారాలు చేస్తే సహించేది లేదు. కొత్తగాజువాక, కణితి రోడ్డు ప్రాంతాల్లో ఆక్రమణలు ఎక్కువగా ఉండడం వల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వ్యాపారాల నిర్వహణకు మున్సిపల్ వాణిజ్య సముదాయాలు అందుబాటులో ఉన్నాయి. లేని ప్రాంతాల్లో స్థలాలు కేటాయిస్తాం. ప్రతిఒక్కరూ సహకరిస్తే గాజువాక ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దగలం. ఆక్రమణలు తొలగించడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయి.

ఉక్కు ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ ఇవ్వాలి

కేంద్ర మంత్రికి రాజశేఖర్ వినతి

ఉక్కుటౌన్‌షిప్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ స్కీమ్ అమలు చేసేందుకు కృషి చేయాలని కోరుతూ కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయకు ఉక్కు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో నాయకులు వినతి పత్రం అందజేశారు. న్యూఢిల్లీలో మంగళవారం మంత్రిని కలిసి పలు సమస్యలపై చర్చించారు. వినతి పత్రం అందజేసిన వారిలో స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్టీ సభ్యులు గొందేశి మహేశ్వరరెడ్డి, పి.వి.రమణమూర్తి, మంత్రి గోపీనారాయణ తదితరులు ఉన్నారు. అదే విధంగా చీఫ్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ ఆర్.కె.వర్మకు వినతి పత్రం అందజేశారు.



దత్తాత్రేయకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

'ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అడ్డుకోవడం తగదు'

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ ఏడాది నిర్వహించకపోవడం, కార్యక్రమ నిర్వహణకు అసోసియేషన్‌లో కీలక వ్యక్తి అడ్డుపడడం తగదని వర్కింగ్ ప్రెసిడెంట్ కుంబా రామవలు అన్నారు. అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏటా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, అయితే ఈ ఏడాది అసోసియేషన్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తి అడ్డుపడ్డారని, దీని వల్ల ఈ ఏడాది నిర్వహించకపోవడం తగదన్నారు. ఆదివాసీల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించకుంటే జాతీయ గిరిజన ఛైర్మన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

గరగపర్రు బాధితులకు న్యాయం చేయాలి

ఎస్సీ కమిషన్ సభ్యుడికి వినతి

ఉక్కుటౌన్‌షిప్: గరగపర్రు బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ స్టీల్‌ప్లాంట్ దళిత సంఘ నాయకులు ఎస్సీ కమిషన్ సభ్యులు కె.రాములుకు వినతి పత్రం అందజేశారు. సాంఘిక బహిష్కరణకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని దళితులకు అండగా నిలిచి, వారిలో మనోధైర్యాన్ని నింపాలన్నారు. అదే విధంగా పలు సమస్యలపై ఆయనకు విన్నవించారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు జి.బోసుబాబు, ఎస్.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, చిన్నయ్య ఉన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

ఉక్కుటౌన్‌షిప్: ప్రతిఒక్కరూ భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ సీఐ టి.లక్ష్మి అన్నారు. విశాఖ విమల విద్యాలయంలో నిర్వహిస్తున్న జూనియర్ రెడ్ క్రాస్ వారోత్సవాల్లో సీఐ మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలు నడపరాదని, రహదారి నియమాలు పాటించాలని, బస్సులు ఎక్కేటప్పుడు క్రమ పద్ధతి పాటించాలని సూచించారు. అనంతరం కణితి జంక్షన్ వరకు భద్రత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఆర్‌సీ ఉపాధ్యక్షుడు పెనిల్లా, ప్రతినిధులు రవిచంద్, ఎం.రామారావు, జ్యోతి, పుష్పలత, పి.ప్రకాశరావు, సుకుమార్ పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

సినిమా గైడ్

కన్య స్క్రీన్ 1: ఫిదా;
స్క్రీన్-2: దర్శకుడు
శ్రీకన్య స్క్రీన్-3: ఫిదా;
విశేష్: దండుపాళ్యం-2;
లక్ష్మి: నిన్ను కోరి;
లక్ష్మీకాంత్: నక్షత్రం
మోహిని(70ఎంఎం): గౌతమ్ నందా
మోహిని (35 ఎంఎం): గౌతమ్ నందా
మోహిని (మినీ): నక్షత్రం
అరుణ(పెదగంట్యాడ): నక్షత్రం
అన్నపూర్ణ(కూర్మన్నపాలెం): నక్షత్రం
ఎస్‌వీసీ లిఖిత (శ్రీహరిపురం): దర్శకుడు
ఎస్‌టీబీఎల్ స్క్రీన్1: నక్షత్రం (ఫస్ట్ షో, సెకెండ్ షో); స్క్రీన్2: ఫిదా (ఆల్ షోస్)
స్క్రీన్3: దర్శకుడు (11.00, 6.30 2.15, 9.45)

ఏయూ వాలీబాల్ జట్టుకు అభినందన



వాలీబాల్ జట్టును అభినందిస్తున్న ఏయూ వీసీ నాగేశ్వరరావు

ఎంవీపీకాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం నాన్‌టీచింగ్ స్టాఫ్ వాలీబాల్ జట్టును ఉపకులపతి ఆచార్య జి నాగేశ్వరరావు మంగళవారం అభినందించారు. ఇటీవల తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో జరిగిన ఏపీ ఇంటర్ యూనివర్సిటీ నాన్‌టీచింగ్ స్టాఫ్ వాలీబాల్ టోర్నీలో ఏయూ వాలీబాల్ జట్టు రన్నర్ అప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య జి నాగేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య వి ఉమామహేశ్వరరావు ప్రతిభ చూపిన వాలీబాల్ క్రీడాకారులను అభినందించారు.



గోతులు పూడ్చి రహదారి చదును చేస్తున్న దృశ్యం

రహదారిపై గోతుల పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆరిలోవ: హనుమంతవాక జంక్షన్‌లో రహదారిపై గోతులను అధికారులు పూడ్చివేశారు. ఈజంక్షన్‌లో 133 కేవీ అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ నిమిత్తం రహదారిని తవ్వేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లేది. దీనిపై ఆంధ్రజ్యోతిలో అటు పనులు ఇటు ఉల్లంఘనలు అనే కథనం ప్రచురితమైంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించారు. ఎక్స్‌కవేటర్‌తో రహదారిపై గోతులను పూడ్చివేశారు. దీనితో జంక్షన్‌లో ట్రాఫిక ఇబ్బందులు తగ్గాయి.



డంపర్‌బిన్లలో పేరుకుపోయిన చెత్త

'డంపర్‌బిన్లలో చెత్తను తొలగించాలి'

పెదవాల్తేరు: పెదవాల్తేరు రైతుబజార్ వద్ద ఏర్పాటుచేసిన డంపర్‌బిన్లలో చెత్తను తొలగించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డంపర్ బిన్లు నిండిపోయి దుర్వాసన వస్తోంది. రెండు రోజులుగా ఇదేపరిస్థితి నెలకొంది. జీవీఎంసీ సిబ్బంది తూతూ మంత్రంగా తొలగింపు చర్యలు చేపడుతున్న పరిస్థితి మెరుగుపడడం లేదని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన శానిటరీ సిబ్బంది పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. ఎక్కడికక్కడ డంపర్‌బిన్ల వద్ద చెత్త పేరుకుపోవడంతో దోమలు, ఈగలు, వృద్ధి చెందుతున్నాయని ఇక్కడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పారిశుధ్యం మెరుగునకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



తరగతి గదిలో పరికరాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ భవాని



అధికారులతో చర్చిస్తున్న చైర్‌పర్సన్

ఆనందలహరితో ఒత్తిడి లేని విద్య

జడ్పీ చైర్‌పర్సన్ లాలం భవాని
శ్రీకృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో ఆనంద లహరి అభ్యాసన కార్యక్రమం ప్రారంభం

ఆరిలోవ: విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించేందుకు ఆనంద లహరి అభ్యాసన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవాని అన్నారు. ఆమె మంగళవారం ఉదయం చినగదిలి మండలం శ్రీకృష్ణాపురం గిరిజన గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో ఆనందలహరి అభ్యాసన కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత ఆనందలహరి అభ్యాసన తరగతి గదిని ప్రారంభించారు. అనంతరం ఆనందలహరి అభ్యాసన పోస్టరును ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు రాష్ట్రంలోని విద్యావిధానంలో సమూల మార్పులు తీసుకువచ్చి చిన్నారులకు మంచి విద్యావిధానాన్ని అందించేందుకు ఈ కార్యక్రమం ప్రవేశపెట్టారని తెలిపారు. చిన్నారులకు ఎటువంటి ఒత్తిడి లేకుండా విద్యనందించడమే ఆనందలహరి అభ్యాసన కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. అధ్యాపకులశిక్షణ, బోధన ప్రణాళికల అభివృద్ధి, టెక్నాలజీ వంటివి ఉంటాయన్నారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఈ బోధనా విధానం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి నాగమణి మాట్లాడుతూ విద్యాశాఖ డైట్ ఎస్‌ఎస్‌ఏ సమన్వయంతో అన్ని మండలాల్లోని పాఠశాలలో నూతన విద్యా విధానం చక్కగా అమలయ్యేలా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో లాలం భాస్కరరావు, సర్వ శిక్ష అభియాన్ పీవో శివరామప్రసాద్ సాయిబాబా, పెందుర్తి ఎంఈవో సాంబశివరావు, జిల్లా ఇన్‌చార్జి రామ మెహన్, వై.అవినాష్‌తేజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దయానిధి, ఇతర పాఠశాల ఉపాధ్యాయు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు
స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ఫ్రెషర్స్ డే వేడుకలు

ఎంవీపీకాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి నాగేశ్వరరావు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. యూజీసీ నెట్, సీఎస్ఐఆర్ వంటి జాతీయస్థాయి పరీక్షలలో ప్రథమ ర్యాంకులు సాధిస్తే వర్సిటీ తరపున లక్ష రూపాయల నగదు పురస్కారం అందిస్తామన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆకాంక్షలను సాకారం చేసే దిశగా ఎదగాలన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డీఈ బాబు మాట్లాడుతూ అభ్యాసనాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. పాఠ్యపుస్తకాలను చదవాలని, ఆంగ్ల భాషపై పట్టు సాధించడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. విశ్రాంత ఆచార్యులు కేవీ రమణ మాట్లాడుతూ కాలాన్ని వృథా చేయకుండా కష్టించి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆచార్య జీఎస్ మూర్తి, ఆచార్య పీ వేణి, ఆచార్య ఆర్ మురళీ కృష్ణ, ఆచార్య టీ శివరావు, బసవయ్య, పి శ్యామల, వీ సిద్ధయ్య, శైలజ, సత్యనారాయణ, కృష్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ఫ్రెషర్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న వీసీ నాగేశ్వరరావు

రైతుబజార్‌లో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

చేతికందే ఎత్తులో ఉన్నాయంటూ వినియోగదారుల ఆందోళన

పెదవాల్తేరు: నగరంలోని పెదవాల్తేరు రైతుబజార్‌లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం వినియోగదారులతో రద్దీగా ఉండే ఈ బజార్‌లో కార్యాలయం గది నుంచి కిందకు వేలాడు ప్రమాదకరంగా ఉన్నాయి. బజారుకు వచ్చే వినియోగదారులు ఏమాత్రం చేతులు పైకిఎత్తినా వైర్లు తగిలేవిధంగా ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైర్లు కూడా ఎక్కువ సంఖ్యలో ఉండడం వల్ల ఇవి ఏమాత్రం బలమైన గాలులు వీచిన అటు ఇటూ ఊగి తెగిపడిపోయేలా ఉన్నాయని భయాందోళన చెందుతున్నారు. రైతుబజారు ఆధికారులు చేతికి అందేంత ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయాలని కోరుతున్నారు.



రైతుబజారులో కిందకు వేలాడుతున్న విద్యుత్‌వైర్లు



బీమా పరిహారం అందిస్తున్న దృశ్యం

చంద్రన్న బీమా పరిహారం పంపిణీ

ఆరిలోవ: ఆరిలోవ 1వ వార్డు ఆపరేషన్ కాలనీలో ఆకస్మికంగా మృతి చెందిన నమ్మి వేణుబాబు భార్య నమ్మి మల్లీశ్వరికి మంగళవారం చంద్రన్న బీమా పథకం పరిహారాన్ని అందజేశారు. పథకంలో మంజూ రైన 30వేల రూపాయలకుగాను తక్షణ సాయంగా ఐదు వేల రూపాయలను టీడీపీ 1వ వార్డు అధ్యక్షుడు పి.ధర్మారావు, కార్యదర్శి యల్లమల్లి సురేష్ అందజేశారు. వేణుబాబు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పథకంలో మంజూరైన మిగిలిన రూ.25వేలను మల్లీశ్వరి బ్యాంకు ఖాతాలో వేస్తామని తెలిపారు.

13 నుంచి పర్తియాత్ర

ఎంవీపీకాలనీ: సత్యసాయి ప్రశాంతి నిలయంలో ఈనెల 13,14,15 తేదీలలో పర్తి యాత్ర సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సంగీత సుధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విశాఖ జిల్లా సత్యసాయిసేవా సంస్థలు ఒక ప్రకటనలో తెలిపాయి. 13న సాయికుల్వంత్‌లో దర్శనం, వేదపఠనం, మహాసమాధి దర్శనం కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 15న ఉదయం భక్తులు సత్యసాయి దివ్య వ్రతాలలో పాల్గొన్న అనంతరం తిరుగు ప్రయాణమవుతారని తెలిపారు.

పెంకు పురుగులతో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ వాసుల ఇక్కట్లు

నిత్యం నరకయాతన

- నిద్ర లేక, తిండి తినలేక అవస్థలు
- వాహనచోదకులకూ తప్పని బెడద
- కనీస చర్యలు తీసుకోని ఎఫ్‌సీఐ గోదాము సిబ్బంది


జ్ఞానాపురం జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీ

జ్ఞానాపురం: జీవీఎంసీ 44వ వార్డు జ్ఞానాపురం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ ఆవరణలో కొద్ది రోజులుగా పెంకు పురుగుల బెడద ఎక్కువగా ఉంది. వీటి కారణంగా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇవి ఇళ్లలోని బియ్యం, పప్పులు ఇతరత్రా సామగ్రిల్లోకి కూడా చొరబడుతున్నాయి. కంటికి కనిపించని రీతిలో ఉండడంతో ఆయా తిండి గింజలను వినియోగించలేక సతమతమవుతున్నారు. భోజనం చేసేటప్పుడు కంచాల్లో పురుగులు పడుతుండడంతో తినలేకపోతున్నారు. రాత్రి సమయంలో చెవులు, ముక్కులోకి దూరి అసౌకర్యానికి గురి చేస్తున్నాయి. ముఖ్యంగా చంటి పిల్లలు, వృద్ధులు వీటి బెడదను భరించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. వీటి బెడద నుంచి తమకు రక్షణ కల్పించాలని కాలనీ వాసులు మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథుడు లేడు.

పురుగులతో సతమతం

ఈ కాలనీలో ప్రస్తుతం 343 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇందులోని వారంతా పేదలే. రెక్కాడితే గానీ డొక్కాడని వీరిలో అధిక శాతం రోజువారీ కూలీలే. ఈ కాలనీని ఆనుకుని ఎర్రిగెడ్డ కాలువతోపాటు భారతీయ ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) గోదాము ఉంది. వీటిలో ఆహార ధాన్యాలు నిల్వ చేస్తుంటారు. వివిధ ప్రాంతాల నుంచి సరుకు దిగుమతి చేసినప్పుడు ఈ గోదాముల్లోకి పెంకు పురుగులు చేరుతున్నాయి. గట్టిగా ఎండ కాసినా, జోరుగా వర్షం కురిసినా ఆ పురుగులు బయటకు వచ్చి సమీప కాలనీలోకి, రోడ్డు మీదకు వస్తు న్నాయి. ఈ గోదాము సమీపాన ఉన్న బాబూకాలనీ, సెబాస్టియన్‌కాలనీ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలకు వీటి సమస్య అధికంగా ఉంటోంది. దీని వల్ల స్థానికులు వీటి బెడద నుంచి తప్పించుకోలేకపోతున్నారు. రాత్రి సమయంలో ఆర్‌పీ పేట రోడ్డు మీద రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారుల చెవులు, కళ్లలో పురుగులు ప్రవేశించడంతో వాటి మంటకు వాహనాలు నడపడం కష్టంగా ఉంటోంది. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పెంకు పురుగుల నివారణకు గోదాము నిర్వాహకులు ప్రత్యేక మందులు వినియోగించాల్సి ఉంది. కానీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సమీప కాలనీ వాసులు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పెంకు పురుగుల బెడద లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.


కాలనీని ఆనుకుని ఉన్న ఎఫ్‌సీఐ గోదాము



రాత్రి వేళ నిద్ర పట్టడం లేదు

పెంకు పురుగుల వల్ల రాత్రి సమయంలో నిద్ర పట్టడం లేదు. పురుగులు చెవులు, ముక్కులోకి ప్రవేశించి ఇబ్బంది పెడుతున్నాయి. చంటి పిల్లలు, వృద్ధులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతం.

- జి.శాంతి, సెబాస్టియన్ కాలనీ



చాలా ఇబ్బందిగా ఉంది

ఎర్రిగెడ్డకు ఆనుకుని ఉండడంతో ఓ వైపు దోమలు, మరో వైపు పెంకు పురుగులతో ఇబ్బందిగా ఉంటోంది. దోమల నివారణకు ఫాగింగ్ జరగడం లేదు. పెంకు పురుగుల నివారణకు మందుల వినియోగించడం లేదు.

- గవర రమణ, బాబూకాలనీ



వాహనం నడపలేకపోతున్నాం

జ్ఞానాపురం నుంచి ఆర్‌పీ పేట వరకు ఉన్న వంతెన మీద వాహనం నడిపేటప్పుడు పెంకు పురుగులు కళ్లు, ముక్కులోకి వెళుతున్నాయి. దీని వలన వాహనం నడపలేకపోతున్నాం. రాత్రి వేళ ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది.

- గోవింద, వాహనచోదకుడు

దళితులపై దాడులకు నిరసనగా దేవీశ్రీ గళం

డాబాగార్డెన్స్, ఆగస్టు 8 : పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రు దళితులపై అగ్రవర్ణాల దాడులకు నిరసనగా ప్రజా గాయకుడు మజ్జి దేవీశ్రీ గళం విప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం డాబాగార్డెన్స్ దరి అంబేడ్కర్ విగ్రహం వద్ద 'కులంపై నిరసన గళం హృదయావిష్కరణ' పేరిట ప్రజాకవి దేవీశ్రీ ఆధ్వర్యంలో ఆటపాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్కువ కులమంటివి.. దోచుకు తింటున్న దొర.. మీ ఎక్కువ ఏమిటి?, బంగ్లాలోన బడా దొర.. అనే పల్లవితో గళం విప్పిన దేవిశ్రీ పాటలో ఎండల్లో బండరాళ్ల పునాది నింపెటోళ్లం.. బట్టీలో ఇటుక కాల్చి బంగ్లాను గట్టెటోళ్లం..మా రక్తమంతా ఒడిసి నీ బంగ్లాకు రంగేస్తే..కొత్తింట్లో మీకు హక్కు.. కొస వాకిలే మాక్కు దిక్కు.. వంటి పదునైనాపద జాలాలు గరగపర్రు దళితుల ఆక్రందనకు అద్దంపట్టాయి. లక్ష్మి, రాంప్రభు, గౌరీ, ఒడ్డు కల్యాణరావు, ఎ.ఎస్.నాయుడు, బి.అప్పారావు పాల్గొన్నారు.


గీతాలు ఆలపిస్తున్న మజ్జి దేవీశ్రీ

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే వాసుపల్లి

పూర్ణామార్కెట్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఫిషింగ్ హార్బర్ లక్ష్మీటాకీస్ వద్ద ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని వినతులను ఆయన స్వీకరించారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తుండడంతో ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభిస్తుందన్నారు.

దొండపర్తిలో..

విశాఖపట్నం: చంద్రన్న బీమా పేదల బతుకులకు కొండంత భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. దొండపర్తి పరదేశమ్మ ఆలయం పక్కన మంగళవారం 15, 31, 44 వార్డులకు ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో స్థానికుల నుంచి వినతులు, ఫిర్యాదులు ఎమ్మెల్యే స్వీకరించారు. 44వ వార్డు జ్ఞానాపురం ప్రాంతానికి చెందిన కాపు లక్ష్మణరావు ప్రమాదంలో మరణించడంతో చంద్రన్న బీమా పరిహారాన్ని మృతుడు లక్ష్మణరావు తల్లి కె.సుజాతకు రూ.4.95 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ అయినట్టు ప్రొసీడింగ్ పత్రాలు ఎమ్మెల్యే అందజేశారు. డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలోని రైల్వే పాఠశాల విద్యార్థులకు క్రికెట్ పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 15, 31, 44 వార్డుల టీడీపీ అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణరెడ్డి, నున్న నాగేంద్ర, ఇరోతి చిన్నకుమార్, నాయకులు శరగడం అప్పలనాయుడు ముక్కి రామకృష్ణ, ఎం.వెంకట సత్యనారాయణ, గంట్యాడ శంకరరావు, లక్ష్మీ శివప్రసాద్, పిళ్లా నాగేశ్వరరావు, జోన్-4 కమిషనర్ రమణమూర్తి, వీఆర్వో శ్యామల పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే వాసుపల్లి

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

వన్‌టౌన్: శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం అష్టదళ పద్మారాధన ప్రత్యేక పూజను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో భాగంగా అష్టదళాలు కలిగిన 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజను జరిపారు. అలాగే ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో అ మ్మవారికి పంచామృతాభిషేక సేవ చేశారు. మరోవైపు శ్రావణమాస ప్రత్యేక పూజలో భాగంగా శ్రావణలక్ష్మి కుంకుమ పూజలు, విశేష హోమాలు జరిపారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక కుంకుమ పూజలు జరిపించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో ఎస్.జ్యోతిమాధవి అన్ని ఏర్పాట్లు చేశారు.



నీలమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ.61 వేలు

డాబాగార్డెన్స్, ఆగస్టు 8: దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన నీలమ్మ దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం ఆలయ ఆవరణలో చేపట్టారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ గౌరీ, ఆలయ ఈవో ఆర్.శ్రీహరిరావు సమక్షంలో శ్రీహరి సేవా సంఘం సభ్యులు హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో శ్రీహరిరావు మాట్లాడుతూ 29 రోజులకు గాను రూ.61,480 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. సుమారు నాలుగు గంటల పాటు హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.

- సమస్యల సుడిలో 38వ వార్డు ప్రజలు
- కొండవాలు ప్రాంతమైనా మెట్ల మార్గం లేదు
- అధ్వానంగా పారిశుధ్యం
- పని చేయని బోర్లు, వెలగని దీపాలు
- ఎడాది పొడవునా నీటి ఎద్దడి
- వేధిస్తున్న చోరీల భయం, కుక్కల బెడద

అడుగుకో అవస్థ



రాళ్లతో ఉన్న రహదారి



చెత్తచెదరంతో నిండిన రోడ్డు

మురళీనగర్ : నగర పరిధి 38వ వార్డులోని సాయిరాంనగర్‌లో పారిశుధ్య అధ్వానంగా తయారైంది. అసలే కొండవాలు ప్రాంతం కావడం, అరకొరగా సౌకర్యాలు ఉండడంతో ఇక్కడ నివసిస్తున్న వారికి ఎప్పుడూ ఇబ్బందులు తప్పడం లేదు.

కొండప్రాంతం కావడంతో పైకి వెళ్లేటపుడు మెట్లమార్గం అవసరం. అయితే ఏళ్లు గడుస్తున్నా ఇక్కడ మెట్ల మార్గాన్ని ఏర్పాటు చేయడం లేదు. దీంతో పైన నివసించే వారు సరైన రహదారి సౌకర్యం లేక రాళ్లు, మట్టి నిండిన ఎగుడుదిగుడు మార్గంలోనే పైకి వెళుతుంటారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు కొండపైకి ఎంతో కష్టంగా వెళుతుంటారు. చిన్న పిల్లలు, మహిళలు పైకి ఎక్కేటపుడు కింద పడిపోవడంతో గాయాల పాలవుతుంటారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వస్తే ఇక్కడ మరింత దుర్భర పరిస్థితి నెలకొంటుంది. మార్గం బురదమయంగా తయారవ డంతో గతుకుల రహదారిలో వెళ్లలేక అనేక అవస్థలు పడుతుంటారు.

అపుడపుగూ ఈ వార్డు పర్యటనకు వచ్చే ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు మెట్ల మార్గం ఏర్పాటు చేస్తామంటూ హామీలు ఇస్తుంటారు. కానీ, వాటిని కార్యరూపం దాల్చేందుకు మాత్రం దృష్టి పెట్టడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అలాగే కొండ ప్రాంతం కావడంతో పారిశుధ్య సిబ్బంది అటు వైపు చూడడమే ఉండదని, వారం రోజులకు ఒకసారి వచ్చి 'నామ్ కే వాస్తే..గా పని చేసుకుని వెళుతుంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో తమ ప్రాంతంలో ఎప్పుడూ దుర్గంధం, వీధులు చెత్తతో నిండి ఉంటాయని అంటున్నారు. ఈ ప్రాంతానికి ఆనుకుని జాతీయరహదారిపై ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ సిబ్బంది ఇష్టానుసారం చెత్తను కుప్పలుగా పైన వేస్తుండడంతో మరింత ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతుంటుందని స్థానికులు వాపోతున్నారు. అధిక శాతం మంచి నీటి బోర్లు సరిగా పని చేయం లేదు. ఒకటి, రెండు బోర్లు పని చేస్తున్నా మురుగు నీరు మాత్రమే వస్తున్నది. దీంతో ఆ నీరు తాగడానికి అవకాశం లేకుండా పోతున్నది. వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో వార్డు మొత్తం చిమ్మచీకటిగా ఉంటుంది. దీంతో కుక్కలు, చోరీల బెడద ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ వార్డులో సమస్యల గురించి పట్టించుకోవాలని కోరుతున్నారు.



బడ్డీ తొలగిస్తున్న కార్మికులు

ఫుట్‌పాత్‌పై దుకాణాల తొలగింపు

అక్కయ్యపాలెం : జగ్గారావు బ్రిడ్జి ప్రధాన రహదారి వద్ద ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న బడ్డీలను మంగళవారం జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. కొందరు చిరు వ్యాపారులు కొన్నేళ్ల నుంచి ఫుట్‌పాత్‌ను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనివల్ల పాదచారులు, వాహనదారులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. పాదచారులు ఫుట్‌పాత్‌పై నడిచే వీలు లేక రోడ్డుపై నడుస్తుండడంతో రద్దీ వేళల్లో ట్రాఫిక్ సమస్య ఎదురవుతున్నది.

ఈ నేపథ్యంలో 12వ వార్డు జీవీఎంసీ చైన్‌మన్ రమణ ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బంది తొలగించారు. కొద్ది రోజుల క్రితం 12వ వార్డు పర్యటనకు వచ్చిన జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ ఫుట్‌పాత్‌పై దుకాణాలను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేయడంతో ఈ చర్యలు తీసుకున్నట్టు చైన్‌మన్ తెలిపారు.

10న ఇ.కె. జయంతి



తాటిచెట్లపాలెం : జగద్గురు పీఠం వ్యవస్థాపకులు మాస్టర్ ఎక్కిరాల కృష్ణామాచార్య (ఇ.కె) 92వ జయంతి ఉత్సవాలు ఈ నెల 10న తాటిచెట్లపాలెం మాస్టర్ హోమియో వైద్యాలయం ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు సంస్థ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. మహాత్మా గాంధీ బాలవికాస్ కేంద్రంలో వున్న 46 మంది చిన్నారులకు వస్త్ర బహూకరణ, వృత్తి విద్యలో శిక్షణ పొందిన 56 మంది మహిళలకు జగద్గురు పీఠం భౌగోళిక అధ్యక్షులు మాస్టర్ పార్వతీ కుమార్ ధ్రువపత్రాలు, 11 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తారని తెలిపారు.

మురుగునీరుతో దుర్గంధం



ఇళ్ల మధ్య నిలిచిపోయిన మురుగు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 34 వ వార్డు సోనియాగాంధీ నగర్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎంకు సంబంధించిన ఇళ్ల మధ్య వున్న కాలువల్లో మురికి నీటితో పాటు వ్యర్థాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెలువడుతున్నదని, దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైను పగిలిపోవడంతో నీరంతా కిందకు చేరి నిల్వ ఉండి పోతున్నదని, దీనివల్ల సమస్య అధికంగా ఉందని అంటున్నారు. ఇళ్ల మధ్య వున్న కాలువలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయడం లేదని అంటున్నారు. దీనివల్ల పరిసరాలు అపరిశుభ్రంగా తయార వడంతో వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన చెందు తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హీరోయిన్ ప్రియాంక

విడుదలకు సిద్ధమైన 'ఒక్క రూపాయి'

సీతంపేట : నూతన నటీనటులతో టెన్‌ట్రీస్ ఫిల్మ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'ఒక్క రూపాయి' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతున్నదని, మరో రెండు నెలల్లో విడుదల చేయనున్నామని ఆ చిత్ర దర్శకుడు ఆర్కే గాంధీ తెలిపారు. శాంతిపురంలోని ఆర్‌కె ఈవెంట్స్‌లో మంగళవరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో గాంధీ మాట్లాడుతూ విశాఖ నగరానికి చెందిన గోవింద్ హీరోగా నటించారన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో షూటింగ్ చేశామన్నారు. బెంగళూరుకు చెందిన ప్రియాంక హీరోయిన్‌గా నటించిందన్నారు. మరో హీరోగా ఉదయ్‌కుమార్ రెడ్డి, గీతాసింగ్, ఫిష్ వెంకట్, టార్జాన్, సుమన్ శెట్టి, ఏఎల్ మురళీకృష్ణ, ఎ.గిరీష్, మోనికా, వెంకట్‌రమణ తదితరులు నటించారన్నారు. ఒక్క రూపాయి సంపాదించడానికి పడే కష్టంపై సినిమా షూటింగ్ కొనసాగిందని, నటీనటులంతా కష్టపడి పనిచేశారని, ఈ చిత్రం ప్రజాదారణ పొంది మంచి హిట్ అవుతుందని గాంధీ ఆశాభావం వ్యక్తం చేశారు.

పరదేశమ్మ ఆలయంలో కుంకుమపూజలు

తాటిచెట్లపాలెం : స్థానిక పరదేశమ్మ ఆలయంలో మంగళవారం కుంకుమ పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు. సాయంత్రం అమ్మవారికి జలాభిషేకం చేపట్టారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిదులు దాడి శ్రీనివాసరావు, బోర నూకరాజు రెడ్డి, కోరాడ సత్యశివరావు, శీరం తాతాజీ, జీఆర్కే రాజు,జీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పరదేశమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం

విద్యార్థులు గాంధీజీ అడుగు జాడల్లో నడవాలి

గాంధీ సెంటర్ అధ్యక్షుడు బాలమోహన్‌దాస్



బహుమతులు అందజేస్తున్న బాలమోహన్‌దాస్

అక్కయ్యపాలెం : జాతిపిత మహాత్మా గాంధీ అడుగు జాడల్లో నడవాలని గాంధీ సెంటర్ అధ్యక్షుడు బాలమోహన్‌దాస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మైల్‌స్టోన్ హ్యాండీక్రాఫ్ట్స్, వుమెన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం అబీద్‌నగర్‌లోని ఎస్ఆర్ డీజీ పాఠశాలలో క్విట్ ఇండియా 76వ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ సత్యం, మనోబలం, చక్కని దస్తూరి, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. గాంధీని చూసి మానవ విలువలు, నాయకత్వ లక్షణాలు, దేశభక్తిని అలవర్చుకోవాలని చెప్పారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు రహీమున్నీషా బేగం మాట్లాడుతూ మంచిని ఆస్వాదించి చెడును వదిలేయాలని సూచించారు. భవిష్యత్తులో అన్ని పాఠశాలల్లో భావితరాలకు గాంధీ విలువలు, స్వాతంత్ర్య సమరయోధుల వీరగాథలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల వికాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు నరవ ప్రకాశరావు, ఏయూ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ చల్లా అభిషేక్, ఎస్ఆర్ డీజీ స్కూల్ ప్రిన్సిపాల్ టి.లీలాశ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, ఉత్సవాలు... తదితర కార్యక్రమాల వివరాలను మాకు తెలపండి

విలేకరుల ఫోన్ నంబర్లు

పెందుర్తి	7396660208	లంకెలపాలెం	9160903339
సబ్బవరం	9885969119	నరవ	7396557667
పరవాడ	9866787641	సబ్బవరం రూరల్	9885323135
వేపగుంట	9963949649		

వేపగుంట : అప్పన్నపాలెం దరి భరత్‌నగర్ రోడ్డును ఆనుకొని ఉన్న సిద్ధిలక్ష్మీనగర్‌లో చేపట్టిన కాలువ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ ప్రాంతంలో పూర్తి స్థాయిలో రహదారులు, కాలువలు లేవు. ఇటీవల రహదారి నిర్మాణం చేశారు. కొద్ది రోజులు క్రితం కాలువల నిర్మాణం ప్రారంభించారు. కానీ వాటిపై కల్వర్టులను ఏర్పాటు చేయలేదు. రహదారిని ఆనుకొని కాలువల ఉండడంతో పలు చోట్ల రోడ్డు దాటడానికి, ఇళ్లలోకి వెళ్లడానికి మార్గం లేకుండా పోయింది. దీంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక కాలువ మధ్యలో రాళ్లు, మట్టి వేసి స్థానికులు కొందరు తాత్కాలిక మార్గాలు ఏర్పాటుచేసుకున్నారు.

సిద్ధిలక్ష్మీనగర్‌లో పూర్తికాని కాలువ పనులు

రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

నిర్మాణంలో నాణ్యతపై అనుమానాలు



నిలిచిపోయిన మురుగునీరు

అరకొర పనులతో అవస్థలు



కాలనీలోని రహదారి

దుర్వాసనతో పాట్లు

కాలువల నిర్మాణం నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లోని ఇళ్లలోని వాడుక నీరును స్థానికంగా ఓ ఖాళీ ప్రదేశంలోకి మళ్లించారు. పనులు పూర్తికాకపోవడంతో ప్రస్తుతం ఆ ప్రాంతమంతా మురుగునీటితో నిండిపోయింది. మురుగు రహదారిపైకి చేరుతుంది. మురుగు నీటి నిల్వ కారణంగా పరిసరాలు దుర్వాసనతో నిండిపోయాయి. అంతేకాక దోమలు వృద్ధి చెందుతున్నాయి.


కాలువపై తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న మార్గం

పురుగులతో ఇబ్బంది పడుతున్నాం



కాలనీలో ఒక వైపు మురుగునీరు నిల్వ ఉంది. మరోవైపు గెడ్డ, చుట్టూ తుప్పలు బలిసి ఉండటంతో వర్షం పడితే విషపురుగులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. రాత్రివేళ ఏ విష పురుగులు ఎవరిని కాటేస్తోయోనని ఆందోళన చెందుతున్నాం. కాలనీ పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించేలా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి

- వైవీ అప్పారావు, రిటైర్డ్ ఉద్యోగి

కాలువ నాణ్యతపై అనుమానాలు..

సిద్ధిలక్ష్మీనగర్‌లో రహదారికి అనుసంధానంగా నిర్మించిన కాలువ పనుల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణం పూర్తి చేసి పదిహేను రోజులు అవుతుంది. అప్పుడే కాలువ గోడల అంచులు విరిగిపోయాయి. నిర్మాణంలో ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలా జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలువ నిర్మాణం పూర్తి చేయించడంతో పాటు నిర్మాణంలో నాణ్యత ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


పెచ్చులూడిన కాలువ

ఎన్ని రోజులు వేచి చూడాలి



ఇక్కడ కాలువ నిర్మాణం ప్రారంభించనప్పుడు కేవలం ఐదు రోజులే ఇబ్బంది ఉంటుందని కాంట్రాక్టర్ చెప్పాడు. నిర్మాణం పూర్తియితే కాలువపై పలకలు వేయిస్తామని చెప్పారు. పదిహేను రోజులు అవుతుంది. ఇప్పటివరకు కాలువ నిర్మాణం జరగలేదు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- శ్రీనివాసరావు, అపార్ట్‌మెంట్ నివాసిత అధ్యక్షుడు..

ఆరాధన

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు

లంకెలపాలెం : స్థానిక మారుతి కూడలిలో ఉన్న అభయాంజనేస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తి గీతాలు, భజనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ రోజు...

రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

సబ్బవరం : స్వయం ఉపాధి కోసం వివిధ కార్పొరేషన్ల ద్వారా బ్యాంకులో రుణాల పొందేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం, గురువారం స్థానిక మండలపరిషత్ సమావేశమందిరం ఆవరణలో బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు చేస్తారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీహెచ్, కెనరా, సెంట్రల్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంకు అధికారులు బుధవారం ఇంటర్వ్యూలు చేస్తారని ఇన్‌చార్జి ఎంపీడీవో పూర్ణిమాదేవి తెలిపారు. ఎస్‌బీఐ, ఐఓబీ గుల్లేపల్లి, ఏపీజీవీబీ సబ్బవరం, ఐఓబీ రాంపురం, ఎస్‌బీఐ రాంపురం బ్రాంచ్‌ల్లో దరఖాస్తులు చేసుకున్నవారికి గురువారం ఇంటర్వ్యూ చేస్తారు. ఉదయం పది గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు

సబ్బవరం : విద్యా ప్రగతి- అభివృద్ధి అంశంపై నేటి నుంచి మూడు రోజులు పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్ ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఎంఈవో ఆర్‌ఆర్‌కే నర్సింగరావు తెలిపారు. టెలీకాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాదు నుంచి నిపుణులు ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తారన్నారు. మొదటి రోజు బుధవారం 50 శాతం మంది ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పాధ్యాయులకు, గురువారం మిగిలిన ఉపాధ్యాయులకు తెలుగు, లెక్కలు, సైన్స్ పాఠ్యాంశాలపై, శుక్రవారం హైస్కూల్ ఉపాధ్యాయులకు తెలుగు, లెక్కలు, సైన్స్, సోషల్ పాఠ్యాంశాలపై అవగాహన కల్పిస్తారు. పాఠ్యాంశాల బోధనలో మెరుగుదల కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని ఎంఈవో తెలిపారు.

వెదుళ్లనరవలో 'పొలం పిలుస్తోంది'


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో శ్రీదేవి

సబ్బవరం,రూరల్ : సేంద్రియ ఎరువులు వినియోగంతోనే రైతులు సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారిణి శ్రీదేవి పేర్కొన్నారు. మండలంలోని వెదుళ్లనరవ గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. భూసార పరీక్షల రికార్డులు ఆధారంగా పంటకు ఎరువులు వినియోగించాలని సూచించారు. భూమి వివరాలు ఆన్‌లైన్ చేసుకుంటే వాటి ఆధారంగా ఎరువులు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రసాయనఎరువులు కంటే సేంద్రియ ఎరువుల వాడకం వల్ల మంచి దిగుబడులు వస్తాయన్నారు. తెగుళ్ల నివారణకు గోవు మూత్రం, మలం, వేప కాషాయంతో తయారు చేసిన జీవామృతం, బీజామృతం వినియోగించడం వల్ల మనిషికి ఎటువంటి రోగాలు ప్రభలవన్నారు. అనంతరం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ మాజీ అధ్యక్షుడు మొల్లి ముత్యాలనాయుడు, ఏఈవో బాలరాజు, ఎంపీఈవోలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా నగదు పంపిణీ


నగదు ఇస్తున్న వియ్యపు చిన్న

పరవాడ: రావాడ గ్రామానికి చెందిన తోట నర్సింగరావు ఇటీవల మృతి చెందారు. చంద్రన్న బీమా పథకం కింద మంజూరైన రూ.5వేలను టీడీపీ నేత వియ్యపు చిన్న బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కావలి రామస్వామినాయుడు, విజయవర్మరాజు, బీమా ప్రతినిధి ఏసురత్నం పాల్గొన్నారు.

వారపు సంతలో కొనసాగుతున్న ధరల పెరుగుదల

పరవాడ: మండల కేంద్రం పరవాడలో ప్రతి మంగళవారం నిర్వహించిన వారపు సంతలో కూరగాయల ధర పెరుగుదల కొనసాగుతూనే ఉంది. గత వారం ధరలతో పోల్చుకుంటే ఈ వారం ధరల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. మంగళవారం టమాటా కిలో రూ.40లు పలికింది. వంకాయలు కిలో రూ.30, బెండ రూ.30, బీరకాయలు రూ.40, ఉల్లిపాయలు రూ.30, బంగాళాదుంపలు రూ.16, దొండకాయలు రూ.30, క్యారెట్ రూ.30, బీట్ రూట్ రూ.50, క్యాప్సికం రూ.50, అల్లం రూ.60, పచ్చిమిర్చి రూ.50, క్యాలీఫ్లవర్ రూ.40, బీన్స్ రూ.80, దోసకాయలు రూ.30, ఆగాకర రూ.40, కాకర రూ.30, సొరకాయలు రూ.20 చొప్పున విక్రయాలు సాగాయి. ఇటీవల కాస్తున్న ఎండల కారణంగా మున్ముందు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.


వారపు సంతలో కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

ఆక్రమణలపై జీవీఎంసీ కమిషనర్ ఆగ్రహం

- వెంటనే తొలగించాలని ఆదేశాలు
- పారిశుధ్య పరిస్థితిపై కన్నెర్ర

మల్కాపురం: జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ మంగళవారం మల్కాపురం ప్రాంతంలో పర్యటించారు. ఈ పర్యటన అంతా వాడిగా వేడిగా కొనసాగింది. రహదారులు, కాలువల ఆక్రమణలపై ఆయన కన్నెర్ర చేశారు. ఈ నేపథ్యంలోనే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణలను తొలగించకపోతే సహించేది లేదని గట్టిగా హెచ్చరించారు. మల్కాపురం నుంచి ఏడుగుళ్ల జంక్షన్‌కు వెళ్లే మార్గంలో నడుచుకొని తెలుగుదేశం కాలనీ వరకు వెళ్లారు. కాలువలను పరిశీలించారు. కాలువలలో ఉన్న చెత్తలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలపై చేపట్టిన నిర్మాణాలను నిర్ధాక్ష్యణ్యంగా తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు, అంతేకాకుండా ప్రజా అవసరాలను గుర్తించి ఆ సమస్యలు పరిష్కారానికి అంచనాలు వేయాలని అదికారులకు ఆదేశించారు. అధికారులు ఎ ప్పటికప్పుడు ప్రజలతో మాట్లాడి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొని ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటన దాదాపుగా రెండు గంటలపాటు సాగింది. ఈ పర్యటనలో ఆయనతోపాటు జీవీఎంసీ జోన్-4 కమిషనర్ రమణమూర్తి, ఏఎంహెచ్‌వో మురళీమోహన్, వివిధ విబాగాల అధికారులు పాల్గొన్నారు.



మల్కాపురంలో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్

ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల జీతాలు నిలుపుదల

మల్కాపురం: జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ పర్యటనలో 48, 49 వార్డులలో పారిశుధ్య పరిస్థితి సక్రమంగా లేదని గుర్తించారు. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఆగస్టు నెల జీతాలను నిలిపివేస్తున్నట్టు కమిషనర్ స్పష్టం చేశారు. ఈ రెండు వార్డులలో ఎక్కడ చూసినా చెత్తలే దర్శనమివ్వడం, వీధులలో సక్రమంగా చెత్తలు తీయడం లేదని పలువురు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.



ఆకమణలను తొలగిస్తున్న దృశ్యం

హుటాహుటిన ఆక్రమణలు తొలగింపు

మల్కాపురం: ఆక్రమణల తొలగింపు ఉద్రిక్తంగా మారింది. ఒక్కసారిగా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఆక్రమణలను తొలగించడం మొదలుపెట్టడంతో ఆక్రమణదారుల్లో గుబులు పుట్టించింది. మంగళవారం ఉదయం జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ మల్కాపురం ప్రాంతంలో పర్యాటించారు. ఆయన పర్యటనలో అనేక ఆక్రమణలను గుర్తించారు. అంతేకాకుండా ప్రధానంగా కాలువను మూసేసి పక్కా నిర్మాణాలు చేపట్టడం చూసి ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆ అక్రమణలను తొలగించాలని, లేకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించడంతో సిబ్బంది హుటాహుటిన పనిముట్లు పట్టుకొని ఆక్రమణలను తొలగించడం మొదలుపెట్టారు. ఏడుగుళ్ల జంక్షన్ మార్గంలో అడ్డగోలుగా నిర్మించిన ఓ బేకరీ అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు సిద్ధమవుతుండగా అక్కడ ఉద్రిక్తత నెలకొంది. అయితే ఆక్రమణలు స్వయంగా తొలగించుకోవడానికి సమయం ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

ఆంధ్రజ్యోతి
గాజువాక
5
విశాఖ సిటీ, బుధవారం 9 ఆగస్టు 2017
గాజువాక । కూర్మన్నపాలెం । అక్కిరెడ్డిపాలెం । ఉక్కుటౌన్‌షిప్ । ఉక్కునగరం । పెదగంట్యాడ

హై టెన్షన్

పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ లైన్లతో దడ

ఇళ్లపై నుంచి ఉండడంతో ప్రజల ఆందోళన

బిక్కుబిక్కుమంటూ జీవనం

(శ్రీనగర్)

హై టెన్షన్ విద్యుత్ లైన్లు వేలాది నివాస గృహాలపై నుంచి వెళ్లడంతో పారిశ్రామిక ప్రాంతాల కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమంటున్నారు. జీవీఎంసి 61 వార్డు శ్రీనగర్, పాతకర్ణవానిపాలెం, అఫీషియల్ కాలనీ, సుందరయ్య కాలనీ, దుర్గా నగర్, శ్రీరామ్‌నగర్, అరుణోదయ కాలనీ, గురు నాథరావు కాలనీ, దిబ్బపాలెంలలో అత్యధిక ఇళ్లు హెచ్‌టీ లైన్ల కిందనే ఉన్నాయి. దీంతో నివాసితుల గుండెలు గుభేలు మంటున్నాయి.

చొరవ చూపని అధికారులు

రోజు కూలీలు, మధ్యతరగతికి చెందిన ఉద్యోగులు, సన్నకారు వ్యాపారులు ఎక్కువ మంది ఈ కాలనీలలో నివసిస్తున్నారు. నిత్యం జనంతో కిటకిటలాడే ఈ కాలనీలలో 133 కె.వి, 200 కె.వి, 400 కె.వి. హెచ్.టి లైన్లు ఇళ్ల మీదుగా వెళ్తున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 18 హైటెన్షన్ టవర్లు ఉన్నాయి. సుమారు దశాబ్ద కాలం నుంచి జనావాసాల మధ్య ఉన్న విద్యుత్ లైన్లు మార్చాలని ప్రజలు మొత్తుకున్నా స్పందన లేకపోవడంతో గత్యంతరం లేని స్థితిలో హై టెన్షన్ వైర్ల కింద జీవనాలను కొనసాగిస్తున్నారు. ఈ విద్యుత్ లైన్లు మార్చేందుకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఆదేశాలు రాలేదని విద్యుత్ ఉన్నతాధికారులు చెబుతున్నారు.





ఇళ్లకు అతి సమీపంలో హైటెన్షన్ వైర్లు

హెచ్.టి లైన్ల కింద నివాసం ఉంటున్న ఇళ్లల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల శ్రీనగర్, సుందరయ్య కాలనీలో పలువురు మృత్యువాతపడ్డారు. కొంతమంది ఇళ్లల్లో విద్యుత్ ఉపకరణాలు కాలిబూడిదయ్యాయి. ఈదురు గాలులు వీచినా, చిన్న పాటి వర్షం పడినా ప్రమాదాలు సర్వసాధారణం అయిపోయాయి. గత నెలలో ఒక బాలుడు, గత ఏడాది మరో బాలుడు ఇటువంటి ప్రమాదాల వల్లే ఈ కాలనీలో ప్రాణాలు కోల్పోయారు. ఎప్పటి కప్పుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నా, అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి హెచ్‌టీ వైర్లు మార్పిడి చేసేలా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



ఈ వైర్లు తొలగించాలి

కరణం కనకరావు, పాతకర్ణవానిపాలెం



హైటెన్షన్ తీగలను తొలగించాలి. దశాబ్దాల కాలం నుంచి ఈ వైర్ల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు మొరపెట్టుకున్నా. పైనుంచి ఆదేశాలు రావాలని అంటున్నారు తప్ప సమస్య పరిష్కారమవడంలేదు.

ప్రమాదాలకు సంకేతాలు

కె.సహదేవరావు, సుందరయ్య కాలనీ



విద్యుత్ తీగల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి. ఇటీవల ఓ చిన్నారి వీటి బారినపడి మృతిచెందాడు. గతంలో కొంతమంది అవయవాలు కోల్పోయారు. ఎప్పటికప్పుడు ఇళ్లలోని విద్యుత్ ఉపకరణాలు ధ్వంసం అవుతున్నాయి.

'స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు చర్యలు తీసుకోండి'



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్‌కు స్టీల్‌ప్లాంట్ నాయకులు బి.వెంకటరావు, యేల్లేటి శ్రీనివాసరావు వినతి పత్రం అందజేశారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా నిర్వాసితులకు ఉపాధి కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు.

నాయకత్వ లక్షణాలు అవసరం

గాజువాక టౌన్: ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం మేనేజ్‌మెంట్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఈమంది శ్రీనివాస్ నైపుణ్యంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆధునిక ప్రపంచంలో పోటీ రంగంలో విద్యార్థులు ఏ విధంగా ముందుకు సాగాలో వివరించారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకుంటే అన్ని రంగాల్లో రాణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎం.ఎ.అనిష్‌కుమార్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ధ్యేయం: పల్లా

అక్కిరెడ్డిపాలెం: నియోజకవర్గం అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. అక్కిరెడ్డిపాలెంలో రూ.పది లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం పల్లా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హాయంలోనే అభివృద్ధి జరగుతోందన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



శంకుస్థాపన చేస్తుత్న పల్లా శ్రీనివాసరావు

కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు శీరం రాజేష్, బొడ్డు వెంకటరమణ, అనంతలక్ష్మి, రోహిణి, చంద్రమ్మ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యం

అగనంపూడి: పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి పరిసరాల పరిశుభ్రతకు సిబ్బంది కృషి చేయాలని గాజువాక జోనల్ ఏఎంహెచ్‌వో జయరామ్ సూచించారు. కొత్తూరు సబ్‌జోనల్ కార్యాలయం వద్ద వార్డులోని 80 మంది పారిశుధ్య కార్మికులుకు మంగళవారం ఆయన రెయిన్‌కోట్లు అందజేవారు. ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ వర్షకాలంలో గ్రామాల్లో పారిశుధ్య పనులకు ఆటంకం లేకుండా జీవీఎంసీ చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం కార్యాలయంలోని కార్మికుల హాజరు, రికార్డులను పరిశీలించారు. అంతకుముందు అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు శానటరీ ఇన్‌స్పెక్టర్ బీవీ రామారావు, సూపర్‌వైజర్లు పైడిరాజు, నాయుడు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



రెయిన్ కోట్లు పంపిణీ చేస్తున్న జయరామ్

యువత భాగస్వామ్యంతోనే స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు పేర్కొన్నారు. వియ్యపువానిపాలెంలో టీఎన్‌టీయుసీ ముఖ్యనాయకుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ శిక్షణ కాలం రెండేళ్లకు పెంచడం, అర్హతకు తగిన ప్రత్యేకత ఇవ్వకపోవడం వల్ల యువత ముందుకు రాలేకపోతున్నారని అన్నారు. సమావేశంలో గల్లా శంకర సాయిరామ్, యలమంచిలి అప్పలరాజు, కరణం సత్యారావు, శ్రీను, ముత్యాలు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరాధన

అభయాంజనేయుడికి అలంకరణ

అగనంపూడి: అగనంపూడి కూడలిలోని అభయాంజనేస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో ఆలంకరించారు. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించికొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.



● **పెదగంట్యాడ:** హెచ్‌బీ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు స్వామివారికి తమలపాకులతో అలంకరించారు. బాబూజగ్జీవన్‌రామ్ కాలనీ, డెయిరీ కాలనీ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

రహదారి మధ్యలో బోరు!



పెదగంట్యాడ: జీవీఎంసీ 55వ వార్డు మాడకదాసరిపేట రోడ్డు మధ్యలో బోరు.. రాకపోకలకు ఆటంకంగా మారింది. రోడ్డు మధ్యలో బోరు ఉంటుండగానే ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాంతంలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో చీకటి పడేసరికి వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే బోరును తొలగించాలని కోరతున్నారు.

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, ఉత్సవాలు... తదితర కార్యక్రమాల వివరాలను మాకు తెలపండి

విలేకరుల ఫోన్ నంబర్లు

గోపాలపట్నం	7396557667
ఎన్ఏడీ జంక్షన్	9985403297
మల్కాపురం/శ్రీహరిపురం	9553235551
సింధియా	9985411688

పోలీస్ స్టేషన్ల ఫోన్ నంబర్లు

గోపాలపట్నం ట్రాఫిక్: 2760264

లా అండ్ ఆర్డర్: 2520933

వంటగ్యాస్‌పై సబ్సిడీ తొలగింపు తగదు



వంటా వార్పు కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నేతలు

మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్

మల్కాపురం: వంట గ్యాస్‌పై సబ్సిడీని తొలగించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని లేకుంటే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ పేర్కొన్నారు. రామకృష్ణాపురం హెచ్‌పీసీఎల్ ప్రధాన ద్వారం వద్ద వైసీపీ నాయకులు వంటవార్పు కార్యక్రమాన్ని చేపట్టి నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్ పాలనతో కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌పై ధర పెంచితే పెంచిన ఆ సొమ్ములను ప్రభుత్వమే భరించి రాష్ట్ర ప్రజలకు లబ్ధి పొందేలా చేసిందని అన్నారు. అటువంటిది చంద్రబాబునాయుడు ప్రభుత్వం గ్యాస్‌పై ఏకంగా సబ్సిడీ తీసేస్తామని ప్రకటన చేసినా కనీసం స్పందించలేదని, ఇది అత్యంత దారుణమని అన్నారు. సబ్సీడీని తొలగించడం వలన అనేక మంది నిరుపేదలు ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వాలు తీసుకంటున్న పలు నిర్ణయాల వలన రాష్ట్ర ప్రజలు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో వైసీపీ మహిళా విభాగం అధ్యక్షరాలు పసుపులేటి ఉషాకిరణ్, వైఎస్ఆర్‌టీయూసీ జిల్లా అద్యక్షుడు కలిదండి బద్రీనాథ్, గాజువాక నియోజకవర్గం వైసీపీ కన్వీనర్ తిప్పల నాగిరెడ్డి, రాష్ట్ర వైసీపీ ప్రధాన కార్యదర్శి మళ్ల ధనలత, మూగి సూర్యనారాయణ, పిలక రామ్మోహన్‌రెడ్డి, పీవీ సురేష్, గులివిందల కృష్ణ, గుండపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు ఎంఆర్ వ్యాక్సిన్‌లు

గోపాలపట్నం: రుబెల్లా, మీజెల్స్ వ్యాక్సిన్‌లు విధిగా పిల్లలకు వేయించాలని సింహాచలం సీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కె.వి.జ్యోతి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రెబెల్లా, మీజెల్స్ వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ మీజిల్స్(తట్టు)వ్యాధి ఎంతో ప్రాణాంతకమైనదని న్యూమెనియా, అతిసారం వంటి సమస్యలతో ఇబ్బందులు పడతారని తెలిపారు. అదే విధంగా గర్భిణులకు రుబెల్లా సోకడం వలన పుట్టే బిడ్డలకు అంధత్వం, వినికిడిలోపం, బుద్ధిమాంద్యం, పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ఇటువంటి వ్యాధుల బారిన పడకుండా అన్ని వ్యాక్సినేషన్ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వ్యాక్సిన్‌లు వేయడం జరుగుతుందని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు విధిగా ఈ వ్యాధి నిరోధకాలు వేయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులు వ్యాధినిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎన్ఏడీ జంక్షన్: జీవీఎంసీ 67వ వార్డు పరిధి వినోద్‌నగర్ ప్రాంతంలో రహదారి నిర్మాణ పనులు, కాలువల మరమ్మతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. వార్డు ఏఈ నగేష్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. గత కొంత కాలంగా ఇక్కడి రహదారులు పూర్తిగా మరమ్మతులకు గురవ్వడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. .ఈ ప్రాంతంలో పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే గణబాబుకు స్థానికులు సమస్యను తెలిపారు. దీంతో ఆయన స్పందించిన వెంటనే పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అణ్వస్త్ర రహిత ప్రపంచానికి కృషి చేయాలి

మల్కాపురం: అణ్వస్త్ర రహిత ప్రపంచానికి అంతా కృషి చేయాలని బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళశాలలో జాతీయ సేవా పథకం. బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిరోషిమా, నాగసాకి అణు విధ్వంస సంస్మరణ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శాంతి, సహనం, సర్దుబాటు, విశాల భావాల, విశ్వ మానవ సౌభ్రాతృత్వం వంటి భావాలను యువత అలవర్చుకోవాలని పేర్కొన్నారు. సమావేశానికి కళాశాల ఎకడమిక్ కో-ఆర్డినేటర్ సిస్టర్ గెసిల్లా అధ్యక్షత వహించి మాట్లాడారు. శాంతి, సహనం మన నడవడికలో కనబడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారిణిలు ఈపీఎస్ బాగ్యలక్ష్మి, వై.అనసూయ దేవి, నాగమణి పాల్గొన్నారు.